బుధవారం
13-03-2024
విజయవాడ ప్రచురణ
సంపుటి : 72, సంచిక : 261
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

నా పదవీ కాలంలో జీతం తీసుకోను: జర్దారీ

ఇస్లామాబాద్: తన పదవీ కాలంలో జీతం తీసుకోబోనని పాకిస్థాన్ నూతన అధ్యక్షుడు ఆసిఫ్ అలీ జర్దారీ మంగళవారం ప్రకటించారు. ఆర్థిక సంక్షోభంలో పాకిస్థాన్ చిక్కుకొని ఉన్న క్రమంలో ప్రభుత్వ ఖజానాపై అదనపు భారం వేయరాదనే జర్దారీ ఈ మేరకు నిర్ణయించినట్లు 'ఎక్స్'లో పాకిస్థాన్ పీపుల్స్ పార్టీ (పీపీపీ) తెలిపింది. అధ్యక్ష కార్యాలయ మీడియా విభాగం కూడా ఈ మేరకు ప్రకటన వెలువరించింది. అయితే దేశ మాజీ అధ్యక్షుడు ఆరిఫ్ అల్వీ ప్రతి నెలా రూ.8,46,550 చొప్పున జీతం పొందేవారు. దీనిని 2018లో పాకిస్థాన్ పార్లమెంటు ఖరారు చేసింది. కాగా, దేశంలోని సంపన్న రాజకీయ నాయకుల్లో జర్దారీ ఒకరు.

ఫలించిన సుప్రీం కొరడా

ఈసీకి ఎన్నికల బాండ్ల వివరాలు

న్యూఢిల్లీ: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) మంగళవారం భారత ఎన్నికల సంఘానికి (ఈసీఐ) ఎన్నికల బాండ్ల వివరాలను సమర్పించింది. ఈ మేరకు ఎన్నికల సంఘం ధ్రువీకరించింది. 'సుప్రీంకోర్టు 2024, ఫిబ్రవరి 15, మార్చి 11న ఇచ్చిన ఆదేశాలకు కట్టుబడిన ఎస్‌బీఐ... ఎన్నికల బాండ్ల డేటాను ఈసీఐకి మార్చి 12వ తేదీన సమర్పించింది' అని 'ఎక్స్'లో ఈసీఐ పేర్కొంది. ఎన్నికల బాండ్లు రాజ్యాంగ విరుద్ధమైనవిగా పేర్కొంటూ వాటిని రద్దు చేయాలని సర్వోన్నత న్యాయస్థానం ఇటీవల ఆదేశాలిచ్చింది. వాటి వివరాలను ఎన్నికల సంఘానికి అందజేయాలని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ)కు సూచించింది. ఇందుకోసం జూన్ 30 వరకు గడువు కోరుతూ ఎస్‌బీఐ పెట్టుకున్న పిటిషన్‌ను సుప్రీంకోర్టు సోమవారం తిరస్కరించింది. మంగళవారం (12వ తేదీ) సాయంత్రంలోగా ఈసీకి ఎన్నికల బాండ్ల వివరాలు సమర్పించాలని ఎస్‌బీఐకు తేల్చిచెప్పింది. దీంతో సుప్రీం ఆదేశాలకు కట్టుబడుతూ ఈసీకి సంబంధిత వివరాలను ఎస్‌బీఐ అందజేసింది. ఎన్నికల బాండ్ల వివరాలను ఎస్‌బీఐ సమర్పించినట్లు ఈసీఐ ధ్రువీకరించింది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఈనెల 15వ తేదీ సాయంత్రం 5గంటల్లోగా ఎన్నికల బాండ్ల వివరాలను తన అధికారిక వెబ్‌సైట్‌లో ఈసీ పొందుపర్చాల్సి ఉంది. కాగా, 2018 నుంచి మొత్తం రూ.16,518 కోట్లు విలువ చేసే ఎన్నికల బాండ్లను ఎస్‌బీఐ జారీచేసింది. అయితే గడువు కోరుతూ ఎస్‌బీఐ సాగదీత ధోరణి హాస్యాస్పదమని ఆర్థికశాఖ మాజీ కార్యదర్శి ఎస్‌సీ గార్గ్ తన కాలమ్‌లో వ్యాఖ్యానించారు. బాండ్ల కొనుగోలుదారులను, బాండ్లు సేకరించిన రాజకీయ పార్టీలతో సరిపోల్చుకోవాలని బ్యాంకు భావించింది. ఇలా చేయాలని సుప్రీంకోర్టు కోరలేదు. కాబట్టి ఇది అనవసర ప్రయాసే అని ఆయన న్నారు. ఇలాంటి బాండ్లకు సీరియల్ నంబర్‌గానీ ఇతర గుర్తులుగానీ లేవు. కొనుగోలు-జమ విధానంలో ఎస్‌బీఐకి ఆయా ఎన్నికల బాండ్ల కొనుగోలుదారు, డిపాజిట్‌దారుని గుర్తింపు నమోదు చేయడం కుదరలేదు. 2018, జనవరి 2న ఎన్నికల బాండ్లను ప్రవేశపెట్టారు. నిధుల్లో పారదర్శకత కోసం పార్టీలకు ఇచ్చే నగదు విరాళాలకు ప్రత్యామ్నాయంగా ఎన్నికల బాండ్లను తీసుకొచ్చారు. 2018, మార్చిలో తొలి బాండు అమ్ముడుపోయింది.

పునర్విచారణకు ఆదేశాలివ్వండి: రాష్ట్రపతికి ఎస్‌సీబీఏ లేఖ

ఎన్నికల బాండ్ల కేసులో పునర్విచారణకు ఆదేశాలను తక్షణమే జారీ చేయాలని కోరుతూ రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ (ఎస్‌సీబీఏ) అధ్యక్షుడు ఆదిష్ సి.అగర్వాలా ఓ లేఖ రాశారు. పూర్తిస్థాయిలో న్యాయం జరగాలంటే సుప్రీంకోర్టు తీర్పుపై రాష్ట్రపతి అభిప్రాయాలను తీసుకోవాలని కోరారు. తద్వారా కేసు పునర్విచారణకు అవకాశం

- మిగతా 2 లో

బీజేపీ నాటకం

- హర్యానాలో వేడెక్కిన రాజకీయం
- గంటల వ్యవధిలో ప్రభుత్వాన్ని మార్చేసిన కాషాయ పార్టీ
- ఖట్టర్ రాజీనామా...కొత్త సీఎంగా నాయబ్ సింగ్ ప్రమాణం
- స్వతంత్రుల మద్దతుతో కొలువుదీరిన కొత్త సర్కారు
- మిత్రపక్షం జేజేపీని చీల్చేందుకు కుట్ర

చండీగఢ్: లోక్‌సభ ఎన్నికలకు ముందు హర్యానాలో నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. ప్రస్తుత ముఖ్యమంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్ రాజీనామా చేయడం... ఆయన స్థానంలో ఆ రాష్ట్ర నూతన ముఖ్యమంత్రిగా బీజేపీ ఎంపీ, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు నాయబ్ సింగ్ సైనీ(54) ప్రమాణస్వీకారం చేయడం గంటల వ్యవధిలోనే జరిగిపోయాయి. రాష్ట్ర గవర్నర్ బండారు దత్తాత్రేయ సైనీతో ప్రమాణ స్వీకారం చేయించారు. చండీగఢ్‌లోని రాజ్‌భవన్‌లో మంగళవారం సాయంత్రం ఈ కార్యక్రమం జరిగింది. సైనీతో పాటు మరో ఐదుగురు ఎమ్మెల్యేలు మంత్రులుగా ప్రమాణం చేశారు. వారిలో బీజేపీ నేతలు కన్వర్ పాల్, మూల్ చంద్ శర్మ, జై ప్రకాష్ దలాల్, బన్వారీ లాల్‌తోపాటు స్వతంత్ర ఎమ్మెల్యే రంజిత్ సింగ్ చౌతాలా ఉన్నారు. అయితే మాజీ హోంమంత్రి, అంబాలా కాంట్ నుంచి ఆరుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికైన అనిల్ విజ్‌కు కొత్త మంత్రివర్గంలో చోటు దక్కకపోవడం గమనార్హం. విజ్ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరు కాలేదు. ఇక్కడ పార్టీ సమావేశం ముగిసిన అనంతరం నేరుగా అంబాలా నివాసానికి చేరుకున్నారు.

స్వతంత్ర ఎమ్మెల్యేల మద్దతు

లోక్‌సభ సీట్ల సర్దుబాటుపై విభేదాల కారణంగా జేజేపీతో పొత్తుకు బీజేపీ స్వస్తి పలకడంతో ఇప్పటి వరకు దుష్యంత్ చౌతాలా నేతృత్వంలోని జననాయక్ జనతా పార్టీ (జేజేపీ)తో కలిసి సంకీర్ణ ప్రభుత్వం నడిపిన బీజేపీ... ఇప్పుడు స్వతంత్రుల మద్దతుతో సొంతంగా ప్రభుత్వం ఏర్పాటు చేసింది. కాగా జేజేపీకి చెందిన ఐదుగురు ఎమ్మెల్యేలు బీజేపీలో చేరనున్నట్లు ప్రచారం సాగుతోంది. అంతకుముందు ముఖ్యమంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ పదవికి రాజీనామా చేయడంతో రాష్ట్ర రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. మంగళవారం ఉదయం బీజేపీ కేంద్ర పరిశీలకులు చండీగఢ్ చేరుకోవడంతో ఖట్టర్ నేతృత్వంలోని మంత్రి మండలిలోని మొత్తం 13 మంది సభ్యులు గవర్నర్‌కు రాజీనామాలు సమర్పించారు. హర్యానాలో అధికార బీజేపీ-జేజేపీ సంకీర్ణం విడిపోతున్న నేపథ్యంలో ఈ పరిణామాలు చోటుచేసుకున్నాయి. అయితే దీనిపై రెండు పార్టీల నేతలు వెంటనే స్పందించలేదు. ఖట్టర్ నేతృత్వంలోని ప్రభుత్వంలో జేజేపీ నాయకుడు దుష్యంత్ చౌతాలా ఉప ముఖ్యమంత్రిగా ఉండగా... ఆయన పార్టీకి చెందిన మరో ఇద్దరు మంత్రులుగా ఉన్నారు. కాగా నలుగురు జేజేపీ ఎమ్మెల్యేలు జోగి రామ్ సిహాగ్, ఈశ్వర్ సింగ్, దేవిందర్ బబ్లీ , రామ్ నివాస్ సుర్జాఖేరా కూడా ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరవడం గమనార్హం. ప్రమాణస్వీకారం చేసిన అనంతరం సైనీ విలేకరులతో మాట్లాడుతూ... రాష్ట్రంలోని 10 లోక్‌సభ స్థానాల్లో బీజేపీ భారీ విజయం సాధిస్తుందన్నారు. రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు జరిగినప్పుడు పార్టీ మళ్లీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని చెప్పారు. తాను సీఎం కావడంపై స్పందిస్తూ... పార్టీ 'ఒక సాధారణ కార్యకర్తకు అలాంటి గౌరవం' ఇచ్చిందని తెలిపారు. ప్రమాణస్వీకారం చేసిన తర్వాత నాయబ్ సైనీ ఖట్టర్‌కు నమస్కరించి ఆశీస్సులు తీసుకున్నారు. 90 మంది సభ్యులున్న హర్యానా అసెంబ్లీలో

- మిగతా 2 లో

14 రోజులు డీఎస్సీ పరీక్షలు

షెడ్యూల్‌లో స్వల్ప మార్పులు: మంత్రి బొత్స

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఏపీ డీఎస్సీ-2024 పరీక్షలను స్వల్ప మార్పులతో 14 రోజులపాటు నిర్వహించనున్నట్లు విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ మంగళవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. రాష్ట్రంలో 6,100 ఉపాధ్యాయుల నియామకం కోసం ప్రకటించిన పరీక్షల షెడ్యూలులో మార్పులు చేసినట్లు తెలిపారు. ఫిబ్రవరి 25 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించామన్నారు. ముందస్తుగా ప్రకటించిన ప్రకారం ఈనెల 15 నుంచి పరీక్షలు ప్రారంభం కావాల్సి ఉన్నప్పటికీ, కొన్ని కారణాల రీత్యా 30 వ తేదీ నుంచి ఏప్రిల్ 30 వరకు నిర్వహిస్తున్నామని మంత్రి స్పష్టం చేశారు. 14 రోజుల పాటు రెండు సెషన్లలో పరీక్షలను నిర్వహించేలా షెడ్యూలు రూపొందించామన్నారు. ఈ విషయాన్ని అభ్యర్థులు గమనించాలని కోరారు. సెకండరీ గ్రేడ్ టీచర్ పోస్టులకు(ఎస్జీటీ) అర్హతలను మార్చడం, టెట్ పరీక్షకు డీఎస్సీ పరీక్షకు మధ్యన తగిన సమయం ఇవ్వడం తదితర కారణాల వల్ల షెడ్యూల్ లో మార్పులు అనివార్యమయ్యాయని మంత్రి వివరించారు. పరీక్షా కేంద్రాల ఎంపికకు ఈనెల 20 నుంచి వెబ్ ఆప్షన్లు ద్వారా అభ్యర్థులకు అవకాశం కల్పిస్తున్నామని, హాల్ టిక్కెట్లను ఈనెల 25 నుంచి డౌన్ లోడ్ చేసుకోవచ్చని

- మిగతా 2 లో

మణిపూర్ హింసపై దర్యాప్తు సమగ్ర నివేదిక ఇవ్వండి

రాష్ట్ర ప్రభుత్వం, సీబీఐ, ఎన్ఐఏకు సుప్రీం ఆదేశం

న్యూఢిల్లీ: మణిపూర్‌లో హింసపై కేసుల దర్యాప్తులో ఏ మేరకు పురోగతి వచ్చిందో తెలపాలని ఆ రాష్ట్ర ప్రభుత్వం, సీబీఐ, ఎన్ఐఏకు సుప్రీం కోర్టు ఆదేశాలిచ్చింది. దర్యాప్తు ఏ దశలో ఉంది, రెండు వర్గాల మధ్య పోరుపై కేసుల్లో నమోదైన చార్జిషీట్లకు సంబంధిన వివరాలతో సమగ్ర నివేదిక ఇవ్వాలని సూచించింది. తద్వారా కోర్టు విచారణను అసోంలో జరిపాలా లేక మణిపూర్‌లోనే చేపట్టాలా అన్నది నిర్ణయించాలని సీజేఐ చంద్రచూడ్ నేతృత్వ త్రిసభ్య ధర్మాసనం భావించింది. నిందితుల్లో ఒకరు నేరం జరిగినప్పుడు జువనైల్‌గా ఉన్న విషయాన్ని గుర్తించింది. దీంతో సంబంధిత కేసుల విచారణలో ఏ విధంగా ముందుకు వెళ్లాలో నిర్ణయించేందుకు మణిపూర్ ప్రభుత్వం, సీబీఐ, ఎన్ఐఏ నుంచి పూర్తి వివరాలను సర్వోన్నత న్యాయస్థానం కోరింది. స్టేటస్ రిపోర్టు ద్వారా చార్జిషీట్లు దాఖలయ్యాయా లేదో తేలుతుందని, ఎన్ని కేసుల్లో వాటిని నమోదు చేశారు... ఏయే కేసుల్లో విచారణ ఏయే దశల్లో ఉన్నది వివరంగా తెలపాలని కోర్టు పేర్కొంది. కొన్ని అంశాల్లో కోర్టు ఉత్తర్వులు జారీ చేయలేదని, శాంతి భద్రతలను కాపాడాలని పౌర సంఘాలకు ఆదేశాలివ్వబోమని త్రిసభ్య ధర్మాసనం తెలిపింది. శాంతి భద్రతల పరిస్థితిని చూసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఉందని పేర్కొంది. 'కుకీలు, మయితేలు ఇద్దరికీ నష్టం జరిగింది. లోయల్లోనూ, గిరి ప్రాంతాల్లోనూ బాధితులు ఉన్నారు.

ప్రభుత్వాలను కూల్చే కసాయి బీజేపీ

- ఎన్నికల్లోపు బాండ్ల వ్యవహారం నిగ్గుతేల్చాలి
- మోదీ ఓటమితోనే దేశానికి భవిష్యత్తు
- సీపీఐ కార్యదర్శి నారాయణ
- 15న విశాఖలో జరిగే కాంగ్రెస్ సభకు సీపీఐ మద్దతు: రామకృష్ణ

విశాలాంధ్ర-విజయవాడ: ప్రజాస్వామ్యబద్ధంగా ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాలను కూల్చేసే కసాయి పార్టీ బీజేపీ అని సీపీఐ కార్యదర్శి కే నారాయణ ఘాటుగా విమర్శించారు. విజయవాడ సీపీఐ రాష్ట్ర కార్యాలయం దాసరి భవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తరువాత దానికి వ్యతిరేకంగా ఉన్న ప్రభుత్వాలను, పార్టీలను దెబ్బతీయడమే పనిగా పెట్టుకుందన్నారు. కుట్రలతో గోవా, మణిపూర్‌లో ప్రభుత్వాలను కూలదోసిందని... కర్నాటకలో కూడా ప్రయత్నించిందన్నారు. అమ్‌ఆద్మీ పార్టీ ఇంకా లొంగని కారణంగా కేజ్రీవాల్‌పై కేసులు పెట్టిందని, మనీశ్ సిసోడియాను ఇంకా జైల్లోనే ఉంచిందన్నారు. ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసిన వారు అదే ప్రజాస్వామ్యం చేతిలో ఓడిపోక తప్పదని నారాయణ స్పష్టం చేశారు. ఇందిరా గాంధీ, కేసీఆర్ లాంటి వారు ఓడిపోవటమే దానికి నిదర్శనం అన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాలను ఎస్‌బీఐ తోసిపుచ్చటం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయటమే అన్నారు. ఎన్నికల బాండ్ల రూపంలో బీజేపీకి రూ.6,500 కోట్లు వెళ్లాయని వాటి లెక్కలు చెప్పాలని డిమాండ్ చేశారు. దేశాన్ని లూటీ చేసి విదేశాల్లో ఉన్నవారు ఎక్కువగా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, పంజాబ్ నేషనల్ బ్యాంకుల నుంచే అప్పులు తీసుకున్నారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వాన్ని కాపాడేందుకే ఎస్‌బీఐ లెక్కలు చెప్పటానికి జూన్ నెల వరకు గడువు కోరిందన్నారు. ఎన్నికల బాండ్లు ఎవరి వద్ద నుంచి వచ్చాయి? అందుకు ప్రతిఫలంగా వారికి మోదీ సర్కార్ ఏమి ఇచ్చిందనే విషయాన్ని బహిర్గతం చేయాలన్నారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల లోపు ఎన్నికల బాండ్ల వ్యవహారం బయటపెట్టాలని డిమాండ్ చేశారు. ప్రజా ఉద్యమం ద్వారా ఆర్థిక నేరవ్యవస్థను ధ్వంసం చేస్తామని హెచ్చరించారు. దేశవ్యాప్తంగా ఎస్‌బీఐ అన్ని బ్రాంచ్‌ల వద్ద ఆందోళనలు చేస్తామన్నారు. బీజేపీ ప్రచారంలో ఎన్‌డీఏ గ్యారెంటీ, బీజేపీ గ్యారెంటీ, కేంద్రం గ్యారెంటీ అని కాకుండా మోదీ గ్యారెంటీ అని ప్రచారం చేస్తున్నారని నారాయణ చెప్పారు. నేనే రాముడ్ని, నేనే కృష్ణుడ్ని అంటూ మోదీ తనకు తాను విష్ణుమూర్తి 11వ అవతారంగా ప్రకటించుకునే ప్రయత్నంలో ఉన్నారని ఎద్దేవా చేశారు. తాను సముద్రంలోకి వెళ్లాను కాబట్టి తానే సాహస వంతుడ్ని, ధైర్యవంతుడ్ని అని చెబుతున్నారని విమర్శించారు. సముద్రంలో శిలాశకలాలకు దండం పెట్టటం తెలివితక్కువతనమన్నారు. బీజేపీ

- మిగతా 2 లో

సీఏఏ వెనక్కి...

దిల్లీ, అసోం, కేరళలో మిన్నంటిన డిమాండ్

- విపక్షాల అధ్వర్యంలో ప్రదర్శనలు, ధర్నాలు
- ప్రధాని, హోంమంత్రి దిష్టిబొమ్మల దహనం - చట్టం ప్రతులకు నిప్పు
- జామియా మిలియా, దిల్లీ వర్సిటీలలో ఆందోళనలు
- 55 మంది డీయూ విద్యార్థుల ముందస్తు అరెస్టు
- కేరళలో విద్యార్థులపై విరిగిన లాఠీ, కేసులు నమోదు

న్యూఢిల్లీ/గువహటి/తిరువనంతపురం: వివాదాస్పద పౌరసత్వ సవరణ చట్టాన్ని తక్షణ ఉపసంహరించుకోవాలన్న డిమాండ్ మరోమారు బిగ్గరగా వినిపిస్తోంది. ఈ చట్టాన్ని అమలు చేస్తే ఆందోళనలు తీవ్ర రూపం దాల్చుతాయని కేంద్రానికి నిరసనకారుల నుంచి హెచ్చరికలు వెళ్లాయి. దేశ రాజధాని దిల్లీలోని జామియా మిల్లియా ఇస్లామియా యూనివర్సిటీ, దిల్లీ యూనివర్సిటీలో విద్యార్థులు ఆందోళనకు దిగారు. అసోం, కేరళ రాష్ట్రాల్లో నిరసనలు పెద్దఎత్తున జరిగాయి. అసోంలో ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్‌షా దిష్టిబొమ్మలను నిరసనకారులు దహనం చేశారు. సీఏఏ ప్రతులను మంటల్లో వేశారు. జామియా విద్యార్థులు మంగళవారం తమ వర్సిటీ గేటు వద్ద విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. తక్షణమే సీఏఏ-2019ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నాలుగేళ్ల కిందట సీఏఏ వ్యతిరేకాందోళనలలో భాగంగా అరెస్టైన విద్యార్థులందరినీ వెంటనే విడుదల చేయాలని, వారిపై కేసులను ఎత్తివేయాలని కూడా డిమాండ్ చేశారు. 'దిల్లీ పోలీస్ వాపస్ జావ్', ఇంక్విలాబ్ జిందాబాద్' అంటూ నినదించారు. వర్సిటీ ప్రాంగణం నుంచి భద్రతా బలగాల ఉపసంహరణకూ డిమాండ్ చేశారు. నిరసనలో విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ప్రాంగణంలో దిల్లీ పోలీస్, పారా మిలటరీ బలగాలను మోహరించి డ్రోన్లను నిఘా పెంచారు. దీనిని వర్సిటీ విద్యార్థులు వ్యతిరేకించారు. మరోవైపు దిల్లీ యూనివర్సిటీలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. 55 మందిని పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. ఈమేరకు ఏఐఎస్ఏ శాఖాధ్యక్షుడు మాణిక్ గుప్తా తెలిపారు. ఆర్ట్స్ ఫాకల్టీ వద్ద ఉన్న విద్యార్థులను కేవలం అనుమానం వచ్చినందుకే పోలీసులు అరెస్టు చేశారని, వారితో చాలా దురుసుగా ప్రవర్తించారని ఆరోపించారు. అయితే ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగానే దిల్లీ వర్సిటీ సెంట్రల్ లైబ్రరి వద్ద ఉన్న 50-55 మంది విద్యార్థులను అదుపులోకి తీసుకున్నట్లు డిప్యూటీ పోలీస్ కమిషనర్ ఎంకే మీనా

- మిగతా 2 లో

ఇదీ లోకం!

అభివృద్ధి లక్ష్యంగా అడుగులు

- ముంపు నుంచి విజయవాడకు శాశ్వత విముక్తి
- రూ.369 కోట్లతో నిర్మించిన రిటైనింగ్ వాల్ ప్రారంభోత్సవంలో సీఎం జగన్

2లో

ఎమ్మెల్సీలు రామచంద్రయ్య, వంశీ కృష్ణయాదవ్‌పై వేటు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: వైసీపీ నుంచి వివిధ పార్టీలకు ఫిరాయించిన ఇద్దరు ఎమ్మెల్సీలపై వేటు వేశారు. ఈ మేరకు ఎమ్మెల్సీ సి.రామచంద్రయ్య, వంశీ కృష్ణయాదవ్‌పై వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా విచారించి శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు చర్యలు తీసుకున్నారు. గతంలో వైసీపీ నుంచి ఎన్నికైన సి.రామచంద్రయ్య ఇటీవల టీడీపీలోకి, వంశీకృష్ణ యాదవ్ జనసేనలో చేరారు. వీరిపై పార్టీ ఫిరాయింపుల కింద చర్యలు తీసుకోవాలని మండలి

- మిగతా 2 లో

సీఏఏ అమలుపై స్టే విధించాలి

సుప్రీంలో ఐయూఎంఎల్ పిటిషన్

2లో

యుద్ధాలను ప్రోత్సహించొద్దు

- ఇటలీ, యూరోప్ ప్రభుత్వాలకు డిమాండ్
- గాజాకు సంఘీభావంగా రోమ్‌లో భారీ ప్రదర్శన

రోమ్: యుద్ధాలను ప్రోత్సహించవద్దని, ఆయుధాలు సరఫరా చేయొద్దని, సైనిక సాయాన్ని అందించవద్దని ఇటలీ, యూరప్ ప్రభుత్వాలను నిరసనకారులు డిమాండ్ చేశారు. ఇటలీలోని శ్రామిక వర్గం ఏకమై పలస్తీనా ప్రజలకు సంఘీభావంగా గాజాలో కాల్పుల విరమణను డిమాండ్ చేస్తూ రోమ్‌లో కదం తొక్కింది. శాంతి కోసం పిలుపునిచ్చింది. అసిసీ పేస్ గ్యుస్టా కమిటీ పిలుపుతో ఇటాలియన్ నెట్‌వర్క్ ఫర్ పీస్ అండ్ డిస్‌ఆర్మమెంట్, ది ఇటాలియన్ జనరల్ కాన్ఫెడరేషన్ ఆఫ్ లేబర్ (సీజీఐఎల్), ది కమ్యూనిస్ట్ రీఫౌండేషన్ పార్టీ (పీఆర్‌సీ), యూనియన్ ఆఫ్ యూనివర్సిటీ స్టూడెంట్స్ (యూడీసీ) సహా వివిధ సంఘాలు పాల్గొన్నాయి. ఇజ్రాయిల్ మారణ హోమాన్ని తిరస్కరించాయి. యుద్ధాలకు మద్దతుగా ఆయుధాలను పంపడాన్ని తక్షణమే ఆపేయాలని ఇటలీ, యూరోపియన్ ప్రభుత్వాలను డిమాండ్ చేశాయి. గాజాలో ఇజ్రాయిల్ 150 రోజులకుపైగా దాడులు కొనసాగిస్తోంది. 31వేల మందికిపైగా మృత్యువాత పడ్డారు. మానవతా సాయాన్ని ఇజ్రాయిల్ అడ్డుకుంటుండటంతో పలస్తీనియన్ ప్రజల్లో ఆకలిచావులు సంభవిస్తున్నాయి. ఈ పరిస్థితులపై తీవ్ర ఆవేదనను వ్యక్తంచేస్తూ తక్షణమే కాల్పుల విరమణ కోసం ఇటలీవ్యాప్తంగా వేర్వేరు నగరాల్లో పలస్తీనాకు అనుకూలంగా ప్రదర్శనలు జరిగాయి. రోమ్‌లో కమ్యూనిస్ట్ రీఫౌండేషన్ పార్టీ నాయకుడు ఎలానా మజోని మాట్లాడుతూ 'అన్ని యుద్ధాలను ఆపేద్దాం. ఆయుధాలు ఎగుమతి నిలుపివేద్దాం' అని పిలుపునిచ్చారు. యుద్ధ విధానాలపై నిరసించే హక్కు మనకున్నదని ఉద్ఘాటించారు. ఆరోగ్యం, విద్య, సంక్షేమం కోసం పెట్టుబడులు కావాలే తప్ప ఆయుధాల కోసం కాదని నినదించారు. ఫైస్టార్ ఉద్యమాన్ని కమ్యూనిస్ట్ యూత్ ఫ్రంట్ (ఎఫ్‌జీసీ) దుయ్యబట్టింది. ఎర్ర సముద్రంలో సైనిక మిషన్ల కోసం ఇటలీ దళాలను పంపుతున్నమ మెలోనీ ప్రభుత్వానికి అనుకూలంగా డెమొక్రటిక్ పార్టీ ఉన్నదని విమర్శించింది. దాడులు చేస్తూ ఆత్మరక్షణ మిషన్‌గా సమర్థించుకుంటున్నారని వ్యాఖ్యానించింది. ఎర్రసముద్రంలో చేపట్టే సైనిక మిషన్లలో ఇటలీ జోక్యాన్ని ఆమోదిస్తూ ఇటలీ పార్లమెంటు తీర్మానం చేయడాన్ని లెఫ్ట్ గ్రూపులు ఖండించాయి.

శాంతి స్థాపనకు ఇదే సమయం

- రమదాన్ వేళ తుపాకులు మూగబోవాలి
- గాజా, సూడాన్‌లో కాల్పుల విరమణకు గుటెర్రస్ పిలుపు

ఐరాస: పవిత్ర రమదాన్ మాసం ప్రారంభమైంది. ప్రపంచవ్యాప్తంగా ముస్లింలు ఉపవాస దీక్షలు ప్రారంభించారు. ఈ పవిత్ర మాసం స్ఫూర్తిని గౌరవిస్తూ కాల్పులు విరమించాలని, శాంతి స్థాపనకు ఇదే సమయమని ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెర్రస్ నొక్కిచెప్పారు. రమదాన్ వేళ గాజాతో పాటు సూడాన్‌లోనూ కాల్పుల విరమణకు పిలుపునిచ్చారు. శాంతి, సామరస్యం, సౌభ్రాతృత్వాన్ని ఉబ్బోధించే రమదాన్ వేళ గాజాలో రక్తపాతం ఆగడం లేదు. రమదాన్ స్ఫూర్తికి గౌరవించాలి. తుపాకులు మూగబోవాలి. ప్రాణాలు నిలిపే మానవతా సాయానికి పెంచాలి. దాని సరఫరాకు అడ్డంకులు తొలగించాలి' అని గుటెర్రస్ నొక్కిచెప్పారు. గాజాలో దయనీయ పరిస్థితులు ఉన్నాయని, చిన్న పిల్లలు సైతం ఆహారం లేక మృత్యుఒడికి చేరుతున్నారని తెలిపారు. రమదాన్ మొదటి రోజు పలస్తీనియన్లు బాంబుల మోతతో మేల్కొన్నారు. చుట్టూ శిథిలాల్లో తమ వారి కోసం వెతుకున్నారు. ఇజ్రాయిల్ దళాల భీకర దాడులతో రక్తపాతం కొనసాగుతోంది. కనీసం రమదాన్‌ను గౌరవించి కాల్పులను విరమించాలని గుటెర్రస్ పిలుపునిచ్చారు. సూడాన్ పరిస్థితిని ప్రస్తావిస్తూ అక్కడ కూడా కాల్పుల విమరణ జరగాలని నొక్కిచెప్పారు. శాంతికి ఇదే సమయమన్నారు. 'శాంతి నెలకొల్పేందుకు మీకు చేతనైనదంతా చేయండి అని రాజకీయ, మత, సామాజిక నాయకులకు పిలుపునిస్తున్నా' అని గుటెర్రస్ పేర్కొన్నారు.

హైతీ ప్రధాని హెన్రీ రాజీనామా

మెక్సికో: హైతీలో అనిశ్చితి వేళ ప్రధాని ఏరియల్ హెన్రీ తన రాజీనామాను ప్రకటించారు. ట్రాన్సిషనల్ ప్రెసిడెన్షియల్ కౌన్సిల్ ఏర్పాటైన తర్వాత హెన్రీ తన ప్రధాని పదవి నుంచి తప్పుకుంటారని స్థానిక మీడియా తెలిపింది. 'ట్రాన్సిషన్ మండలి ఏర్పాటు అయిన మరుక్షణం నా ప్రభుత్వం రాజీనామా చేస్తుంది' అని హెన్రీ మంగళవారం వీడియో సందేశమిచ్చారు. సాధ్యమైనంత త్వరగా శాంతి,సుస్థిరత నెలకొనేందుకు తమ వంతు కృషి చేయాలని, సంయమనం పాటించాలని హైతీ ప్రజలకు పిలుపునిచ్చారు. స్థానికులకు అత్యవసర మానవతా సాయం అందజేయడంతో పాటు రాజకీయ పరివర్తన నేపథ్య కార్యాచరణపై చర్చించేందుకు జమైకా సమీపంలో అత్యవసర సదస్సును కెరేబియన్ వర్గ నాయకులు నిర్వహించారు. కాగా, ఫిబ్రవరి చివరి నుంచి హైతీలో శాంతి భద్రతలు క్షీణించాయి. పోర్ట్ అవ్ ప్రిన్స్‌లోని ప్రభుత్వ సంస్థలపై సాయుధులు దాడులకు తెగబడ్డారు. హెన్రీ రాజీనామాకు డిమాండ్ చేస్తూ హైతీలోని పోలీసు స్టేషన్లు, పోలీసు అకాడమీ, అంతర్జాతీయ విమానాశ్రయంపైనా దాడులు చేశారు.

వైసీపీ 12వ జాబితా విడుదల

గాజువాక ఇన్‌ఛార్జ్‌గా మంత్రి గుడివాడ అమర్‌నాథ్

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి: వైసీపీ తాజాగా 12వ జాబితాను మంగళవారం రాత్రి విడుదల చేసింది. చిలకలూరిపేట (అసెంబ్లీ) ఇన్‌ఛార్జ్‌గా కావటి మనోహర్ నాయుడును, గాజువాక (అసెంబ్లీ) ఇన్‌ఛార్జ్‌గా మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌ను నియమించింది. ఈ జాబితాతో పాటు కర్నూలు మేయర్‌గా సత్యనారాయణమ్మను ఎంపిక చేశారు. అంతకుముందు కర్నూలు మేయర్‌గా ఉన్న బీవీ రామయ్యను కర్నూలు పార్లమెంటు ఇన్‌ఛార్జ్‌గా ప్రకటించడంతో ఈ మార్పు చేపట్టారు. ప్రభుత్వ విప్‌గా ఎమ్మెల్సీ వరుదు కల్యాణిని నియమించారు. అంతకముందు ఉన్న ప్రభుత్వ విప్ జంగా కృష్ణమూర్తి స్థానంలో ఆమెకు బాధ్యతలు అప్పగించారు. వైసీపీ అధినేత, సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ఈ కేటాయింపులు చేపట్టారు.

వంశీ కృష్ణయాదవ్‌పై వేటు

(మొదటిపేజీ తరువాయి)

కార్యదర్శికి వైసీపీ చీఫ్ విప్ మేరిగ మురళీధర్, ఎమ్మెల్సీ అప్పిరెడ్డి ఫిర్యాదు చేశారు. దీంతో ఫిరాయింపుల నిరోధక చట్టం కింద ఎందుకు మీపై చర్యలు తీసుకోకూడదని మండలి చైర్మన్ వారిద్దరికి నోటీసులు పంపారు. ఆ తర్వాత వారు చైర్మన్‌కు వివరణ ఇచ్చారు. దీనిపై సమగ్ర విచారణ నిర్వహించి వారిద్దరిపై అనర్హత వేటు వేసినట్లు చైర్మన్ మోషెన్‌రాజు వెల్లడించారు. గతంలో ఇదే తరహాగా వైసీపీ, టీడీపీకి చెందిన ఎనిమిది ఎమ్మెల్యేలపై అసెంబ్లీ స్పీకర్ అనర్హత వేటు వేశారు. వరుసగా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలపై అనర్హత వేటుకు చర్యలు తీసుకోవడం చర్చనీయాంశంగా మారింది.

14 రోజులు డీఎస్సీ పరీక్షలు

(మొదటిపేజీ తరువాయి)

తెలిపారు. నూతన షెడ్యూల్ ద్వారా లభించిన అవకాశాన్ని అభ్యర్థులందరూ సద్వినియోగం చేసుకుని పరీక్షలకు సిద్ధం కావాలని విజ్ఞప్తి చేశారు.

వివరాలివి... డీఎస్సీ పరీక్షలు ఈనెల 30 నుంచి ఏప్రిల్ 30 వరకు ప్రతి రోజు ఉదయం సెషన్–1, మధ్యాహ్నం సెషన్ –2 లలో ఎస్జీటీ (తెలుగు మీడియం) పరీక్షలను నిర్వహిస్తారు. 31న, ఏప్రిల్ ఒకటిన, రెండో తేదీన సెషన్–1, సెషన్–2లలో ఎస్జీటీ (తెలుగు మీడియం) పరీక్షలు జరుగుతాయి. మూడున సెషన్–1లో ఎస్జీటీ (తెలుగు మీడియం), సెషన్–2లో ఎస్జీటీ తెలుగు మీడియంతో పాటు ఉర్దూ, కన్నడ, ఒరియా మీడియాలో పరీక్షలు నిర్వహిస్తారు. ఏడున ఇంగ్లీషు ప్రొఫెసిసెన్సీ పరీక్షలను మూడు సెషన్లలో నిర్వహిస్తారు. 13వ తేదీన సెషన్–1లో బయాలజికల్ సైన్స్(తెలుగు మీడియం), సెషన్ –2లో బయాలజికల్ సైన్స్ కన్నడ, ఒరియా, తమిళ, తెలుగు, ఉర్దూ మీడియాల్లో జరుగుతాయి. 14న సెషన్ –1లో పోస్టు గ్రాడ్యుయేట్ టీచర్స్ (పీజీటీ) లాంగ్వేజెస్‌లో భాగంగా ఇంగ్లీషు, పీజీటీ ఎకనామిక్స్, పీజీటీ కామర్స్, పీజీటీ జువాలజీ పరీక్షలను ఇంగ్లీషు మీడియంలో నిర్వహిస్తారు.

అదే రోజు సెషన్ –2లో ఫిజికల్ డైరెక్టర్ల పరీక్షలు ఉంటాయి. 16వ తేదీన సెషన్ –1లో స్కూల్ అసిస్టెంట్ (ఎస్ఏ) మేథమేటిక్స్ (తెలుగు మీడియం), సెషన్ –2లో ఎస్ఏ మేథమేటిక్స్ కన్నడ, ఒరియా, తెలుగు, ఉర్దూ మీడిమాలలో పరీక్షలను నిర్వహిస్తారు. 17న సెషన్– 1లో ఎస్ఏ మేథమేటిక్స్ తెలుగు మీడియం, సెషన్ –2లో ఎస్ఏ ఫిజికల్ ఎడ్యుకేషన్, పీజీటీ బయాలజికల్ సైన్స్ (ఇంగ్లీషు మీడియం) పరీక్షలు ఉంటాయి. 22న సెషన్ –1లో ఎస్ఏ లాంగ్వేజెస్ హిందీ, పీజీటీ ఫిజికల్ సైన్సెస్ (ఇంగ్లీషు మీడియం), ఎస్ఏ సోషల్ స్టడీస్(తెలుగు మీడియం) పరీక్షలను నిర్వహిస్తారు. అదే రోజు సెషన్–2లో భాగంగా ఎస్ఏ ఫిజికల్ సైన్సెస్ (తెలుగు మీడియం) జరుగుతుంది.

23న సెషన్ –1లో ఎస్ఏ సోషల్ స్టడీస్ (తెలుగు మీడియం), సెషన్ –2లో సోషల్ స్టడీస్ తెలుగు, ఉర్దూ మీడియాలకు నిర్వహిస్తారు. 24న సెషన్ –1లో ఎస్ఏ ఇంగ్లీషు, సెషన్ –2లో ఎస్ఏ సోషల్ స్టడీస్ (తెలుగు మీడియం) పరీక్ష జరుగుతుంది. 25న సెషన్ –1లో ఎస్ఏ తెలుగు, పీజీటీ (హిందీ), సెషన్ –2లో ఎస్ఏ లాంగ్వేజెస్ కన్నడం, తెలుగు, ఉర్దూతోపాటు ప్రిన్సిపాల్ పోస్టుకు పరీక్షలు నిర్వహిస్తారు. 26న సెషన్ –1లో ట్రైన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్ (టీజీటీ) తెలుగు, సెషన్– 2లో టీజీటీ మేథమేటిక్స్ పరీక్షలు ఉంటాయి. 29న సెషన్ – 1లో టీజీటీ సోషల్ స్టడీస్, టీజీటీ సైన్స్ ఇంగ్లీషు మీడియంలో పరీక్షలు, అదే రోజు సెషన్– 2లో టీజీటీ బయాలజికల్ సైన్స్, టీజీటీ సంస్కృతం, పీజీటీ మేథమేటిక్స్ పరీక్షలను జరుగుతాయి. 30వ తేదీన సెషన్–1లో టీజీటీ ఇంగ్లీషు, పీజీటీ ఇంగ్లీషు, పీజీటీ బోటనీ, సెషన్ – 2లో టీజీటీ హిందీ, టీజీటీ ఫిజికల్ సైన్స్, పీజీటీ సోషల్ స్టడీస్ పరీక్షలను ఇంగ్లీషు మీడియంలో నిర్వహిస్తారు.

ఫలించిన సుప్రీం కొరడా

(మొదటిపేజీ తరువాయి)

ఉంటుందని, పార్లమెంటుకు, రాజకీయ పార్టీలకు, కార్పొరేట్లకు, సామాన్యులకు సంపూర్ణ న్యాయం జరుగుతుందని సీనియర్ న్యాయవాది పేర్కొన్నారు. ఏ కార్పొరేట్ నుంచి ఎంత నిధి వచ్చిందో బహిర్గతం చేయాలని ఈసీకి సుప్రీంకోర్టు ఆదేశాలివ్వడమే ఈ తీర్పులో ప్రమాదకరమైన భాగమని, ఇది పార్లమెంటరీ ప్రజాస్వామ్యం, కార్పొరేట్ స్వేచ్ఛను హరిస్తుందన్న అభిప్రాయాన్ని లేఖలో ఆయన వ్యక్తంచేశారు.

అభివృద్ధి లక్ష్యంగా అడుగులు

విశాలాంధ్ర బ్యూరో– అమరావతి: వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లుగా ప్రతి అడుగులోనూ అభివృద్ధి అంటే ఇదీ అని చేసి చూపిస్తోందని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. కనకదుర్గ వారధి వద్ద ఇరిగేషన్ రిటైనింగ్ వాల్, రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్‌కు సీఎం మంగళవారం ప్రారంభోత్సవం చేశారు. అలాగే విజయవాడ కార్పొరేషన్ పరిధిలో పేదలకు ఇచ్చిన పట్టాలకు శాశ్వత హక్కులు కల్పించి లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా సీఎం జగన్ మాట్లాడుతూ విజయవాడ నగరంలో రకరకాల కేటగిరీల్లో ఉన్న 31,866 ఇళ్లకు పట్టాలను రెగ్యులరైజ్ చేసి ఆ కుటుంబాలకు సంపూర్ణ హక్కులు ఇచ్చే మంచి కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. ఇందులో 22ఏ కింద పూర్తి హక్కులు లేక, రిజిస్ట్రేషన్ చేయడానికి ఇబ్బంది పడే పరిస్థితిలో ఉన్న దాదాపు 21 వేల మంది విజయవాడ సెంట్రల్, పశ్చిమ, తూర్పు నియోజకవర్గాల్లోని 16 కాలనీల ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. రూ.239 కోట్లతో రకరకాల ప్రాంతాల్లో సీవేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్లకు శంకుస్థాపనలు చేసుకున్నామన్నారు. కృష్ణానది వరద ముంపు నుంచి ప్రజలకు రక్షణగా రూ.500 కోట్లతో నిర్మించుకున్న రిటైనింగ్ వాల్‌ను పూర్తి చేసుకోవడం ప్రభుత్వ పారదర్శకతకు నిదర్శనంగా పేర్కొన్నారు. కరకట్ట గోడ కట్టడమే కాకుండా కృష్ణలంక ప్రాంతంలో ఉన్న అక్కచెల్లెమ్మలు, మన పిల్లలు, మన అవ్వలు, తాతలు అందరూ ఆహ్లాదకరంగా సాయంత్రం పూట పార్కులో నడుచుకుని పోయేట్టుగా సుందరీకరణ చేస్తూ పార్కులు రూపొందించే కార్యక్రమాలు కూడా జరుగుతున్నాయన్నారు. నగరంలో రూ.400 కోట్లకు పైగా ఖర్చు చేసి అంబేద్కర్ పార్కును కూడా శంకుస్థాపన చేయడం, ప్రారంభించడం జరిగిందని గుర్తు చేశారు.

అయితే ఏమీ చేయని మన వ్యతిరేకులంతా అభివృద్ధి లేదంటున్నారని, దీనిపై ప్రజలే ఆలోచన చేయాలని కోరారు. ఈ 58 నెలల కాలంలోనే మీ స్కూళ్లు, మీ హాస్పటళ్లు అన్నీ బాగుపడ్డాయి. గ్రామీణ స్థాయిలో వ్యవసాయం చేసే తీరు పూర్తిగా మారిపోయింది. వలంటీర్ల వ్యవస్థ, సచివాలయ వ్యవస్థ ఇంటింటికీ వచ్చి ఆప్యాయంగా పలకరిస్తూ మంచి చేసే కార్యక్రమం చేపడుతున్నారని సీఎం వివరించారు. ఈ కార్యక్రమంలో విజయవాడ నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, ఎంపీ కేశినేని నాని, విజయవాడ సెంట్రల్, పశ్చిమ శాసన సభ్యులు మల్లాది విష్ణు, వెలంపల్లి శ్రీనివాసరావు, తూర్పు నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ దేవినేని అవినాశ్ తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకార కుటుంబాలకు సహాయం

డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ, కాకినాడ జిల్లాల్లో ఓఎన్జీసీ పైపులైను కారణంగా ఉపాధి కోల్పోయిన 23,459 కుటుంబాలకు ఐదో విడతగా ఒక్కొక్కరికి నెలకు రూ.11,500 చొప్పున 6 నెలలకు గాను రూ.69,000, మొత్తం 161.86 కోట్ల రూపాయలను క్యాంపు కార్యాలయం నుంచి సీఎం జగన్ బటన్ నొక్కి నేరుగా వారి ఖాతాల్లో జమ చేశారు.

బీజేపీ నాటకం

(మొదటిపేజీ తరువాయి)

బీజేపీకి 41 మంది ఎమ్మెల్యేలు ఉండగా, జేజేపీకి 10 మంది ఉన్నారు. ఖట్టర్ ప్రభుత్వం ఏడుగురు స్వతంత్రులలో ఆరుగురి మద్దతును పొందడంతో జేజేపీ మద్దతు లేకపోయినా బీజేపీ తాపీగా ఉంది. కాగా ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్‌కు 30 మంది ఎమ్మెల్యేలు ఉండగా, ఇండియన్ నేషనల్ లోక్ దళ్, హర్యానా లోక్‌హిత్ పార్టీకి ఒక్కో ఎమ్మెల్యే ఉన్నారు. అనూహ్య పరిణామాల నేపథ్యంలో జేజేపీ కూడా దిల్లీలో తన నేతలతో సమావేశాన్ని ఏర్పాటు చేసింది. హర్యానాకు చెందిన ఐదుగురు ఎమ్మెల్యేలు సమావేశానికి గైర్హాజరైనట్లు తెలిసింది. ఈ పరిణామం ఆ పార్టీలో చీలికను సూచిస్తోంది. కాగా ఇటు బీజేపీ కానీ, జేజేపీ కాని అధికారికంగా పొత్తు తెగిపోయినట్లు ప్రకటించకపోవడం గమనార్హం.

ఖట్టర్ రాజీనామా అనంతరం కొత్త ముఖ్యమంత్రి ఎవరనే దానిపై పెద్ద ఎత్తున చర్చ జరిగింది. ఈ క్రమంలోనే కొంతమంది నేతల పేర్లు తెరపైకి రాగా చివరకు నాయబ్ సైనీ వైపు బీజేపీ అధిష్ఠానం మొగ్గుచూపింది. ఈయన ఖట్టర్‌కు అత్యంత సన్నిహితుడు కావడం గమనార్హం. ఓబీసీ వర్గానికి చెందిన సైనీ 1996 నుంచి బీజేపీలో ఉన్నారు. పార్టీలో వివిధ పదవులు చేపట్టారు. 2014లో నారాయణ్‌గఢ్ నుంచి ఎన్నికై అసెంబ్లీలో అడుగుపెట్టారు. 2016లో రాష్ట్ర మంత్రి బాధ్యతలు చేపట్టారు. 2019 లోక్‌సభ ఎన్నికల్లో కురుక్షేత్ర స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిపై 3.83 లక్షల మెజార్టీతో విజయం సాధించారు.

గతేడాది అక్టోబరులో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా నియమితులయ్యారు. హర్యానా ఓబీసీల్లో సైనీల జనాభా దాదాపు 8 శాతం. కురుక్షేత్ర, హిస్సార్, అంబాలా, రేవాడీ జిల్లాల్లో వీరి ప్రాబల్యం ఎక్కువ. ఈ క్రమంలోనే వచ్చే లోక్‌సభ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని నాయబ్‌కు బీజేపీ అధిష్ఠానం రాష్ట్ర పగ్గాలు అప్పగించినట్లు తెలుస్తోంది. అంతకుముందు సంకీర్ణ ప్రభుత్వంలోని మిత్ర పక్షం జేజేపీతో విభేదాలు తలెత్తడం వల్లే మనోహర్ లాల్ అధికార పీఠం నుంచి దిగిపోయినట్లు ఊహాగానాలు వినిపించాయి. ఈ క్రమంలోనే వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో కర్నాల్ ఎంపీ స్థానం నుంచి ఖట్టర్ పోటీ చేసే అవకాశాలున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.

సీఏఏ వెనక్కి...

(మొదటిపేజీ తరువాయి)

తెలిపారు. విద్యార్థులపై ఖాకీ క్రౌర్యం ఆరోపణలు నిరాధారమన్నారు. తమ వద్ద వీడియో రికార్డింగ్‌లు ఉన్నట్లు చెప్పారు.

ఇదిలావుంటే, అసోం వ్యాప్తంగా నిరసనలు పెద్దఎత్తున జరిగాయి. అసోం జ్యాతియతావాది యువ ఛాత్ర పరిషద్ (ఏజేవైసీపీ) అధ్వర్యంలో లఖింపూర్‌లో మోదీ, అమిత్‌షా దిష్టిబొమ్మలను దహనం చేశారు. రాజధాని గువహటిలోని గవర్నర్ నివాసమైన రాజీవ్ భవన్ ఎదుట కాంగ్రెస్ నేత దేబాబ్రతా సైకియా నేతృత్వంలో ఆందోళన జరిగింది. సీఏఏ ప్రతులను కాంగ్రెస్ కార్యకర్తలు మంటల్లో వేశారు. కామ్‌రూప్ రంగియా పట్టణంలో సీపీఎం నాయకత్వంలో వివిధ కళాశాలల విద్యార్థులు నిరసనల్లో పాల్గొన్నారు. నగరంలోని తమ ఇన్‌స్టిట్యూట్‌ల ఎదుట ఆందోళనకు దిగారు. శివసాగర్ జిల్లాలో రైజర్ దళ్, క్రిషక్ ముక్తి సంగ్రామ్ సమితి, ఛాత్ర ముక్తి పరిషత్ కార్యకర్తలు, ఎమ్మెల్యే అఖిల్ గొగోయ్ ఆందోళనల్లో పాల్గొన్నారు. కేంద్రానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. 16 పార్టీలతో కూడిన యునైటెడ్ అపోజిషన్ ఫోరం అసోం (యూఓఎఫ్ఏ) 12 గంటల 'సర్వటామక్ హర్తాళ్'కు పిలుపునిచ్చింది. దీంతో శివసాగర్, గోలాఘాట్, నాగావ్, కామ్‌రూప్ తదితర జిల్లాల్లో దుకాణాలు, వ్యాపార సముదాయాలను మూసి వేశారు. హర్తాళ్‌ను ఉపసంహరించుకోవాలని, అధికారాలు ధిక్కరిస్తే చట్ట ప్రకారం చర్యలు తప్పవని విపక్ష ఫోరాన్ని అసోం పోలీసులు హెచ్చరించారు. ప్రభుత్వ ఆస్తి, ప్రాణ నష్టం జరగరాదనే ఈమేరకు నోటీసులు జారీ చేసినట్లు డీజీపీ సింగ్ తెలిపారు. దేబాబ్రతా సైకియా మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం ఆడించినట్లు రాష్ట్ర పోలీసు శాఖ ఆడుతోందని, ఇది సిగ్గుచేటని వ్యాఖ్యానించారు. తమ ఆందోళన ఆగబోదని, శాంతియుతంగా, ప్రజాస్వామ్యబద్ధంగా జరుగుతుందని తేల్చిచెప్పారు. సోనిట్‌పూర్‌లో 144 సెక్షన్ అమలు చేశారన్నారు. జనసమూహాలు, ప్రదర్శనలు, ధర్నాలు, నినాదాలు చేయడాన్ని నిషేధిస్తూ ఆదేశాలు జారీచేశారు. రాష్ట్రవ్యాప్తంగా కమాండోలతో పాటు భారీగా పోలీసులను మోహరించారు. పోలీసు స్టేషన్లను అలర్ట్‌లో ఉంచారు. పెట్రోలింగ్‌ను ముమ్మరం చేశారు. ప్రధాన మార్గాల్లో చెక్ పోస్టులు ఏర్పాటు చేశారు. ఆల్ అస్సామ్ స్టూడెంట్స్ యూనియన్, 30 రాజకీయేతర సంస్థలు టార్చ్ ర్యాలీలు నిర్వహించాయి. బుధవారం నుంచి సత్యాగ్రహం చేపట్టనున్నాయి.

కేరళలో... కేరళలో డెమొక్రటిక్ యూత్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (డీవైఎఫ్ఐ), యూత్ కాంగ్రెస్ అధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు జరిగాయి. మల్లప్పురంలో ఎల్‌డీఎఫ్ అభ్యర్థి వి.వసీఫ్ నాయత్వంలో డీవైఎఫ్ఐ నిరసన జరిగింది. కోజికోడ్, కొల్లంతో పాటు అనేక జిల్లాల్లో రాత్రి మార్చ్‌లు నిర్వహించారు. కోజికోట్ రైల్వేస్టేషన్ వద్ద మలబార్ ఎక్స్‌ప్రెస్‌ను, ఎర్నాకులంలో మవేలీ ఎక్స్‌ప్రెస్‌ను యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు నిలువరించగా వాళ్లను పోలీసులు ఆయా స్టేషన్ల నుంచి బలవంతంగా తరలించారు. వెల్ఫేర్ పార్టీ, సోషల్ డెమొక్రటిక్ పార్టీ ఆఫ్ ఇండియా (ఎస్‌డీపీఐ) అధ్వర్యంలో తిరువనంతపురంలోని రాజ్‌భవన్ వరకు ర్యాలీ జరిగింది. ఫెటర్నిటీ మూవ్‌మెంట్ సభ్యులైన విద్యార్థులపై పోలీసులు లాఠీలు ఝుళిపించారు. 124 మంది ఫటర్నిటీ మూవ్‌మెంట్ సభ్యులపై, 500 మంది ఎస్‌డీపీఐ కార్యకర్తలపై కేసులు నమోదయ్యాయి. అనేకమంది అరెస్టుకు గురయ్యారు. లాఠీచార్జిలో గాయపడిన ఆరుగిరికి కోజికోడ్‌లోని బీచ్ ఆసుపత్రిలో చికిత్స అందించారు. కోజికోడ్ కార్పొరేషన్ నుంచి ఆకాశవాణి కార్యాలయం (ఆలిండియా రేడియో) వరకు మార్చ్ జరిగింది. ఫెటర్నిటీ మూవ్‌మెంట్ కోజికోడ్ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు షహీన్ అహ్మద్ మాట్లాడుతూ పోలీసుల ఓవరాక్షన్‌తో పరిస్థితి ఉద్రిక్తతకు దారితీసిందని, తాము ప్రశాంతంగా నిరసన తెలిపి వెళ్లిపోయేవారమని చెప్పారు. ఇదిలావుంటే, కేరళలో సీఏఏ అమలు చేయబోమని ముఖ్యమంత్రి పినరయి విజయన్ తేల్చిచెప్పారు. ముస్లింలను రెండవ తరగతి పౌరులుగా పరిగణించే ఈ చట్టానికి తాము వ్యతిరేకమని, మత–విభజన చట్టాలను ఎట్టిపరిస్థితుల్లోనూ ప్రోత్సహించబోమని విజయన్ తెలిపారు.

జమిలి ఎన్నికలు నిర్వహించాలి

లోక్‌సభ ఎన్నికల సంసిద్ధతపై ఈసీ సమీక్ష వేళ జమ్మూకశ్మీర్ పార్టీల వినతి

శ్రీనగర్: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తుండటంతో ఎన్నికల నిర్వహణ దిశగా పరిస్థితులను సమీక్షించేందుకు ఎన్నికల సంఘం అధికారులు జమ్మూకశ్మీర్‌లో పర్యటించారు. అక్కడి రాజకీయ పార్టీలతో సంప్రదింపులు ప్రారంభించారు. ఈ చర్చలు రెండు రోజులు జరుగుతాయి. ఇదే క్రమంలో లోక్‌సభతో పాటు అసెంబ్లీకి ఎన్నికలు నిర్వహించాలని రాజకీయ నాయకులు మంగళవారం ఈసీని కోరారు. జమిలి ఎన్నికలకు సిద్ధమన్నారు. బీజేపీ కూడా సంసిద్ధతను వ్యక్తంచేసింది. ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్ నేతృత్వ బృందం నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్‌సీ), పీడీపీ, బీజేపీ, సీపీఎం, కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీ ప్రతినిధులతో సంప్రదింపులు చేపట్టింది. ఎన్‌సీ నేత నసీర్ అస్లమ్ వానీ నేతృత్వ ప్రతినిధుల బృందం ఈసీ బృందాన్ని కలిసి జమిలి ఎన్నికలు నిర్వహించాలని కోరింది. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ 'జమ్మూకశ్మీర్ ప్రజలకు పదేళ్లుగా ప్రజాస్వామిక హక్కులు నిరాకరించబడ్డాయి. లోక్‌సభ ఎన్నికలతో పాటుగా అసెంబ్లీకీ ఎన్నికలు నిర్వహించాలని కోరాం. రెండు ఎన్నికలు వేర్వేరు సమయాల్లో జరిగితే జమ్మూకశ్మీర్ ఆర్థికంగా దెబ్బతింటుంది. పర్యాటక రంగం ప్రభావితమవుతుంది' అని ఈసీ బృందంతో చెప్పినట్లు తెలిపారు. ఒక దేశం, ఒక ఎన్నిక అన్నది ప్రధాని మోదీ కల కూడా అని గుర్తుచేశారు. ఎన్నికలు పారదర్శకంగా జరగవన్న అనుమానం స్థానికుల్లో ఉన్నట్లు ఈసీ దృష్టికి తీసుకెళ్లామన్నారు. చెప్పాలనుకున్నది చెప్పామని, ఈసీ అధికారులు ఓపిగ్గా విన్నారని, తుది నిర్ణయం వారిదేనని నాయకులు అన్నారు. ఈసీ బుధవారం జమ్మూలో చర్చలు జరపనుంది.

సీఏఏ అమలుపై స్టే విధించాలి

సుప్రీంలో ఐయూఎంఎల్ పిటిషన్

న్యూదిల్లీ: పౌరసత్వ సవరణ చట్టం–2024 అమలుపై స్టే విధించాలని కోరుతూ సుప్రీంకోర్టును ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ (ఐయూఎంఎల్) ఆశ్రయించింది. పౌరసత్వం కోసం దరఖాస్తు చేసుకునేందుకు ముస్లింలకు కూడా అవకాశం కల్పించాలని కోరింది. సీఏఏ–2019 రాజ్యాంగబద్ధతను సవాల్ చేస్తూ దాఖలై... ఇప్పటికే వందల పిటిషన్లు పెండింగ్‌లో ఉన్నాయి. ఇవన్నీ పరిష్కారమయ్యేంత వరకు సీఏఏ–2024 అమలు కాకుండా ఆదేశాలివ్వాలని సర్వోన్నత న్యాయస్థానాన్ని ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ కోరింది. 2019లో తీసుకొచ్చిన పౌరసత్వ సవరణ చట్టాన్ని సవాల్ చేస్తూ పిటిషన్‌ను ఐయూఎంఎల్‌లో దాఖలు చేసిన విషయం తెలిసిందే. తాజా పిటిషన్‌లో సీఏఏ కింద పౌరసత్వం కోసం ముస్లింలు దరఖాస్తు చేసుకొనే అవకాశం కల్పించాలని కోరింది. పెండింగ్‌లో ఉన్న రిట్ పిటిషన్లను దాఖలు చేసిన ముస్లింలపై కఠిన చర్యలు తీసుకోకుండా ఆదేశాలు జారీ చేయాలని విజ్ఞప్తి చేసింది. పౌరసత్వం కోసం ముస్లింలు దరఖాస్తు చేసేకునేలా నిబంధనలు ఉండాలని, దీనిపై నివేదిక ఇచ్చేలా కేంద్రానికి ఆదేశాలివ్వాలని న్యాయస్థానాన్ని ఐయూఎంఎల్ కోరింది. సీఏఏ నిబంధనలను సవాల్ చేస్తూ 250కుపైగా పిటిషన్లు పెండింగ్‌లో ఉన్నట్లు గుర్తుచేసింది. సీఏఏ రాజ్యాంగ విరుద్ధమని కోర్టు తేల్చితే ఇప్పటివరకు దీని ప్రకారం పౌరసత్వాన్ని పొందిన వారు దానిని కోల్పోవాల్సి వస్తుందని, దాంతో పరిస్థితి దారుణంగా మారుతుంది. కాబట్టి ప్రతి ఒక్కరి ప్రయోజనాన్ని దృష్టిలో పెట్టుకొని సీఏఏ అమలు విషయంలో సరైన నిర్ణయం తీసుకోవాలి' అని పిటిషన్ కోరింది. 2019లో ఈ చట్టాన్ని తెచ్చిన కేంద్రం దాని నిబంధనలను నోటిఫై చేసేందుకు నాలుగేళ్లు తీసుకుందని గుర్తుచేసింది. నాలుగున్నరేళ్లుగా సీఏఏ అమలులో తొందరపాటు ప్రదర్శించని కేంద్రానికి కోర్టు తీర్పు వచ్చేంత వరకు ఆగడం పెద్ద సమస్య కాబోదన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది. కోర్టు తీర్పు వచ్చే వరకు ఆగడం వల్ల ఎవరి ప్రయోజనాలు, హక్కులు ప్రభావితం కాబోవని పేర్కొంది. ఇదిలావుంటే డెమొక్రటిక్ యూత్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా కూడా సీఏఏ–2024ను సవాల్ చేస్తూ వేరొక పిటిషన్ వేసింది.

ప్రభుత్వాలను కూల్చే కసాయి బీజేపీ

(మొదటిపేజీ తరువాయి)

చేసిన పనులు చెప్పుకుని ప్రజల్ని ఓట్లు అడగలేకపోతున్నదని, ఏడాదికి 2 కోట్ల ఉద్యోగాలు ఇవ్వలేదన్నారు. తమకు అనుకూలంగా లేని పార్టీలపై ఈడీతో దాడులు చేయిస్తోందన్నారు. ఇప్పుడు ఎన్నికల్లో రాజకీయ లబ్ధి కోసం పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ)ను అమలు చేయటానికి నోటిఫికేషన్ ఇచ్చిందన్నారు. ఉత్తర భారతదేశంలో సీట్లు తగ్గుతాయని తెలిసి దక్షిణ భారతదేశంలో బీజేపీ ప్రచారాన్ని ముమ్మరం చేసిందని నారాయణ తెలిపారు. తమిళనాడు, కేరళలో మోదీ ఎక్కువ సార్లు పర్యటిస్తున్నారని చెప్పారు.

చంద్రబాబును బెదిరించారు...

ఆంధ్రప్రదేశ్‌లో టీడీపీ ఒంటరిగా పోటీ చేస్తే గెలిచే అవకాశాలు ఉన్నాయన్నారు. టీడీపీని నాశనం చేయటానికే బీజేపీ పొత్తు పెట్టుకుందన్నారు. పొత్తు పెట్టుకుంటారా? జైలుకు వెళతారా? అని చంద్రబాబును భయపెట్టిందన్నారు. తెలుగు ప్రజలకు ద్రోహం చేసిన బీజేపీని, తెలుగువారి ఆత్మగౌరవాన్ని తాకట్టుపెట్టిన టీడీపీ, వైసీపీలను కాకుండా ప్రత్యామ్నాయంగా ఉన్న ఇండియా కూటమిని ప్రజలు ఆదరించాలని కోరారు. వామపక్షాలు, కాంగ్రెస్ కూటమితో ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. సీఎం జగన్ పర్యటన సందర్భంగా ఆయన రక్షణను సాకుగా చూపి చెట్లు నరికేయటమేమిటని ప్రశ్నించారు.

కాంగ్రెస్ విశాఖ సభకు సీపీఐ మద్దతు: రామకృష్ణ

విశాఖస్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఈ నెల 15వ తేదిన కాంగ్రెస్ పార్టీ విశాఖలో నిర్వహించనున్న బహిరంగ సభకు సీపీఐ మద్దతు ఇస్తున్నట్లు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ తెలిపారు. స్టీల్ ప్లాంట్ కార్మికులు చేస్తున్న ఉద్యమానికి సంఘీభావంగా జరిగే ఆ సభలో సీపీఐ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొంటాయని చెప్పారు. అనంతరం విలేకరులు అడిగిన ప్రశ్నలను రామకృష్ణ సమాధానం ఇస్తూ రాష్ట్రంలో 5 లోక్‌సభ స్థానాలు, 15 అసెంబ్లీ స్థానాల్లో పోటీ చేసేందుకు సీపీఐ సంసిద్ధంగా ఉందన్నారు. ఒక్కో రాష్ట్రానికి బలాబలాలు వేరువేరుగా ఉంటాయని సామర్థ్యాన్ని బట్టి పోటీ చేయటం జరుగుతుందన్నారు. మరో వారంరోజుల్లో ఎన్ని సీట్లలో పోటీ చేస్తాం, ఎవరు పోటీ చేస్తారు అనేదానిపై స్పష్టత వస్తుందని వివరించారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జల్లి విల్సన్, కేవీవీ ప్రసాద్ పాల్గొన్నారు.

మద్దతు ధరల చట్టం తేవాలి

14న నిరసన ప్రదర్శనలకు ఐక్యవేదిక నేతల పిలుపు

విశాలాంధ్ర-విజయవాడ: సీ2+50 శాతం కలిపి మద్దతు ధరల చట్టం తేవాలని, దేశవ్యాప్తంగా పంటరుణాలు మాఫీ చేయాలని కోరుతూ ఈనెల 14న రాష్ట్రంలో అన్ని మండల కేంద్రాల్లో నిరసనలు, ప్రదర్శనలు నిర్వహించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘాల సమన్వయ సమితి, కార్మిక సంఘాల ఐక్య వేదిక నాయకులు పిలుపునిచ్చారు. స్థానిక గాంధీనగర్ ప్రెస్‌క్లబ్‌లో ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు మాట్లాడుతూ, ఎన్నో సంవత్సరాలుగా పోరాడి సాధించిన కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకువచ్చి కార్మిక హక్కులను హరించే ఈ లేబరు కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం నెలకు రూ.26 వేలు ఇవ్వాలని ఎన్నో ఉద్యమాలు నిర్వహిస్తున్నా పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరించడాన్ని నిలుపుదల చేయాలని అన్నారు. కడపలో ఉక్కు పరిశ్రమను ప్రభుత్వమే నిర్మించాలని డిమాండ్ చేశారు. కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న బీజేపీతో తెలుగుదేశం, జనసేన పార్టీలు పొత్తు పెట్టుకోవడం సిగ్గుచేటన్నారు. నోటాకన్నా తక్కువ ఓట్లు వచ్చిన బీజేపీతో పొత్తు టీడీపీ బలహీనతకు నిదర్శనమన్నారు. ఏప్రిల్‌లో జరిగే ఎన్నికల్లో బీజేపీ దాని మిత్రపక్ష పార్టీలకు గట్టిగా బుద్ధి చెప్పాలన్నారు. మోదీని గద్దెదించేందుకు రైతులు, కార్మికులు ఐక్యమై ఉద్యమించాలని కోరారు. ఈ నెల 14న ఢిల్లీలో జరగబోయే బహిరంగ సభ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు హెచ్చరికలాంటిదని అన్నారు.

ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం సీనియర్ నేత వై.కేశవరావు మాట్లాడుతూ, రైతాంగానికి రాతపూర్వకంగా ఇచ్చిన హామీలను అమలు చేయకుండా వ్యవసాయ నల్ల చట్టాలను దొడ్డిదారిన అమలుకు కేంద్రం ప్రయత్నం చేస్తుందని, వ్యవసాయంగాన్నే అదాని, అంబానీ, ఇతర కార్పొరేట్ కంపెనీలకు హస్తగతం చేయడానికి పూనుకుందని విమర్శించారు. రాష్ట్ర అధ్యక్షుడు జి.ఈశ్వరయ్య మాట్లాడుతూ, స్వామినాథన్ కమిటీ సిఫారసులు అమలు చేయాలన్నారు. కేరళ తరహాలో రుణ ఉపశమన చట్టం చేయాలని డిమాండ్ చేశారు. ఎరువుల సబ్సిడీపై కోత విధించి ఆహార భద్రత చట్టం అమలుకు నిధులు తగ్గించి కార్పొరేట్ కంపెనీలకు రాయితీలు ఇవ్వటం దుర్మార్గమన్నారు. సమగ్ర పంటల బీమా పథకం తీసుకురావాలని, ఆటవీ హక్కుల చట్టం ఉపసహరించాలని, ఆదివాసీ హక్కులు కాపాడేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ కౌలురైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య మాట్లాడుతూ, కార్పొరేట్ అనుకూల విధానాలు అనుసరిస్తున్న బీజేపీ ప్రభుత్వానికి రైతాంగం, కార్మికులు మరోమారు బుద్ధిచెప్పాలన్నారు. హర్యానా సరిహద్దుల్లో రైతులపై కాల్పులు జరిపిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కౌలు రైతులకు సమగ్ర విధానాన్ని తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి.కృష్ణయ్య మాట్లాడుతూ, విద్యుత్ చట్ట సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలని, స్మార్ట్ మీటర్లు బిగింపును నిలుపుదల చేయాలని కోరారు. మద్దతు ధరల చట్టం చేస్తే ప్రభుత్వంపై రూ.10 లక్షల కోట్లకుపైగా ఆర్థిక భారం పడుతుందని కట్టుకథలు చెబుతుందని, ఇది వాస్తవం కాదని పలువురు ఆర్థిక వేత్తలు, నిపుణులు చెప్పిందాన్ని పరిగణలో తీసుకోవాలన్నారు. జాగృతి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మరీదు ప్రసాద్ మాట్లాడుతూ, ఆహార భద్రత చట్టాన్ని పటిష్ఠపరచాలని, 60 సంవత్సరాలు నిండిన పేద రైతులు, వ్యవసాయ కార్మికులకు నెలకు రూ.ఆరువేలు పెన్షన్ ఇవ్వాలని కోరారు.

రెండో 'వందేభారత్' కు ఘన స్వాగతం

విశాలాంధ్ర-విజయవాడ(గాంధీనగర్): సికింద్రాబాద్-విశాఖపట్నం మధ్య రెండో వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌ను ప్రధాని మోదీ మంగళవారం వర్చువల్‌గా ప్రారంభించగా ఆ రైలు విజయవాడకు చేరుకోగానే రైల్వే అధికారులు విద్యార్థులు, యాత్రికులు,అధికారులు పెద్ద ఎత్తున హర్ష ధ్వానాలతో ఘనస్వాగతం పలికారు. విజయవాడ డివిజన్‌లో, తణుకు, బిక్కవోలు, ఏలూరులో అప్‌గ్రేడ్ చేసిన 3 గూడ్స్ షెడ్‌లు, గూడూరు-బిట్రగుంట మూడో లైన్‌తో పాటు 67 వన్ స్టేషన్ వన్ ప్రొడక్ట్ (ఓఎస్ఓపి) స్టాల్స్, బిట్రగుంట - కరవడి - చీరాల మూడో లైన్, విజయవాడ బైపాస్ లైన్‌లను కూడా ప్రధాని జాతికి అంకితం చేశారు. ఏలూరులో జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్, దక్షిణ మధ్య రైల్వే అదనపు జనరల్ మేనేజర్ (ఏజీఎమ్) ఆర్.ధనుంజయులు, రాజ్యసభ సభ్యుడు కనకమేడల రవీంద్రకుమార్, ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్, విజయవాడ డివిజన్ డివిజనల్ రైల్వే మేనేజర్ నరేంద్ర ఎ. పాటిల్, సీనియర్ రైల్వే అధికారులు పాల్గొన్నారు.

అక్రమ బదిలీలు ఆపాలి: ఏపీటీఎఫ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: పారదర్శకమైన కౌన్సెలింగ్ విధానాన్ని నిర్వహించాల్సిన ప్రభుత్వమే ఉపాధ్యాయులను అక్రమంగా బదిలీలు చేయడం సమంజసం కాదని ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.హృదయరాజు, ఎస్. చిరంజీవి మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇప్పటికే బదిలీలు చేసిన వారికి ఫైనాన్స్ అప్రూవల్ లేక జీతాలు రాని పరిస్థితి కనబడుతుంటే మరోవైపు టీచర్ల బదిలీలు చేయడం విడ్డూరమని అన్నారు. ఇలాంటి బదిలీల కోసం ఆశ పడితే ఉపాధ్యాయులు నైతికంగా దెబ్బతినడమే కాకుండా ఆర్థికంగా కూడా నష్టపోతారని తెలిపారు. దొడ్డిదారి బదిలీలకు ప్రయత్నం చేయకుండా పారదర్శకమైన కౌన్సెలింగ్ విధానంలోనే పాల్గొనాలని వారు సూచించారు. ఆందోళనల సందర్భంగా ఉపాధ్యాయులపై పెట్టిన కేసులను ఉపసంహరించు కోవాలని డిమాండ్ చేశారు.

ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల బకాయిలు చెల్లించండి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఎన్నికల నోటిఫికేషన్ ముందైనా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు చెల్లించాల్సిన రూ.21 వేల కోట్ల బకాయిలను విడుదల చేయాలని ఉపాధ్యాయ మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీపీఎస్ రద్దు, ఐఆర్ ప్రకటనలోనూ ఉద్యోగులకు నిరాశే మిగిలిందన్నారు. తక్షణమే వీరికి బకాయిలు చెల్లించాలని కోరారు.

ఘనంగా వైసీపీ ఆవిర్భావ దినోత్సవం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: తాడేపల్లి కేంద్ర కార్యాలయంలో వైసీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. పార్టీ జెండాను నేతలు ఎగురవేశారు. పార్టీ 14వ సంవత్సరంలోకి అడుగుపెట్టిన సందర్భంగా సేవా కార్యక్రమాలను నిర్వహించారు. సీనియర్ నేత, ఎమ్మెల్సీ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, మంత్రి జోగి రమేశ్, ఎంపీ నందిగం సురేశ్, ఎమ్మెల్సీలు వరుదు కల్యాణి, లేళ్ల అప్పిరెడ్డి, ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్, వివిధ జిల్లాల కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లు, పార్టీ శ్రేణులు హాజరయ్యారు. ఉమ్మారెడ్డి మాట్లాడుతూ, చంద్రబాబుకు అధికారంపైనే ప్రేమ అని, ప్రజలు, వారి అవసరాలపై ఏ మాత్రం ప్రేమలేదని చెప్పారు. ఐదేళ్లల్లో చేసిన మంచిని చూసి ఓటేయాలని జగన్ కోరుతున్నారని, నా 45 ఏళ్ల రాజకీయ జీవితంలో ఏనాడూ ఇలాంటి నాయకుడ్ని చూడలేదని కొనియాడారు. జోగి రమేశ్ మాట్లాడుతూ, జగన్ వంటి సీఎం ఉంటే మాకూ బాగుంటుందని ఇతర రాష్ట్రాల ప్రజలు కోరుకుంటున్నారని చెప్పారు.

ఇండియా కూటమిని గెలిపించండి

సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ

విశాలాంధ్ర-ఏలూరు: ఇండియా కూటమిని గెలిపించాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు, ఏలూరు జిల్లా ఇన్‌ఛార్జి అక్కినేని వనజ పిలుపునిచ్చారు. సీపీఐ ఏలూరు జిల్లా కార్యవర్గ సమావేశం మంగళవారం స్థానిక ఆర్.ఆర్.పేట స్ఫూర్తి భవన్‌లో సన్నేపల్లి సాయిబాబు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వనజ మాట్లాడుతూ, రాష్ట్రంలో మతోన్మాద బీజేపీతో పొత్తుపెట్టుకున్న పార్టీలకు, వైసీపీకి వ్యతిరేకంగా ఇండియా కూటమిలో ఉన్న సీపీఐ, సీపీఎం, కాంగ్రెస్ తదితర పార్టీలకు మద్దతు తెలపాలని ప్రజలను కోరారు. భారత కమ్యూనిస్టు పార్టీ ప్రజల సమస్యల పరిష్కారం కోసం అనితర పోరాటాలు చేసిందనీ, రాబోయే ఎన్నికల్లో సీపీఐ పోటీ చేసే స్థానాల్లో విజయం సాధించేందుకు ప్రజలను చైతన్యవంతం చేయాలని కోరారు. పార్టీ బలపరచే సీపీఎం, కాంగ్రెస్, ఇతర ఇండియా కూటమి పార్టీలకు ప్రజలు ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కేంద్రం పోలవరం ప్రాజెక్టు, రాజధాని నిర్మాణాలకు నిధులు మంజూరు చేయకుండా మోసగించి రాష్ట్ర ప్రయోజనాలను దెబ్బతీసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెనుకబడిన ప్రాంతాలకు ప్యాకేజీ, విభజన హామీలను గాలికి వదిలేసి రాష్ట్రానికి తీరని ద్రోహం తలపెట్టిందని ధ్వజమెత్తారు. విశాఖ ఉక్కును అమ్మేస్తూ, కార్పొరేట్ శక్తులు బలపడే విధానాలను బీజేపీ ప్రభుత్వం అవలంభిస్తుందని ఆరోపించారు. రాష్ట్రానికి తీరని అన్యాయం చేసిన బీజేపీతో కూటమి పేరుతో టీడీపీ, జనసేన పార్టీలు జతకట్టడం విచారకరమని అన్నారు. కేంద్రంలో మోదీ, రాష్ట్రంలో జగన్ అధికార పీఠాలెక్కి ఎలాంటి అభివృద్ధి సాధించారని ప్రశ్నించారు. జగన్ మూడు రాజధానుల పేరుతో మూడు ముక్కలాట ఆడుతూ రాష్ట్ర ప్రజలను ఆందోళనకు గురి చేస్తున్నారని మండిపడ్డారు. మోదీ స్వయంగా శంకుస్థాపన చేసిన అమరావతిని చంపేస్తున్నా కేంద్ర సర్కార్ జగన్ నిరంకుశ, అవినీతి, అభివృద్ధి రహిత పాలనకు మద్దతు ఇచ్చిందని అన్నారు. బీజేపీ, టీడీపీ, జనసేన ఏంఆశించి పొత్తు పెట్టుకున్నారో ప్రజలకు వివరించాల్సిన బాధ్యత ఆయా పార్టీలపై ఉందన్నారు. బీజేపీతో అంట కాగుతున్న టీడీపీ, జనసేన, రాష్ట్రాన్ని నాశనం చేసిన వైసీపీలను రాబోయే ఎన్నికల్లో చిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు. సీపీఐ, సీపీఎంతో పాటు ఇండియా కూటమిలోని పార్టీలను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు డేగా ప్రభాకర్, ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, జిల్లా కార్యవర్గ సభ్యుడు బండి వెంకటేశ్వరావు, యు. హేమశంకర్, కారం దారయ్య, బాడిశ రాము, బత్తుల వెంకటేశ్వరావు, ఎం.వెంకటచారి, కంచర్ల గురవయ్య, కొండేటి బేబి, జె.వి.రమణ రాజు పాల్గొన్నారు.

గీతాంజలి మృతి కారకులపై చర్యలు తీసుకోండి

డీజీపీకి వాసిరెడ్డి పద్మ విజ్ఞప్తి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: గీతాంజలి మృతికి బాధ్యులైన టీడీపీ, జనసేన సోషల్ మీడియా బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డికి ఏపీ మహిళా కమిషన్ మాజీ చైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళగిరి డీజీపీ కార్యాలయంలో మంగళవారం డీజీపీని కలిసి గీతాంజలి ఆత్మహత్యకు దారితీసిన ఉదంతాన్ని వివరించారు. వైసీపీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ సజ్జల భార్గవ్‌రెడ్డి, పడుగల రత్నాకర్ ఉన్నారు.

చట్ట ప్రకారం చర్యలు

గీతాంజలి ఆత్మహత్యపై సీఎం జగన్ విచారం

రూ.20 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటన

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: గీతాంజలి ఆత్మహత్య ఘటనపై సీఎం జగన్ విచారం వ్యక్తం చేశారు. ఈ ఘటన తనను దిగ్భ్రాంతికి గురి చేసిందని తెలిపారు. ఆమె కుటుంబాన్ని ఆదుకోవ డానికి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మృతురాలి కుటుంబానికి రూ.20 లక్షల పరిహారాన్ని ప్రకటించారు. ఆడపిల్లల గౌరవ ప్రతిష్ఠలు, మర్యాదలకు భంగంకలిగించే ఏఒక్కరినీ చట్టం వదిలిపెట్టబోదని సీఎం స్పష్టం చేశారు. తెనాలికి చెందిన గీతాంజలి ఆత్మహత్య చేసుకున్న ఘటనపై ప్రభుత్వం, మహిళా సంఘ నేతలు, ప్రజాప్రతినిధులు తీవ్రంగా స్పందించారు. రాష్ట్ర హోంమంత్రి తానేటి వనిత, మంత్రి ఆర్కే రోజా, వైసీపీ నాయకురాలు వాసిరెడ్డి పద్మ ఈ ఘటనపై తీవ్ర ఆవేదన వ్యక్తంచేశారు. ఇప్పటికే కేసు నమోదు చేశామని, ప్రాథమిక సమాచారాన్ని సేకరించామని తానేటి వనిత చెప్పారు. కొందరి సోషల్ మీడియా ఖాతాలపై నిఘా ఉంచామని చెప్పారు. గీతాంజలి మృతికి కారణమైన ఎవర్నీ వదిలేది లేదన్నారు. మరో మహిళలపై ఇలాంటివి జరగకుండా చర్యలు చేపడతామని చెప్పారు. సీఎం జగన్ ప్రభుత్వం వల్ల లబ్ధిపొందిన గీతాంజలి అనే మహిళ తన సంతోషాన్ని వ్యక్తపరిస్తే, ఓర్వలేకపోయిన టీడీపీ, జనసేనలు ఆమె ప్రాణాన్ని బలి తీసుకున్నాయని వాసిరెడ్డి పద్మ ఆగ్రహం వ్యక్తం చేశారు. గీతాంజలిపై సోషల్ మీడియాలో అసభ్యకరంగా ట్రోల్ చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డీజీపీ రాజేంద్ర నాథ్‌రెడ్డికి ఆమె లేఖ రాశారు. వైసీపీ మహిళా విభాగం అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ పోతుల సునీత, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి మంగళవారం తాడేపల్లి కేంద్ర కార్యాలయంలో వేర్వేరుగా విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. సునీత మాట్లా డుతూ, టీడీపీ, జనసేన రాంబంధుల చేతుల్లో గీతాంజలి బలైందని అన్నారు. సోషల్ మీడియా మూకలపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కోరారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్ పాపాలు పండే సమయం వచ్చిందని హెచ్చరించారు. కల్యాణి మాట్లాడుతూ, ఉగ్రవాద సంస్థలా టీడీపీ పనిచేస్తోందన్నారు. ఇద్దరు చిన్నారులున్న ఓ మహిళను వారి సోషల్ మాడియా పొట్టన పెట్టుకుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది టీడీపీ, జనసేన సైకోలు చేసిన హత్య అని అన్నారు.

14న నిరసనలు జయప్రదం చేయండి: రవీంద్రనాథ్

విశాలాంధ్ర-మార్కాపురం టౌన్: కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న కార్మిక, రైతు వ్యతిరేక చర్యలను ఖండిస్తూ దేశవ్యాప్తంగా జరుగుతున్న రైతు ఉద్యమాలకు సంఘీభావంగా కేంద్ర కార్మిక సంఘాలు, రైతు సంఘాల సమన్వయ కమిటీల ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 14న జరిగే నిరసన కార్యక్రమాలు జయప్రదం చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రావులపల్లి రవీంద్రనాథ్ పిలుపునిచ్చారు. స్థానిక పూలసుబ్బయ్య శాంతి సంఘ భవన్‌లో మంగళవారం జరిగిన నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం రైతాంగం, కార్మికవర్గంపై ఏకపక్ష దాడులు నిర్వహిస్తుందని మండిపడ్డారు. ఇచ్చిన హామీలు అమలు జరపటానికి పోరాటాలు చేయవలసిన దుస్థితి నెలకొందని ధ్వజమెత్తారు. రెండు మూడు సంవత్సరాలుగా రైతాంగ, కార్మిక ఉద్యమాలు అణగదొక్కటానికి ప్రయత్నం చేస్తుంది తప్ప వారిని చర్చలకు పిలిచి ఇచ్చిన హామీలు అమలుకు సమయం అడగటం కానీ వాటిలో ఇబ్బందులు ఏమైన ఉంటే వాటిని సర్దుబాటు చేయడం లేదన్నారు. పైగా పోలీసు దాడులతో ఉద్యమాలు అణిచివేస్తుందని విమర్శించారు. రైతాంగం శాంతియుతంగా ఉద్యమాలు నిర్వహిస్తుంటే... ప్రభుత్వ విధానం ఉద్యమకారులను రెచ్చగొట్టే విధంగా ఉందని రవీంద్రనాథ్ అన్నారు. ఈ ఉద్యమానికి సంఘీభావంగా ఈ నెల 14న చలో ఢిల్లీ కార్యక్రమం నిర్వహిస్తున్నామని చెప్పారు. దీనికి సంఘీభావంగా రాష్ట్రంలో నిరసన కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. అందే నాసరయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఏఐటీయూసీ ఏరియా అధ్యక్ష,కార్యదర్శులు వెంకటరెడ్డి ఎస్.కె కాసిం పాల్గొన్నారు.



మతోన్మాద మోదీని ఓడిద్దాం

ఎన్నికల ప్రచారానికి కళాకారులు సన్నద్ధం కావాలి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జంగాల అజయ్‌కుమార్

విశాలాంధ్ర-గుంటూరు: దేశవ్యాప్తంగా త్వరలో జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లో ప్రజావ్యతిరేక విధానాలు అవలంభిస్తూ ప్రజలను నిలువనా మోసం చేస్తున్న మోదీ, జగన్ ప్రభుత్వాలను ఓడించేందుకు ఎన్నికల ప్రచారానికి కళాకారులు సంసిద్ధం కావాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు, ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్య మండలి రాష్ట్ర నాయకుడు జంగాల అజయ్ కుమార్ పిలుపునిచ్చారు. గుంటూరు మల్లయ్యలింగం భవన్‌లో మంగళవారం ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్య మండలి రాష్ట్ర సమితి సమావేశం పి.చంద్రనాయక్ అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా విచ్చేసిన అజయ్‌కుమార్ మాట్లాడుతూ, దేశంలో మోదీ మతోన్మాదపాలన కొనసాగిస్తూ, ఆర్ఎస్ఎస్ మనువాదాన్ని ప్రజలపై రుద్దుతూ దేశాన్ని భ్రష్టుపట్టిస్తున్నాడని విమర్శించారు. కార్పొరేట్ శక్తుల కనుసన్నల్లో పాలన చేయడంతో ప్రభుత్వ రంగ సంస్థలన్నీ మూతపడిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలకిచ్చిన ఒక్క హామీ కూడా నెరవేర్చకుండా అన్ని రకాల వస్తువుల ధరలు పెంచేసి ప్రజలకు తీరని భారాన్ని మోపుతున్నాడని దుయ్యబట్టారు. ఏపీకి తీరని ద్రోహం చేసిన మోదీతో సీఎం జగన్ చీకటి రాజకీయాలు నడుపుతున్నాడని ఆరోపించారు. ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడు, జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ ఇద్దరూ పగటిపూట రాజకీయాల నడుపుతూ ప్రజలను తీవ్ర గందరగోళానికి గురిచేస్తున్నారని అన్నారు. దేశ రక్షణ కోసం వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇండియా కూటమి గెలుపు కోసం ప్రచారం కొనసాగించాలని సూచించారు. ప్రజానాట్యమండలి ఏపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిన్నం పెంచలయ్య మాట్లాడుతూ, కళారూపాలను తయారుచేసి మోసగాళ్లను ఓడించడానికి పూనుకుంటామని అన్నారు. దీనిలో భాగంగానే కోనసీమ అంబేద్కర్ జిల్లా రామచంద్రాపురంలో ఈ నెల చివరివారంలో మూడు రోజులు పాటు కవులు, రచయితలు, కళాకారుల వర్క్ షాప్ నిర్వహించి ఎన్నికల ప్రచారానికి సంసిద్ధం అవుతున్నట్లు తెలిపారు. ప్రజానాట్యమండలి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ ఆర్.రామకృష్ణ, కోశాధికారి ఆర్.పిచ్చయ్య, రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ మహంతి లక్ష్మణరావు, వి.నాగరాజు, ఆరేటి రామారావు, అన్ని జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఎన్నికల బాండ్లపై సుప్రీం తీర్పు హర్షణీయం

సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్

విశాలాంధ్ర-అనంతపురం: ఎన్నికల బాండ్లను ఈనెల 15 లోపు వెబ్‌సైట్‌లో పెట్టాలని సుప్రీంకోర్టు ఎస్‌బీఐకు ఆదేశాలు జారీచేయడంతో సీపీఐ జిల్లా సమితి హర్షం వ్యక్తం చేస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి సి. జాఫర్ పేర్కొన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ ప్రభుత్వాన్ని కాపాడడానికి ఎస్‌బీఐ జూన్ 30 వరకు గడువు కోరడంతో సుప్రీంకోర్టు దానిని కొట్టివేసిందన్నారు. సుప్రీం నిర్ణయం ప్రజాస్వామ్యం, ఎన్నికల వ్యవస్థను కాపాడిందన్నారు. దీన్ని జీర్ణించుకోలేని అమిత్ షా, మోదీ సీఏఏను అమలు చేయనున్నట్లు ప్రకటించిందన్నారు. ఈ విషయంపై పెద్ద ఎత్తున దేశవ్యాప్తంగా విపక్ష పార్టీలు ఉద్యమించినప్పటికీ, మోదీ సర్కార్ నిరంకుశ పరిపాలనతో ఎన్నికల ముందు ఈ వివాదాన్ని తీసుకురావడాన్ని ఖండిస్తు న్నామన్నారు. సీఏఏపై ప్రతిపక్షాలతో సమావేశం నిర్వహించాలన్నారు. వైసీపీ, ప్రతిపక్ష పార్టీలు సీఏఏను వ్యతిరేకించాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా సహాయ కార్యదర్శి నారాయణస్వామి, నగర కార్యదర్శి శ్రీరాములు, సహాయ కార్యదర్శి అలిపిర, నారాయణస్వామి, పిట్ల రామకృష్ణ పాల్గొన్నారు.

బీజేపీ, వైసీపీ ప్రయత్నాలను తిప్పికొట్టండి

సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వెంకటరమణ

విశాలాంధ్ర-చింతపల్లి: మరోమారు అధికారాన్ని కైవసం చేసుకునేందుకు మతోన్మాద బీజేపీ, నియంతృత్వ వైసీపీ చేస్తున్న ప్రయత్నాలను తిప్పి కొట్టాల్సిన తరుణం ఆసన్నమైందని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బాలేపల్లి వెంకటరమణ అన్నారు. స్థానిక గిరిజన ఉద్యోగ భవన్‌లో ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సమావేశం పార్టీ మండల కార్యదర్శి, జిల్లా కార్యవర్గ సభ్యుడు పేట్ల పోతురాజు ఆధ్వర్యంలో మంగళవారం జరిగింది. అల్లూరి జిల్లా కార్యదర్శి పొట్టిక సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో బాలేపల్లి మాట్లాడుతూ, కేంద్రంలో రెండు పర్యాయాలు అధికారాన్ని చేపట్టిన బీజేపీ మతోన్మాద పాలన సాగించిందన్నారు. మరోసారి అధికారాన్ని చేజిక్కించుకునేందుకు అన్ని రాష్ట్రాలపై కన్నేసిందన్నారు. నాలుగైదు రోజుల్లో ఎన్నికల నియమావళి వెలువడుతున్న నేపథ్యంలో ఎన్నికల కమిషనర్ రాజీనామా చేయడంపై బీజేపీ ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజలను మతం, కులం వైపు మళ్లిస్తూ పాలిస్తున్న బీజేపీ అధికారం కోసం ముమ్మర ప్రయత్నాలను చేస్తుందన్నారు. ఇందులో భాగంగానే అమలు సాధ్యం కాని హామీలను గుప్పిస్తుందన్నారు. మన రాష్ట్రంలో ప్రతిపక్ష నేత, మాజీ సీఎం చంద్రబాబు అరెస్టులో కేంద్ర ప్రమేయం ఉందని అభిప్రాయపడ్డారు. ఇండియా కూటమిగా ఏర్పడిన సీపీఐ, సీపీఎం, కాంగ్రెస్ పార్టీలతో కలిసివచ్చే ఇతర పార్టీలతో కలసి పనిచేసేందుకు ఈ నెల 15న విశాఖ వేదికగా భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఏపీ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు షర్మిల, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, సీపీఐ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శులు హాజరుకానున్నట్టు చెప్పారు. పార్టీ మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు దీసరి బిమలమ్మ, ఎర్రబొమ్మల, రావణాపల్లి ఎంపీటీసీ సభ్యుడు సెగ్గే సత్తిబాబు, ఇరువాడ సత్యవేణి, జిల్లా కార్యవర్గ సభ్యులు సుంకర విష్ణుమూర్తి , కే సింహాచలం, ఇరువాడ దేముడు, షేక్ రెహ్మాన్, జీకే వీధి మండల కార్యదర్శి కంకిపాటి సత్తిబాబు పాల్గొన్నారు.

హెల్త్ సెక్రటరీలకు పదోన్నతులు...

హెల్త్ కమిషనర్‌కు అసోసియేషన్ వినతి

విశాలాంధ్ర-విజయవాడ: గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న తమకు హెల్త్ అసిస్టెంట్‌లుగా పదోన్నతి కల్పించి, బేసిక్ పే స్కేల్ మార్చాలని మెడికల్ అండ్ హెల్త్ కమిషనర్ జె.నివాస్‌కు అసోసియేషన్ తరపున హెల్త్ సెక్రటరీలు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు ఆధ్వర్యంలో మంగళగిరిలోని కార్యాలయంలో కమిషనర్‌ను కలిసి ఆయా అంశాలపై చర్చించారు. అనంతరం ఓబులేసు మీడియాతో మాట్లాడుతూ, కాంట్రాక్టు పద్ధతిలో పనిచేసిన ఏఎన్ఎంలను క్రమబద్ధీకరించడం జరిగిందన్నారు. వారిని ఎంపీహెచ్ఏఫ్‌లు తీసుకున్నారని, రూ.32,670 పే స్కేల్‌లో నియమించినందుకు ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. గతంలో 16 మంది ఏఎన్ఎమ్‌లకు సస్పెన్షన్ ఆర్డర్లు ఇచ్చి విచారణ అనంతరం తిరిగి విధుల్లో చేరడానికి ఆదేశాలు ఇవ్వటం శుభపరిణామమన్నారు. సచివాలయంలో గ్రేడ్ -3 ఏఎన్ఎమ్ లుగా పనిచేస్తున్న వారికి ఎలాంటి పదోన్నతులు ఇవ్వలేదన్నారు. జీవో 179 ప్రకారం ప్రొబేషన్ పూర్తిఅయి, మూడేళ్ల సర్వీస్ పూర్తి చేసుకొని అర్హత పరీక్షలో ఉత్తీర్ణులైన గ్రేడ్-3 ఏఎన్ఎమ్‌లను ఎంపీహెచ్ఏఫ్‌లుగా పరిగణలోకి తీసుకోలేదని అన్నారు. సచివాలయ ఏఎన్ఎమ్‌లకు గ్రేడ్-3 పే స్కేల్ రూ.23,120 ఉందన్నారు. అయితే కాంట్రాక్టు ఉద్యోగులుగా పని చేసిన వారిని అదే గ్రేడ్‌లో వున్న ఏఎన్ ఎమ్‌ల కంటే అధిక పేస్కేల్‌లో పెట్ట డం, ఎంహెచ్ ఏఎఫ్‌లుగా పదోన్నతి ఇచ్చి, సచివాలయాల్లో పనిచేస్తున్న గ్రేడ్-3 ఏఎన్ఎమ్‌లకు అన్యాయం చేయడం తగదని అన్నారు. న్యాయం జరగని పక్షంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కమిషనర్ సానుకూలంగా స్పందిస్తూ ఆయా అంశాలపై త్వరలోనే స్పష్టమైన ఆదేశాలు జారీ చేస్తామని హామీ ఇచ్చారు. ఏపీ గ్రామ, వార్డు సచివాలయ హెల్త్ సెక్రటరీస్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.లీలావతి, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు సుహాసిని, విజయ పాల్గొన్నారు.

సంపాదకీయం

హర్యానాలో మోదీ మార్కు రాజకీయం

ప్రధానమంత్రి మోదీ ఏ బీజేపీ నాయకుడిని పొగిడినా అతని పదవికి ఎసరు పెట్టినట్టే. హర్యానా విభాగం ఎక్స్‌ప్రెస్‌వే ను ప్రారంభిస్తూ హర్యానా ముఖ్యమంత్రిగా ఉన్న మనోహర్ లాల్ ఖట్టర్ ను మోదీ ఆకాశానికెత్తిన మర్నాడే ఆయన పదవి కాస్తా ఊడింది. ఆయన స్థానంలో రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు, కురుక్షేత్ర నుంచి లోక సభకు ఎన్నికైన నయాబ్ సైనీని ముఖ్యమంత్రిగా నియమించారు. వచ్చే ఏప్రిల్ లో లోకసభ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఖట్టర్ చేత రాజీనామా చేయించారు. 2019 లోకసభ ఎన్నికలలో హర్యానాలోని మొత్తం 10 స్థానాలను బీజేపీ గెలుచుకోవడంలో మనోహర్ లాల్ ఖట్టర్ పాత్ర అమోఘమైందంటారు. అయినా ఆయనను మార్చేయడం సగటు రాజకీయ పరిశీలకులకు ఆశ్చర్యకరంగానే ఉంటుంది. కానీ మోదీ బాధ లోకసభ ఎన్నికలు కాదు. తన పలుకుబడి ఆధారంగా వచ్చే లోకసభ ఎన్నికలలోనూ బీజేపీ ఘన విజయం సాధిస్తుందన్న నమ్మకం మోదీతో పాటు స్థానిక బీజేపీ నాయకులకు, దిల్లీలో కూర్చుని హర్యానా రాజకీయాలను పరిశీలించే వారికీ ఉంది. అయినా ఖట్టర్ ను ఎందుకు మార్చారో అన్న ప్రశ్న తలెత్తుతోంది. నిజానికి మోదీ సమస్య లోకసభ ఎన్నికలు కాదు. 2025 అక్టోబర్ లో జరగనున్న హర్యానా శాసనసభ ఎన్నికలలో ఓటమి భయం మోదీని పీడిస్తోంది. అందుకే నయాబ్ సైనీని ముఖ్యమంత్రి పీఠం మీద కూర్చోబెట్టారు. ఖట్టర్ కు మరింత పెద్ద బాధ్యత అప్పగిస్తారని అంటున్నారు. అదేమిటంటే సైనీ ఖాళీ చేసే కురుక్షేత్ర లోకసభ స్థానం నుంచి ఖట్టర్‌ను పోటీ చేయిస్తారన్న మాట వినిపిస్తోంది. నిజానికి ఇది ముఖ్యమంత్రికన్నా పెద్ద బాధ్యత ఏమీ కాదు. 2024లో కూడా బీజేపీ గెలిస్తే ఖట్టర్ కు కేంద్ర మంత్రివర్గంలో స్థానం కల్పిస్తే అది పెద్ద బాధ్యతగా భావించవచ్చునేమో. మంగళవారం ఈ పరిణామాలన్నీ వడివడిగా జరిగిపోయాయి. హర్యానా శాసనసభ ఎన్నికలు వచ్చే అక్టోబర్‌లో జరగాల్సి ఉంది. అంటే ఎనిమిది నెలల గడువే ఉంది. అయినా హరియానా ముఖ్యమంత్రిని మార్చేయడం మోదీ మార్కు రాజకీయాలకు ప్రతీక. సోమవారం నాడే ఎక్స్ ప్రెస్ వే ను ప్రారంభిస్తున్న సమయంలో మోదీ ఖట్టర్ తో తన సాన్నిహిత్యాన్ని పూసగుచ్చినట్టు వివరించారు. ఖట్టర్ మోటార్ సైకిల్ మీద రోహ్తక్ నుంచి గూర్గాం కు తాను ఎలా వెళ్లే వాడినో మోదీ చెప్పారు. అప్పుడు రోడ్లు చాలా చిన్నవిగా చిందరవందరగా ఉండేవని, ఖట్టర్ ముఖ్యమంత్రి అయిన తరవాత అనేక జాతీయ రహదార్లు, ఎక్స్ ప్రెస్ వేలు వచ్చాయని కొనియాడారు. ఫరివార్ పెహచాన్ పత్ర, స్వామిత్వ లాంటి పథకాలను కేంద్ర ప్రభుత్వం కూడా మెచ్చుకుంది. స్వామిత్వను కేంద్రం కూడా అమలు చేస్తోంది. ఖట్టర్ దీనిని 2021లో ప్రవేశపెడ్తే కేంద్రం గత ఏడాది నుంచి అమలు చేస్తోంది. 2021లో మోదీ ఖట్టర్ ను అంకితభావంతో పని చేస్తారని, వినూత్న విధానాలు అనుసరిస్తారని పొగిడినప్పుడే ఆయనకు ఉద్వాసన తప్పదనుకున్నారు. ఎందుకంటే ఉత్తరాఖండ్, గుజరాత్ ముఖ్యమంత్రులను అదే తీరులో మార్చేశారు. ఖట్టర్ చేతిలో ప్రతి హర్యానా వాసి జీవితం సురక్షితంగా ఉందని కూడా మోదీ చెప్పారు. ఖట్టర్ ఉబ్బి తబ్బిబ్బు అయిపోయి ఉంటారు. మర్నాటికి గానీ మోదీ పొగడ్తలోని ఆంతర్యం ఆయనకు అంతుబట్టి ఉండదు. రాష్ట్రాలలో ప్రభుత్వాల మీద ప్రజలలో ఉండే వ్యతిరేకతను దూరం చేయడానికి మోదీ దగ్గర ఓ మంచి సూత్రం ఉంది. అదే శాసనసభ ఎన్నికలకు కొద్ది నెలల ముందు ముఖ్యమంత్రిని మార్చేయడం. తన సొంత రాష్ట్రమైన గుజరాత్‌లో కూడా 2022 శాసనసభ ఎన్నికలకు ముందు ముఖ్యమంత్రిగా ఉన్న విజయ రూపానీకి ఉద్వాసన పలికి భూపేంద్ర పటేల్ ను ఆ స్థానంలో కూర్చోబెట్టారు. అనేక మంది ఎమ్మెల్యేలకూ టికెట్లు ఇవ్వలేదు. ఖట్టర్ ను మార్చడానికి కూడా ప్రధాన కారణం అక్టోబర్ లో జరిగే శాసనసభ ఎన్నికలే అనుకోవాలి.

బీజేపీ దృష్టితో చూస్తే ఖట్టర్ సమర్థుడైన ముఖ్యమంత్రి కిందే లెక్క ఆయన హయాంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు అమలయ్యాయంటారు. అయితే ఖట్టర్ కు నోటి దురుసు ఎక్కువే. ఉదాహరణకు 2014 ఎన్నికల సమయంలో మహిళలపై అత్యాచారాలను ప్రస్తావిస్తూ అమ్మాయిలు బట్టలిప్పేసి తిరగొచ్చుగా అని నిర్దాక్షిణ్యమైన, జుగుప్సాకరమైన వ్యాఖ్యలు చేశారు. అత్యాచారానికి గురయ్యే మహిళలకు తమ మీద అత్యాచారం చేసిన వారు ముందే తెలుసునని కూడా అన్నారు. గత ఏడాది ఏప్రిల్ లో ఒక న్యాయమూర్తి గురించి మాట్లాడుతూ ఆ న్యాయమూర్తిని "సరి చేయాల్సి ఉంది" అన్నారు. ఇది న్యాయవ్యవస్థను లోబరుచుకునే బీజేపీ విధానానికి అతికినట్టు సరిపోతుంది. వరసగా రెండు సార్లు ముఖ్యమంత్రిగా ఉన్న ఖట్టర్ ఎదుర్కున్న సమస్యలూ తక్కువేం లేవు. శాంతి భద్రతల సమస్య, 2016లో జాట్ల రిజర్వేషన్ల ఆందోళనలో 30 మంది మృతి, డేరా సచ్చా బాబా రాం రహీం మీద అత్యాచార ఆరోపణలు రుజువైన తరవాత సాయుధ దళాలకు ఆయన మద్దతు దార్లకు మధ్య జరిగిన గొడవల్లో 40 మంది మృతి, 2018లో మత నాయకుడు రాంపాల్ ను అరెస్టు చేసినప్పుడు ఆరుగురి ప్రాణాలు పోవడం, 2020-21లోనూ, మళ్లీ ఇప్పుడు రైతుల ఆందోళన, నూహ్ లో మతకలహాలు మొదలగు జటిల సమస్యలను ఖట్టర్ ఎదుర్కోవలసి వచ్చింది. కానీ అప్పుడు బీజేపీ అధినాయకత్వం ఆయనకు అండగా నిలబడింది. కానీ ఖట్టర్ ను మార్చేయడంలో రెండు ప్రధాన కారణాలు ఉన్నాయి. నితీశ్ కుమార్ బీజేపీలో చేరకముందు కులగణన నిర్వహిం చడంతో ఇతర వెనుకబడిన రాజకీయాలకు ప్రాధాన్యత పెరిగింది. అనేక రాష్ట్రాలలోలాగే హర్యానాలో కులాల ప్రాబల్యం ఎక్కువే. ఆ రాష్ట్రంలో ఇతర వెనుకబడిన వర్గాలవారు 40 శాతం మంది ఉన్నారు. సైనీ ఆ వర్గానికి చెందిన వారే. ఖట్టర్ పంజాబీ ఖత్రీ. ఖట్టర్ ప్రభుత్వంలో నాలుగున్నరేళ్లుగా భాగస్వామిగా ఉన్న దుష్యంత్ చౌతాలా నాయకత్వంలోని జన నాయక్ జనతా పార్టీ(జె.జె.పి.) తో బీజేపీ తెగ తెంపులు చేసుకుంది. లోకసభ సీట్ల పంపిణీలో చౌతాలకు బీజేపీతో బేరం కుదరలేదు. సహజరీతిలో ఆ పార్టీని చీల్చాలని బీజేపీ ప్రయత్నిస్తోంది. ఆ పార్టీకి చెందిన నలుగురైదుగురు బీజేపీకి అండగా నిలుస్తున్నారు. బీజేపీతో పొత్తు పెట్టుకున్న చిన్న పార్టీలకు పట్టిన గతే జె.జె.పి.కీ తప్పలేదు. అంటే జాట్ల ఓట్ల కంటే ఇతర వెనుకబడిన వర్గాలవారి శక్తిని బీజేపీ వినియోగించుకోవాలనుకుంటోంది. జాట్లు కాకుండా ఇతరులను సమీకరించడంలో ఖట్టర్ కూడా నిర్ణయాత్మక పాత్రే నిర్వహించారు కానీ ఆయన మీద క్రమంగా జనంలో వ్యతిరేకత పెరుగుతోంది. లోకసభ ఎన్నికలను మోదీ పలుకుబడి మీద లాక్కు రావచ్చు కానీ శాసనసభ ఎన్నికలలో కులసమీకరణల మీద ఆధారపడాలని బీజేపీ అధినాయకత్వానికి తెలుసు. అన్నింటికన్నా మిమిచ్ ప్రాంతీయ నాయకులు ఎవరూ బలపడనీయకూడదన్న మోదీ సూత్రం ఎటూ ఉంది.

హర్యాన బీజేపీలో కల్లోలం

డా.జ్ఞాన్ పాఠక్

రానున్న లోకసభ ఎన్నికల్లో 370 సీట్లు బీజేపీ ఒక్కటే గెలుచుకుంటుందని, ఎన్‌డీఏ అయితే 405 సీట్లు గెలుచుకుంటుందని ప్రధాని నరేంద్ర మోదీ వెళ్లిన చోటల్లా ప్రచారం చేస్తున్నారు. హర్యానాలో తాజాగా బీజేపీలో జరిగిన పరిణామం పార్టీలో కల్లోలం రేపింది.నాయకత్వంలో వణుకు పుట్టిస్తోంది. మోదీ-షాల నిరంకుశత్వం పని విధానంపై చాలా రాష్ట్రాల నాయకత్వం తిరుగబాటు వైఖరి ఇప్పుడున్న 303 సీట్లు కూడా రావడం కష్టమేనని అంచనా వేస్తున్నారు. హర్యాన ముఖ్యమంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్ మంగళవారం రాజీనామా చేశారు. ఆ వెంటనే మంత్రివర్గం కూడా రాజీనామా చేసింది. కేంద్ర ప్రభుత్వం రైతుల డిమాండ్లను తిరస్కరించడంలో రెండోసారి రైతుల ఉద్యమం ప్రారంభించారు. ఈసారి పోలీసు కాల్పుల్లో యువరైతు మరణించడం, అనేకమంది రైతులు లాఠీచార్జిలో గాయపడిన నేపథ్యంలో హర్యానా రైతులు బీజేపీ-జన్నాయక్ జనతాపార్టీ(జెజేపీ) తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బహిరంగంగానే ఖట్టర్ అంటే రైతులు మండిపడుతున్నారు. రాష్ట్రంలో పది లోకసభ సీట్లలో 2019 ఎన్నికల్లో మొత్తం సీట్లు బీజేపీ గెలుచుకున్నది. రైతు ఉద్యమాన్ని ఖట్టర్ పోలీసుల దాష్టీకంతో అణచివేయడానికి పూనుకోవడంతో రైతుల్లో ప్రభుత్వంపై వ్యతిరేకత ఏర్పడి ఈసారి బీజేపీని ఓడించాలని అభిప్రాయం ప్రబలంగా ఉంది. బీజేపీ, జెజేపీతో పొత్తుపెట్టుకుని ప్రభుత్వం ఏర్పాటు చేశారు. రాష్ట్రంలో బీజేపీ లోకసభ ఎన్నికల్లో ఒడిపోతుందని భావించిన జెజేపీ రెండు లోకసభ సీట్లు డిమాండ్ చేసింది. రాష్ట్రంలో తమకు ముప్పు ఏర్పడవచ్చునని పార్టీ నాయకత్వం పసిగట్టడంలో ఖట్టర్ రాజీనామా చేశారు. అలాగే ఉపముఖ్యమంత్రి దుష్యంత్ చౌతాలా కూడా రాజీనామా చేశారు. హర్యానా ప్రభుత్వంలో చకచకా అనేక పరిణామాలు జరిగాయి. ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి రాజీనామా కొత్తముఖ్యమంత్రి నాయబ్ సింగ్ సైనీ ప్రమాణస్వీకారం చేశారు. 31సీట్లు గల కాంగ్రెస్, 10 సీట్లున్న జెజేపీ, ఏడుగురు ఇండిపెండెంట్లు, హర్యాన లోఖిత్‌పార్టీ(1), నేషనల్ లోక్‌దళ్(1)పార్టీలు కలిసి ప్రభుత్వం ఏర్పాటు చేయవచ్చునని భావించారు. 40 సీట్లు కలిగిన బీజేపీ జెజేపీ నుంచి ఐదుగురు ఎంఎల్‌ఏలను తమ వైపు తిప్పుకుని కొత్తప్రభుత్వం ఏర్పాటు చేసింది. 2019 లోకసభ ఎన్నికల్లో బీజేపీ 58.31శాతం ఓట్లు పొందగా, అసెంబ్లీ ఎన్నికల్లో (90స్థానాలు) 36.49 శాతం ఓట్లు మాత్రమే పొందింది. ఈ సారి ఓట్ల శాతం మరింత తగ్గిపోతుందని అంచనా వేస్తున్నారు.

జాట్ రైతువర్గం ఈసారి బీజేపీపై ఆగ్రహంతోఉంది. జెజేపీ నాయకుడు, ఉప ముఖ్యమంత్రి దుష్యంత్ చౌతాలా జాట్ వర్గానికి చెందిన వ్యక్తి. ఈ నేపథ్యంలో మరిన్ని పరిణామాలు జరిగే అవకాశం ఉంది. బీజేపీతో జెజేపీకి సీట్ల పంపిణీ వ్యవహారంలోనూ విభేదాలు ఏర్పడ్డాయి. జెజేపీ తన బలాన్ని ప్రదర్శించేందుకు ఈనెల 13న హిస్సార్ సమావేశం కానుంది. ఈలోపు బీజేపీతో పూర్తిగా తెగతెంపులు చేసుకుంది. కాంగ్రెస్, ఆప్ పార్టీలు హర్యానాలో కలిసి పోటీచేయనున్నాయి. సీట్ల పంపిణీపై చర్చలు జరుగుతున్నాయి. జెజేపీ కూడా కాంగ్రెస్‌తో పొత్తుపెట్టుకున్నట్లయితే ఇప్పటికే తలపడుతున్న కాంగ్రెస్ మరింతగా బలం పుంజుకుంటున్నది. హిస్సార్ ఎంపీ బిజేంద్ర సింగ్ బీజేపీ ప్రాథమిక సభ్యత్వానికి, ఎంపీ స్థానానికి రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే సమక్షంలో బిజేంద్రసింగ్ కాంగ్రెస్‌లో చేరారు. కాంగ్రెస్, ఆప్‌తో కలిసి చౌతాలా పోటీ చేసేందుకు అవకాశాలు మెండుగాఉన్నాయి. అలాగే ఇండియన్ నేషనల్ లోక్‌దళ్ వ్యవస్థాపకుడు, మాజీ డిప్యూటీ ప్రధాని చౌదరి దేవీలాల్ కుమారుడు ఓంప్రకాశ్ కూడా కాంగ్రెస్ కూటమితో కలిసే అవకాశాలు కనిపిస్తున్నాయి. అందువల్ల హర్యానాలో ఈసారి ఎన్నికల్లో ఈ కూటమి గెలిచే అవకాశాలు ఉన్నాయి.

సామాజిక శ్రమ మానవుని జీవ లక్షణం

మర్ల విజయకుమార్

మార్క్స్ సామాజిక శ్రమ మానవుని జీవలక్షణంగా వివరించారు. మానవజాతి పరిణామానికి, అభివృద్ధికి శ్రమే ప్రధాన చోదకశక్తి. ఈవిధమైన సామాజిక శ్రమ, అనేది నెరవేర్చటానికి తగిన శరీర ఆకృతి లేనిదే, ఏజీవీ జ్ఞానజీవిగా రూపాంతరం చెందలేదు. ఉదాహరణకు డాల్ఫిన్ లకు తెలివితేటలు మెండు. అవి ఒకదానిని మరొకటి గుర్తించగలవు. ఈలలతో కూడిన ఒక ప్రాథమికమైన భాషకూడా వాటికి ఉన్నది. అయితే అవి జలచర జీవులు అయిన కారణంగానూ, వాటి శరీరాంగాలు శ్రమద్వారా వస్తువుల తయారీకి అనువుగా లేనందువలన, అవి జ్ఞానజీవులుగా రూపొందలేక పోయాయి. సముద్రంలో ఉండే ఆక్టోపస్ ల విషయంలో కూడా ఇదే సూత్రం వర్తిస్తుంది. అట్లానే తేనెటీగలు సామాజిక జీవనాన్ని గడుపుతాయి. గాలిలో విన్యాసాల ద్వారా అవి ఒకదానికొకటి సమాచారాన్ని అందించుకుంటాయి. అయితే, మానవులకున్న భాష, రాత లిపి, ఒక తరం ఆలోచనా విధానాన్ని తరువాతి తరాలకు అందించటం వంటి నాగరికతా చిహ్నాలు లేకపోవటం కారణంగా, మానవుడు మినహా మిగతా అన్ని జీవరాశులలోనూ, విజ్ఞాన జీవనం అలవడలేదు. ఒక పక్షి అతి చక్కని, పొందికైన గూడును నిర్మిస్తుంది. ఒక సాలెపురుగు అతి సుందరమైన సాలెగూడును నిర్మించగలదు. ఆ లక్షణం వాటికి పుట్టుకతో వచ్చిన జీవలక్షణంగా వచ్చినది. కాని మానవుడు తాను తయారుచేయబోయే వస్తువు రూపాన్ని గాని, నిర్మించబోయే భవనాన్ని కాని, తన మస్తిష్కంలో ముందుగా ఊహించుకుని, దాని తయారీకి కావలసిన ముడిపదార్థాలను, వాడవలసిన పనిముట్లను అమర్చుకుని, తన పనిని ఒక పథకంప్రకారం పూర్తిచేస్తాడు. ఆక్రియలో, ఇతరులు ఇచ్చే సలహాలను పరిగణలోకి తీసుకుని, తన పని విధానంలో మార్పులు చేసుకోగలడు. అంటే, మానవుని పని సామర్థ్యం జీవగతంగా కాకుండా, సమాజపరంగా అలవర్చుకున్నది. ఈ విషయంలోనే మానవుడు మిగతా అన్నిజీవులకంటే భిన్నమైన లక్షణాలు కలిగి ఉన్నాడని చెప్పవచ్చును. మరొక ముఖ్య విషయమేమిటంటే, పెంపుడు కుక్కలు, పిల్లులు మానవ సంపర్కంతో తమకు అంతకు ముందులేని కొన్ని లక్షణాలను అలవర్చు కుంటాయి. కాని వాటి పిల్లలకు అవే లక్షణాలు సంక్రమిస్తాయనే గ్యారంటీలేదు. ఎందుకంటే, తాము సముపార్జించిన జ్ఞానాన్ని తమ తరువాతి తరాలకు అందజెయ్యటానికి, భాషగాని, లిపిగాని వాటికి లేదు. ఆ సామర్థ్యం ఒక్క మానవజాతికే సొంతం. ఆ కారణంచేత, తరాలు గడిచిన కొద్దీ, మానవ విజ్ఞాన సంపద పెరుగుతూ వచ్చింది. జీవపరిణామంలో మరొక ముఖ్యమైన అంశాన్ని మనం ఇక్కడ ప్రస్తావించుకోవలసి ఉన్నది. వివిధ జాతులకు చెందిన జీవులు, ఒకే వాతావరణ పరిస్థితుల్లో, ఒకే రకమైన జీవన విధానాన్ని గడుపుతున్నప్పుడు, వేర్వేరు కాలాల్లో అయినా, దాదాపుగా ఒకే రకమైన శరీర లక్షణాలను ఏర్పాటుచేసుకుంటాయి. ఉదాహరణకు టి రెక్స్ సరీసృపం, క్షీరజమైన పులి, సముద్రంలో జీవించే షార్క్ చేప ఒకే రకమైన

వేటాడి జీవించే జీవన విధానాన్ని కలిగి ఉండటంతో, వాటి గ్రహణ శక్తి, పరుగు వేగం, మొదలైన అనేక విషయాల్లో సారూప్యత కనిపిస్తుంది. అట్లానే ఇతర జీవులకు ఆహారంగా ఉపయోగపడే శాఖాహార జీవులు వివిధ జాతులకు చెందినప్పటికి, వాటి లక్షణాల్లో సారూప్యత కనిపిస్తుంది. అట్లానే పువ్వుల చెట్ల పరిణామానికి, వాటిపువ్వులలోని తేనెను గ్రహించే కీటకాలకు పరస్పర సంపర్కం, వాతావరణ పరిస్థితులలో మార్పు వంటి ప్రాకృతిక క్రమం ద్వారా, ఒక జీవిలో వచ్చే మార్పులు మరో జీవిపై ప్రభావం చూపిస్తాయి. ఇట్లా చెప్పుకుంటూపోతే, అనేక సోదాహరణలు మనకు ప్రకృతిలో కనిపిస్తాయి. దీనినే సహపరిణామం (కో ఎవల్యూషన్) అని పిలుస్తారు. ఆ కారణం చేతనే, ఈ సువిశాల విశ్వంలో ఎక్కడ నాగరికత గలిగిన జ్ఞానజీవులు ఉద్భవించటం అనేది జరిగినా, వాటికి ఉండవలసిన శరీరాకృతి, సామాజిక సంస్కృతి కొన్ని విశిష్టమైన లక్షణాలను కలిగి ఉండాలి. వాటి జీవన విధానంలో, శరీర నిర్మాణంలో కొద్దిపాటి వైవిధ్యం ఉన్నా, మొత్తంగా ఒక జ్ఞానజీవిని మరొక జ్ఞానజీవి ఉనికిని గుర్తించగలదని చెప్పవచ్చును. మరొక ప్రధానమైన అంశం ఏమిటంటే, ఈ విశ్వంలో అన్నిచోట్లా పదార్థ నిర్మాణం ఒకే విధంగా జరిగిన కారణంగా, ఆ అణువులతో ఏర్పడే మూలకాలు కూడా విశ్వం అంతటా ఒకే విధంగా ఉంటాయి. విశ్వంలో అనేక చోట్ల కార్బన్ ఆధారిత మూలకాలు ఉన్నట్లుగా కనుగొన్నారు కనుక, వాటితో తయారయిన ప్రాథమికమైన జీవపదార్థంకూడా ఒకేవిధమైన లక్షణాలు కలిగి ఉండటంచేత, జీవకణాల నిర్మాణం కూడా అన్ని చోట్లా ఒకే విధంగా జరుగవచ్చును. అయితే భూమి పైననే జీవులలో ఇంత వైవిధ్యం ఉన్నప్పుడు, ఇక వేరు వేరు వాతావరణ పరిస్థితులు ఉన్న వివిధ నక్షత్రమండలాలలో జీవ వైవిధ్యం మరింత ఎక్కువగా ఉండవచ్చును. అయితే, వాటినుండి జ్ఞానజీవులు గాని ఉద్భవించటం అనేది ఎక్కడ జరిగినా, వాటి నిర్మాణంలో కొంతైనా సారూప్యత ఉండే అవకాశాలే ఎక్కువగా ఉన్నాయి. అయితే జీవానికి అనుకూల పరిస్థితులు ఉన్న గ్రహం పైన కూడా భూమిపై వలనే జీవ వైవిధ్యం ఉండవచ్చును. సముద్రాలు ఉన్నట్లయితే జల చరాలు, నేల పైన సంచరించే, గాలిలో ఎగిరే జీవులు ఉండవచ్చును. మన సూర్యుడు జి గ్రేడ్ కు చెందిన పసుపు నక్షత్రం. అయితే మన గెలాక్సీలోనే అనేక రకాలైన నక్షత్రాలు ఉన్నాయి. వాటినుండి వెలువడే కాంతిలో ఏ రంగు ప్రధానమైనది అయితే, దానిని బట్టి అక్కడ వృక్షజాతి అభివృద్ధి చెందుతుంది. అక్కడ కిరణ జన్య సంయోగ క్రియ భూమిపై వలే కాకుండా వేరే రకంగా ఉండవచ్చును. చెట్ల ఆకులు ఆకుపచ్చ కాకుండా ఎరుపు రంగులోనో, నీలం రంగులోనో ఉండవచ్చును. అట్లానే జంతుజాతుల శరీరాకృతిలో కూడా ఊహించలేని విధంగా వైవిధ్యం ఉండవచ్చును. అయితే హాలివుడ్ చిత్రాలలో చూపించే విధంగా గ్రహాంతర జీవులు ఉంటాయని మనం భావించినవసరం లేదు. ఆ చిత్రాలు ప్రేక్షకులలో భయాన్ని కలిగించి సొమ్ములు చేసుకోవటానికి ఉద్దేశించినవి. 'అయితే, మనకుగాని గ్రహాంతరజీవులతో సంపర్కం గాని ఏర్పడితే, వారికీ మనకూ సమాచార సంపర్కం ఎట్లా ఏర్పడగలదు?' అనే ప్రశ్న సహజంగానే తలెత్తుతుంది. ఈ సువిశాల విశ్వంలో ఏమూలలోనైనా ప్రకృతి సూత్రాలు ఒకే విధంగా పనిచేస్తాయి. ఉదాహరణకు, ఎక్కడైనా, హైడ్రోజన్, కార్బన్ అణువుల నిర్మాణం ఒకేలాగా ఉన్నప్పుడు, మనం హైడ్రోజన్ లో ఉన్న ఎలక్ట్రానులు ఒకటి అని, కార్బన్లో ఉన్న ఎలక్ట్రానులు ఆరు అని, ఆక్సిజన్లో ఎనిమిది అని మనం చూపిస్తే, వారికి అర్థం అవుతుంది. ఆవిధంగా గణితంద్వారా, పదార్థ విజ్ఞానం ద్వారా మనకు గ్రహాంతర విజ్ఞానజీవులతో ప్రాథమికమైన సంపర్కం ఏర్పాటుచేసుకునే అవకాశం ఉన్నది. వారితో సంపర్కానికి ఒక మాధ్యమం అంటూ ఏర్పడితే, వారి భాషను మనం, మన భాషను వారు అర్థంచేసుకోవటం రెండవదశ. ఇక చివరిగా, భూమికి ప్రయాణించగలిగిన ఏ విజ్ఞానజీవులైనా, మనలాగే నాగరికతలో, సాంకేతిక పరిజ్ఞానంలో ఉన్నత స్థాయికి చేరుకున్నవారే అయి ఉండాలి. లేకపోతే వారు ఇంత సుదూరాలకు అంతరిక్షయానం చేయలేరు. అటువంటి అభివృద్ధిచెందిన నాగరికత, హింసకు, దౌర్జన్యానికి, దోపిడీకి పాలుపడదు. వారు అటువంటి అనాగరిక లక్షణాలను ఎప్పుడో అధిగమించి ఉంటారు. వారు ఇతరజీవులకు ఏవిధమైన నష్టం, హాని కలుగకుండా ఉండే జీవనవిధానాన్ని పెంపొందించ ుకుని ఉంటారు. అందుచేత, ఇతర గ్రహ వాసులు మనపై యుద్ధం చేసి వినాశనాన్ని సృష్టిస్తారని భయపడటం అర్థరహితం. పెట్టుబడిదారీ స్వభావం గలిగిన రచయితలు, హాలీవుడ్ చిత్రనిర్మాతలు ఈ విధమైన గ్రహాంతర జీవులు సృష్టించే వినాశనం గురించిన అనేక కథనాలు ప్రచారంలో పెట్టారు. ఇది పూర్తిగా వ్యాపార దృష్టితో, లాభార్జన కోసం ప్రజలలో భయాందోళనలను కలిగించటంద్వారా, ప్రజలలో గ్రహాంతర జీవులపట్ల ఒక తప్పుడు అవగాహనను కల్పించారు. ఎగిరే సాసర్లు, గ్రహాంతర నౌకల గురించి అనేక వార్తలు పత్రికల్లో వస్తుంటాయి. ఇప్పటివరకు ఇదమిద్ధంగా గ్రహాంతర జీవులను మనం కలవలేదు. కానీ శాస్త్రజ్ఞులు భావించిదేమిటంటే మనకంటే ఎంతో ఎక్కువ అభివృద్ధి అయినా గ్రహాంతర జీవులు కాంతి సంవత్సరాల దూరాన్ని అధిగమించి సూర్యకుటుంబానికి చేరుకొని ఉంటే ఏదో ఒక రోజు మనకు వారితో సంపర్కం ఏర్పడవచ్చును. అటువంటి సంపర్కం పరిణామాలు ఎట్లా ఉంటాయి? మన సామాజిక, రాజకీయ, శాస్త్ర సాంకేతిక రంగాలలో ఎటువంటి మార్పులు సంభవిస్తాయని ఇప్పుడే చెప్పటం సాధ్యం కాదు.

సెల్: 9848933645

ఆయారాం గయారాం రాజకీయాలు

చలసాని వెంకటరామారావు

గయాలాల్ అనే హర్యానా రాష్ట్ర శాసనసభ్యుడు 1967లో ఉదయం ఒక పార్టీలోకి, మధ్యాహ్నం మరో పార్టీలోకి, రాత్రికి ఇంకో పార్టీలోకి ఒక్క రోజులో మూడుసార్లు పార్టీలు ఫిరాయించాడు. దీనితో ఆనాడు పార్టీ ఫిరాయింపుదారులకు "ఆయారామ్ గయారామ్"లు అనే పదం పుట్టింది. ఫిరాయింపుదారులను ఈ పేరుతో పిల్వడం అప్పటి నుండి స్థిరపడింది. 1967లోనే దేశ రాజకీయాలలో చాలా మార్పులు ప్రారంభమయ్యాయి. అనేక రాష్ట్రాలలో నాడు కాంగ్రెస్ వ్యతిరేక గాలివచ్చి కాంగ్రెస్ అధికారాన్ని కోల్పో యింది. అస్థిర రాజకీయాలకు నాడు బీజంపడి పార్టీ ఫిరాయింపులు నిత్య కృత్యంగా మారాయి. నాడు "ఆయారాం, గయారాం" రాజకీయాలతో ప్రజా స్వామ్యం నగుబాటుకు గురైంది. దీనితో పార్టీ ఫిరాయింపుల అంశంపై దేశ వ్యాపితంగా పెద్దఎత్తున చర్చ జరిగింది. 1985లో పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం రావడానికి ఇది దారి తీసింది. 52వ రాజ్యాంగ సేకరణ చట్టం ద్వారా పదవ షెడ్యూల్‌లో చేర్చి రాజకీయ పార్టీల నుండి ఫిరాయింపులను కట్టడి చేయాలని, ఎన్నికైన ప్రభుత్వాలను తరచుగా అస్థిరతకు గురిచేయకుండా, ఫిరాయింపులను ప్రోత్సహించకుండా ప్రజాస్వామ్య విలువలను, స్ఫూర్తిని పరిరక్షించాలని ఈ చట్టాన్ని రూపొందించడం జరిగింది. ఈ చట్టం వచ్చి నాలుగు దశాబ్దాలకు చేరువుగా ఉన్నా నేటికీ పార్టీ ఫిరాయింపులు భారత ప్రజాస్వామ్యాన్ని కుదిపివేస్తున్నాయి. ఒక పార్టీ అభ్యర్థిగా ఎన్నికై మరో పార్టీలోకి ఫిరాయించటం సర్వసాధారణ అంశంగా మారిపోయింది. ఒక పార్టీ నుంచి ఎన్నికైన తరువాత మరో పార్టీలోకి ఫిరాయించి తమ పదవికి రాజీనామా సమర్పించకుండానే మంత్రులుగా సైతం పనిచేస్తుండటం తరచుగా జరుగు తున్నది. వర్తమాన రాజకీయాలలో నేడు నైతిక విలువలు తగ్గిపోయాయి. దేశభక్తి, జాతీయస్ఫూర్తి లోపించాయి. స్వాతంత్ర్య ఉద్యమ లక్ష్యాలు, ప్రజాసేవ దృక్పథం లోపించాయి. ధనవంతులు, సంపన్నులు, దొంగ డబ్బు నిల్వ ఉన్న వారు, పదవీ వ్యామోహపరులు రాజకీయరంగంలో నాయకులుగా చలా మణీ అవుతున్నారు. దేశ ప్రజల ప్రయోజనం కంటే వ్యక్తిగత స్వార్థప్రయో జనాలు, వ్యాపార అవసరాలు ప్రాతిపదికగా రాజకీయ నాయకులు పనిచేస్తుంటే ప్రలో భాలు, వత్తిడి, డబ్బు, రాజకీయ అస్థిరత, పార్టీల సిద్ధాంతాల పట్ల ఆకర్షణ తగ్గటం వంటి కారణాలతో పార్టీ ఫిరాయింపులు నిత్యకృత్యంగా మారాయి. అక్రమంగా సంపాదించిన సంపదను చట్టబద్ధం చేసుకునేందుకు అధికార రాజ కీయాలు సులువైన మార్గంగా ఉన్నాయి. ఇందుకు తమ అక్రమ సంపాదనను సక్రమంగా మార్చుకోటానికి అధికార పార్టీల వత్తిడికి తలొగ్గి తరచుగా పార్టీ, ఫిరాయింపులు జరుగుతున్నాయి. పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టాన్ని అమలు చేయవలసిన చట్టసభల స్పీకర్లు సైతం పక్షపాత ధోరణితో వ్యవహరిస్తున్నారు. అధికారపక్షంలోకి ఫిరాయించిన సభ్యులను విచారించటంలో, చర్యలు గైకొనటంలో తాత్సార వైఖరి అవలంబిస్తున్నారు. ఫిరాయింపుదార్లు మంత్రులుగా సైతం పనిచేయటానికి సహకరిస్తున్నారు. విచారణ పేరుతో సంవత్సరాలు కాలయాపన చేస్తున్నారు. స్పీకర్లు సైతం అధికార పార్టీల రాజకీయ వత్తిడులకు లొంగి అనైతికంగా వ్యవహరిస్తున్నారు. అధికార పార్టీకి తొత్తులుగామారి "అయినవారికి ఆకుల్లో కానివారికి కంచాల్లో " అన్నట్లు అంటున్నారు. చర్యలు తీసుకునే విషయంలో స్పీకర్ నిర్ణయమే అంతిమం. న్యాయస్థానాలకు విచారణా ధికారంలేదు. ఒక్క న్యాయసమీక్ష మాత్రమే చేయవచ్చును. పార్టీ మారిన వారిని అనర్హులుగా ప్రకటించి తరువాత ఎన్నికలలో పాల్గొనకుండా నిరోధించవచ్చును. పార్టీ ఫిరాయింపు, చీలిక, విప్ దిక్కరణ వంటి అంశాలలో సభాపతి నిర్ణయమే అంతిమం. 1990లో వి.పి.సింగ్ ప్రభుత్వంలో న్యాయశాఖ మంత్రిగా పనిచేసిన దినేష్‌సింగ్ నాయకత్వాన ఎన్నికల సంస్కరణల కొరకు ఒక కమిటీ నియ మించారు. ఈ కమిటీతోపాటు లా కమిషన్ సైతం పార్టీ ఫిరాయింపులపై అనేక సూచనలు చేశారు. 1993లో వోహ్రాకమిటి, 1998లో ఎన్నికల నిధుల అంశంలో ఇంద్రజిత్‌గుప్తా కమిటీ, 1999లో లా కమిషన్, 2001లో రాజ్యాంగ సమీక్ష జాతీయ కమిషన్, 2004లో భారత ఎన్నికల సంఘం ఎన్నికల సంస్కరణలు, 2004లో జీవన్‌రెడ్డి కమిటీ, 2008లో రెండవ పరిపాలనా సంస్క రణల కమిషన్ నిర్ణయాలతో అనేక ఎన్నికల సంస్కరణలను తీసుకువచ్చినా ప్రయోజనం మాత్రం శూన్యం. ప్రధాన ఎన్నికల కమిషన్ స్థానంలో ముగ్గురు ఎన్నికల కమిషనర్ల నియామకం జరిగింది. ఓటింగ్ వయసును 18 ఏళ్లకు కుదించారు. టెలివిజన్, రేడియోలను స్వతంత్ర కార్పొరేషన్లుగా మార్చారు. అభ్యర్థులు రెండు కంటే ఎక్కువ సీట్లనుండి పోటీ చేయకుండా నిషేధించారు. ఈ కమిటీల సిఫారసులను కొన్నింటిని ఆచరణలోకి తెచ్చారు. 1974లో వచ్చిన తార్కుండే కమిటీ, జయప్రకాష్ నారాయణ కమిటీల సిఫారసులను కూడా పరిగణనలోకి తీసుకుని ఎన్ని చర్యలు తీసుకున్నా పార్టీ ఫిరాయింపుల సమస్య నేటికీ భారత ప్రజాస్వామ్యాన్ని ఎక్కిరిస్తూనే ఉంది. రాజకీయ పార్టీలు సైతం పనితీరు, ప్రజాదరణ ఆధారంగా కాకుండా వనరులు సమీకరించే సామర్థ్యం ఆధారంగా టిక్కెట్లు కేటాయిస్తున్నారు. దీనితో ప్రజాసేవకుల స్థానంలో డబ్బు విచ్చలవిడిగా ఖర్చు చేయగల సామర్థ్యం ఉన్నవాళ్లు వచ్చి డబ్బు వినియోగానికి పరిమితులు లేకుండాపోయాయి. దీనితో సంపాదన, కాంట్రాక్టులు సంపా దించటం, పదవులు

పొందటం లక్ష్యంగా స్వంత పార్టీల వ్యతిరేక కార్యకలా పాలు, స్వార్థంకోసం, అధికార పార్టీలకు దాసోహం అనటం పెరిగి పోయింది. పార్టీ నిర్మాణ చట్రంలో పనిచేయటం, సంస్థాగత క్రమశిక్షణ, పార్టీలు సిద్ధాం తాలు మృగ్యమైపోయాయి. ప్రజాస్వామ్యం స్థానంలో వ్యక్తి స్వార్థం ప్రముఖంగా మారిపోయింది. 2024 సార్వత్రిక ఎన్నికల ప్రక్రియ దేశంలో ప్రారంభంకానున్న క్రమంలో ఈ 'ఆయారాం గయారాం రాజకీయాలు ఊపు అందుకున్నాయి. గత 10 ఏళ్లుగా దేశాన్ని పాలిస్తున్న నరేంద్రమోదీ నాయ ుకత్వంలోని బీజేపీ, వత్తిడి, బ్లాక్‌మెయిల్ ద్వారా పార్టీ ఫిరాయింపులు ద్వారా ఎన్నికలలో లబ్ధిపొందాలని చూస్తున్నది. ఇప్పటికే జేడీయూ, జేడీఎస్, బీజేడీ, టీడీపీ, వంటి పార్టీలను తమ కూటమిలోకి ఫిరాయించేట్లు చేశారు. అందుకు అంగీకరించని జార్ఖండ్ రాష్ట్ర ముఖ్యమంత్రి హేమంతసోరేన్‌ను అరెస్టుచేసి జైలుకు పంపారు. దిల్లీ ముఖ్య మంత్రి కేజ్రీవాల్‌ను అరెస్టు చేస్తామని బెదిరిస్తున్నారు. బీహార్ ముఖ్యమంత్రి నితీష్‌కుమార్‌ను అనైతికంగా తమ కూటమిలో చేర్చుకున్నారు. రాష్ట్రీయ లోక్‌దళ్ పార్టీని తమ కూటమిలోకి స్వాగతించారు. అకాలీదళ్ వంటి పార్టీలను తమ కూటమిలోకి తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. లాలూప్రసాద్ యాదవ్ కుటుంబసభ్యులను, ఫరూఖ్ అబ్దుల్లాను, సోనియా, రాహుల్, ఖర్గేలను వేధింపు లకు గురిచేస్తున్నారు. 2024 సార్వత్రిక ఎన్నికలతో పాటు ఆంధ్రప్రదేశ్ శాసన సభకు ఎన్నికలు జరుగనున్నాయి. గత ఎన్నికల నాటికి బీజేపీ ఎన్‌డీఏ కూటమి నుండి బైటకువచ్చి పోటీచేసిన తెలుగుదేశం పార్టీ ఇప్పుడు తిరిగి బీజేపీతో అపవిత్ర జట్టు కట్టింది. ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ ఆంధ్రరాష్ట్రంలో "ఆయారాం గయారాం" సంస్కృతి విశృంఖలంగా మారిపోయింది. ఆటువారు ఇటు, ఇటువారు అటు మారిపోతున్నారు. మంత్రులు, పార్లమెంటు సభ్యులు, శాసనసభ్యులు నిస్సిగ్గుగా పార్టీలు మారుతున్నారు. నిన్నటివరకు బూతుల పంచాంగంతో తిట్టిన పార్టీలలోనే తిరిగి చేరుతున్నారు. అధికార పార్టీనుండి ప్రతిపక్షంలోకి, ప్రతిపక్షం నుండి అధికార పార్టీలోకి వలసలు రాజకీయ వలువలను ఊడ్చి వేస్తున్నాయి. పార్లమెంటు సభ్యులు కేశినేనినాని, వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, వల్లభనేని బాలశౌరి, మాగుంట శ్రీనావాసులురెడ్డి, ఆదాల ప్రభాకర్, లావు శ్రీ కృష్ణదేవరాయలు, రఘురామ కృష్ణంరాజులు పార్టీ ఫిరాయింపుదారుల జాబితాలో ఉన్నారు. గుమ్మనూరి జయరాం రాష్ట్ర క్యాబినెట్ మంత్రిగా ఉండి పార్టీ మారారు. శాసనసభ్యులు వసంత కృష్ణప్రసాద్, మానుగుంట మహీధర రెడ్డి, కొలుసు పార్థసారధిలు ఉన్నారు. మంగళగిరి శాసనసభ్యులు ఆళ్ల రామకృష్ణారెడ్డి ఇప్పటికే నెలలో రెండుసార్లు ఫిరాయింపులకు పాల్పడ్డారు. గతంలోనే పార్టీ ఫిరాయింపులకు పాల్పడిన వాసుపల్లి గణేష్, మద్దాలిగిరి, కరణం బలరాం, వల్లభనేని వంశీ, ఆనం రామనారాయణ రెడ్డి, మేకపాటి చంద్రశేఖరరెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, ఉండవల్లి శ్రీదేవిలు ఫిరాయింపుల చట్టం కింద తమ సభ్యత్వాలను కోల్పో యారు. పార్టీల టిక్కెట్లు రానివారు, సిద్ధాంతాలు లేనివారు 'ఆయారాం గయారాం' రాజకీయాలకు జీవం పోస్తున్నారు. ప్రజాస్వామ్య విలువలను ఆపహాస్యం చేస్తున్నారు. ఆర్థిక నేరగాళ్లు అధికారం అందలాలు ఎక్కి పెత్తనం చేస్తున్నారు. క్రిమినల్స్‌గా హత్యలు, అత్యాచారాలకు పాల్పడినవారు, అక్రమ సంపాదనతో కోట్లకు పడగలెత్తినవారు ముఖ్యమంత్రులుగా, మంత్రులుగా, చట్టసభల సభ్యులుగా ఎన్నికవుతుంటే ప్రజాస్వామ్యం ఎలా ముందుకు వెళుతుందో ఓటర్లు ఆలోచించవలసిన సమయం వచ్చింది. ఏ ప్రజా ప్రయోజనం ఆశించి పార్టీలు ఫిరాయిస్తున్నారో ఓటర్లు గ్రహించాలి. ప్రలోభాలకు అతీతంగా రాజ్యాంగ స్ఫూర్తితో నిజమైన ప్రజా సేవకులకు, సిద్ధాంత నిబద్ధులకు, నిస్వార్థ ప్రజానాయకులను చట్ట సభలకు పంపాల్సి ఉంది. అప్పుడే మన ప్రజాస్వామ్యం 'మూడుపువ్వులు, ఆరుకాయ లు'గా వర్ధిల్లుతుంది. ఓటరులారా! రానున్న ఎన్నికలలో ఆలోచించి ఓటు వేయండి 'ఆయారాం గయారాం' రాజకీయాలకు స్వస్తి పలకండి.

సీపీఐ రాష్ట్ర సమితిసభ్యులు
సెల్: 9490952093

మాకేమవుతుందో! ఎన్ని కష్టాలొస్తాయో!

సీఏఏ అమలుతో భయాందోళనలో 'షహీన్‌బాగ్' ముస్లింలు

న్యూదిల్లీ: మోదీ ప్రభుత్వం పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ) అమలుకు చర్యలను వేగవంతం చేసింది. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తుండటంతో చట్టం తెచ్చిన దాదాపు నాలుగేళ్ల తర్వాత సీఏఏ నిబంధనలను నోటిఫై చేసి హడావిడి అమలునకు యత్నిస్తోంది. ఈ చర్య దేశ ముస్లింలలో భయాందోళనకు దారితీసింది. తమకు, తమ కుటుంబాలకు ఏం జరుగుతుందో అన్న భయం వారిని వెంటాడుతోంది. పౌరసత్వ సవరణ చట్టం అమల్లోకి వస్తే తమ మనుగడ కష్టమవుతుందన్న భావన కలుగుతోంది. సీఏఏను అమలు చేయడం ద్వారా తమ గళాన్ని అణచివేసి తమను పక్కకు నెట్టివేసే ప్రయత్నాన్ని కేంద్రప్రభుత్వం చేస్తోందని దిల్లీలోని షహీన్‌బాగ్ వాసులు ఆవేదన వ్యక్తం చేశారు. 2019లో పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ) తీసుకొచ్చినప్పుడు షహీన్‌బాగ్ కేంద్రంగా 100 రోజుల ఆందోళన జరిగింది. తాజా పరిణామం షహీన్‌బాగ్ వాసులను తీవ్ర భయాందోళనకు గురిచేసింది. కేంద్ర ప్రభుత్వ నిర్ణయం తమను తీవ్రంగా కలచివేసిందని స్థానికులు తెలిపారు. అప్రజాస్వామిక చట్టానికి వ్యతిరేకంగా పెద్దఎత్తున ఉద్యమించినప్పటికీ ఈ చర్యలు చేపట్టడంపై అసహనం వ్యక్తం చేశారు. ఓ వైపు భయాన్ని మరోవైపు కోపాన్ని ప్రదర్శించారు. 'రమదాన్ ప్రారంభమైంది కాబట్టి ఉపవాసాలు, ప్రార్థనలతో ముస్లింలు బిజీగా ఉన్నారు కానీ వారి లోపల సీఏఏకు వ్యతిరేకంగా ఆగ్రహజ్వాల రగులుతోంది. 2019-20లో సీఏఏకు వ్యతిరేకంగా జరిగిన ఉద్యమం నీరుగారిపోయింది. రమదాన్‌లో కాకుండా వేరొక సమయంలో ఈ చర్యలకు పూనుకొని ఉంటే తప్పక ఉద్యమం జరిగేది' అని స్థానికుడు ఒకరు తెలిపారు. 'కేంద్రప్రభుత్వ నిర్ణయం ఆగ్రహం తెప్పించింది. ముస్లింలను లక్ష్యంగా చేసుకునేందుకు కేంద్రం తన అధికారాలను దుర్వినియోగిస్తోంది. ఈ నిర్ణయాన్ని అంగీకరించబోం. మా కుటుంబాల క్షేమం కోసమే మౌనంగా ఉన్నాం' అని స్థానిక దుకాణదారుడు అన్నారు. సీఏఏ వ్యతిరేకంగా జరిగిన పోరాటాన్ని కనీసం పరిగణనలోకి తీసుకోకుండా కేంద్రప్రభుత్వం తాజా చర్యలు చేపట్టడం బాధాకరమని మరొకరన్నారు. ముస్లింలు భారత పౌరులని ఎందుకు మరుస్తున్నారని, వారి వ్యతిరేకతను ఎందుకు పరిగణనలోకి తీసుకోరని కేంద్రాన్ని నిలదీశారు. సీఏఏ నిబంధనలను కేంద్రప్రభుత్వం నోటిఫై చేయడంతో ముస్లింలపై ప్రభావం తీవ్రంగా ఉంటుందన్న భయాన్ని స్థానికులు వ్యక్తం చేశారు. 2019-20లో సీఏఏకు వ్యతిరేకోద్యమానికి షహీన్‌బాగ్ కేంద్రంగా ఉంది. దాదాపు 100 రోజుల ఆందోళన జరిగింది. రమదాన్ క్రమంలో ఈ ప్రాంతం ప్రశాంతంగా ఉంది. ప్రభుత్వం గురించి మాట్లాడితే ఇబ్బందుల్లో పడుతామన్న భయంతో మీడియాతో సంభాషణను చాలా మంది నివారించారు. అవాంఛనీయ ఘటనల నివారణ కోసం ముందు జాగ్రత్తగా 500 మందికిపైగా పోలీసులను షహీన్‌బాగ్‌లో మోహరించారు. పెట్రోలింగ్ బృందాలను రంగంలోకి దించినట్లు పోలీసు అధికారి ఒకరు తెలిపారు. రమదాన్ కాబట్టి ఆందోళనలు జరిగే సంకేతాలు లేవని, అంతా ప్రశాంతంగా ఉందని ఆయనన్నారు.

ఎన్నికల్లో తప్పుడు సమాచారానికి చెక్

ఈసీతో గూగుల్ జట్టు

న్యూదిల్లీ: సార్వత్రిక ఎన్నికల వేళ కేంద్ర ఎన్నికల సంఘంతో గూగుల్ జట్టు కట్టింది. తప్పుడు సమాచార వ్యాప్తిని అడ్డుకునేందుకు చర్యలు చేపట్టింది. అధీకృత సమాచారం మాత్రమే ప్రజల్లోకి వెళ్లేలా చూడడంతో పాటు ఏఐని వినియోగించి రూపొందించే వీడియోలకు లేబుల్ వేయాలని నిర్ణయించింది. ఎన్నికల్లో పారదర్శకత కోసం ఈ నిర్ణయం తీసుకున్నట్లు గూగుల్ తన బ్లాగ్ పోస్ట్‌లో పేర్కొంది. ఓటరుగా పేరు ఎలా నమోదు చేసుకోవాలి? ఎలా ఓటు వేయాలి? వంటి సమాచారాన్ని సులువుగా తెలుసుకోవడం కోసం ఈసీతో జట్టు కట్టినట్లు గూగుల్ తెలిపింది. ఇంగ్లీష్, హిందీ భాషల్లో ఈ సమాచారం లభిస్తుందని పేర్కొంది. ఏఐని వినియోగించి రూపొందించే కంటెంట్‌ను గుర్తించడం సులభతరం చేసినట్లు గూగుల్ తెలిపింది. డీప్‌ఫేక్, మార్ఫింగ్ చేసిన మీడియాను కట్టడి చేసినట్లు పేర్కొంది. యూట్యూబ్‌లోని ఏఐ ఫీచర్లతో క్రియేట్ చేసిన కంటెంట్‌కు ఇప్పటికే లేబుల్ వేయడం ప్రారంభించామని వెల్లడించింది. గూగుల్‌కు చెందిన ఏఐ జెమినిపై విమర్శల నేపథ్యంలో గూగుల్ మరో నిర్ణయం తీసుకుంది. ఎన్నికలకు సంబంధించిన సమాచారం ఇవ్వకుండా గూగుల్ ఆంక్షలు విధించింది. యూట్యూబ్, గూగుల్ సెర్చ్‌లో ఎన్నికలకు సంబంధించిన వార్తలు, సమాచారం కూడా అధీకృత వేదికల నుంచే డిస్‌ప్లే అయ్యేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపింది. ఎన్నికల వ్యవస్థను ప్రభావితం చేసే తప్పుడు సమాచారం, హింసను ప్రేరేపించేవి, విద్వేష వ్యాఖ్యల విషయంలో విధానాలు రూపొందించినట్లు పేర్కొంది. పాలసీకి వ్యతిరేకంగా ఉన్న కంటెంట్‌ను తొలగించేందుకు గానూ మనుషులతో పాటు మెషిన్ లెర్నింగ్‌ను కూడా వినియోగించనున్నట్లు తెలిపింది. ఎన్నికలకు సంబంధించిన ప్రకటనలపైనా కఠిన నిబంధనలు అమలు చేయనున్నట్లు గూగుల్ తన బ్లాగ్ పోస్ట్‌లో పేర్కొంది.

కుప్పకూలిన 'తేజస్': విచారణకు ఆదేశం

జైసల్మేర్: రాజస్థాన్‌లోని జైసల్మేర్‌లో భారత వాయుసేనకు చెందిన తేజస్ యుద్ధ విమానం ఒకటి నేలకూలింది. శిక్షణ సమయంలో ఈ ప్రమాదం చోటుచేసుకున్నట్లు అధికారులు తెలిపారు. అప్రమత్తమైన పైలట్ సురక్షితంగా బయటపడినట్లు చెప్పారు. ప్రమాదానికి గల కారణాలు వెలికితీసేందుకు విచారణకు ఆదేశించినట్లు వాయుసేన తెలిపింది. స్వదేశీ పరిజ్ఞానంతో భారత్ రూపొందించిన యుద్ధ విమానాల్లో 'తేజస్' ఒకటి. 2016లో దీన్ని వాయుసేనలోకి చేర్చారు. 2001లో తొలి టెస్ట్ ఫ్లైట్ మొదలు... తేజస్ కూలిపోవడం ఇదే మొదటిసారి. పోఖ్రాన్ ఫైరింగ్ రేంజ్‌లో 'భారత్ శక్తి' పేరిట సైనిక విన్యాసాలు కొనసాగుతున్న వేళ ఈ ఘటన చోటుచేసుకుంది.

సీఏఏ దరఖాస్తుల స్వీకరణకు కొత్త వెబ్ పోర్టల్

న్యూదిల్లీ: లోక్‌సభ ఎన్నికలకు ముందు పౌరసత్వ సవరణ చట్టా (సీఏఏ)న్ని కేంద్ర ప్రభుత్వం అమల్లోకి తెస్తూ నోటిఫికేషన్ జారీ చేసిన సంగతి విదితమే. సీఏఏ కింద దరఖాస్తుల స్వీకరణ కోసం కేంద్ర హోం మంత్రిత్వ శాఖ మంగళవారం కొత్త వెబ్ పోర్టల్ https:/indiancitizen shiponline. nic.inను ప్రారంభించింది. దీంతో పాటు సీఏఏ- 2019 పేరుతో మొబైల్ యాప్‌ను కూడా అందుబాటులోకి తీసుకురానున్నట్లు అధికారులు వెల్లడించారు. పాకిస్థాన్, బంగ్లాదేశ్, అఫ్గానిస్థాన్‌ల నుంచి వలస వచ్చిన ముస్లిమేతర శరణార్థుల వద్ద తగిన పత్రాలు లేకపోయినా వారికి సత్వరం మన పౌరసత్వాన్ని ఇచ్చేందుకు కేంద్రం ఈ చట్టం తెచ్చింది. 2014 డిసెంబరు 31 కంటే ముందు అఫ్గానిస్థాన్, బంగ్లాదేశ్, పాకిస్థాన్ నుంచి భారత్‌కు వచ్చిన హిందువులు, క్రైస్తవులు, సిక్కులు, జైనులు, బౌద్ధులు, పార్సీలకు ఇది వర్తిస్తుంది. పౌరసత్వం పొందేందుకు వీరు ఆయా దేశాల ప్రభుత్వాలు జారీ చేసిన పాస్‌పోర్ట్, జనన ధ్రువీకరణ పత్రం లేదా ఇతర గుర్తింపు పత్రాలను పౌరులు సమర్పించాల్సి ఉంటుంది. దీంతో పాటు 2014 డిసెంబరు 31వ తేదీకి ముందే భారత్‌లోకి ప్రవేశించారని రుజువు చేసే డాక్యుమెంట్లను ఇవ్వాలి. అంటే దేశానికి వచ్చిన సమయంలో వీసా కాపీ, ఇమ్మిగ్రేషన్ స్టాంప్, భారత్‌లో జారీ చేసిన రేషన్ కార్డు, ఇక్కడే జన్మిస్తే జనన ధ్రువీకరణ పత్రం, రిజిస్టర్డ్ రెంటల్ అగ్రిమెంట్, పాన్ కార్డు, విద్యుత్ బిల్లులు, బీమా పాలసీలు, ఈపీఎఫ్, ఈఎస్ఐ, మ్యారేజీ సర్టిఫికేట్ ఇలా ఏదైనా గుర్తింపు కార్డును సమర్పించాలి.

సుప్రీంను ఆశ్రయించిన కాంగ్రెస్ తిరుగుబాటు ఎమ్మెల్యేలు

న్యూదిల్లీ: హిమాచల్ ప్రదేశ్ అసెంబ్లీలో అనర్హతకు గురైన ఆరుగురు కాంగ్రెస్ తిరుగుబాటు ఎమ్మెల్యేలు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. అనర్హతను సవాల్ చేస్తూ పిటిషన్ దాఖలు చేయగా సుప్రీంకోర్టు విచారణకు స్వీకరించింది. పిటిషన్‌పై ఈ నెల 18న విచారణ జరగనుంది. ఇటీవల జరిగిన రాజ్యసభ ఎన్నికల్లో ఆరుగురు ఎమ్మెల్యేలు బీజేపీ అభ్యర్థికి ఓటు వేశారు. దీంతో హిమాచల్ ప్రదేశ్ అసెంబ్లీ స్పీకర్ కుల్దీప్ సింగ్ పఠానియా విప్‌ను ధిక్కరించినందుకు ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేశారు. ఫిబ్రవరి 27న జరిగిన రాజ్యసభ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి హర్ష్ మహాజన్‌కు అనుకూలంగా ఓటు వేసిన కాంగ్రెస్ తిరుగుబాటు ఎమ్మెల్యేలు ఆ తర్వాత బడ్జెట్‌పై ఓటింగ్‌కు దూరంగా ఉన్నారు. కాంగ్రెస్ సీనియర్ నేత అభిషేక్ సింఘ్వీ రాజ్యసభ ఎన్నికల్లో క్రాస్ ఓటింగ్ కారణంగా ఓటమిపాలయ్యారు. ఆ తర్వాత కాంగ్రెస్ అధిష్ఠానం సీరియస్ అయింది. ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేస్తూ నిర్ణయం తీసుకుంది. అనర్హత వేటు పడిన ఎమ్మెల్యేలలో రాజిందర్ రాణా, సుధీర్ శర్మ, ఇందర్ దత్ లఖన్‌పాల్, దేవిందర్ కుమార్ భుత్తు, రవి ఠాకూర్, చేతన్య శర్మ ఉన్నారు. హిమాచల్‌ప్రదేశ్ అసెంబ్లీలో 68 మంది ఎమ్మెల్యేలున్నారు. అనర్హత వేటువేయడంతో వీరి సంఖ్య 62 తగ్గింది. కాంగ్రెస్‌కు ఇంతకు ముందు 40 మంది సభ్యుల బలం ఉండగా ఈ సంఖ్య 36కి పడిపోయింది.

సీట్ల పంపకం త్వరగా తేల్చండి

విపక్ష ఇండియా కూటమి నేతలకు ప్రకాశ్ అంబేద్కర్ లేఖ



ముంబై: రాబోయే లోక్‌సభ ఎన్నికలకు మహారాష్ట్రలో ఇండియా కూటమి పార్టీలు త్వరగా సీట్ల సర్దుబాటును పూర్తి చేయాలని ఎంవీఏ (మహా వికాస్ అఘడి) నేతలను బహుజన్ వికాస్ అఘడి మాజీ చీఫ్, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ మనవడు ప్రకాశ్ అంబేద్కర్ కోరారు. సీట్ల పంపిణీలో జాప్యంపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. పార్టీల మధ్య విభేదాలతో సీట్ల సర్దుబాటులో జాప్యం తలెత్తడంపై ఆయన విచారం వ్యక్తం చేశారు. కాంగ్రెస్, శివసేన (యుబీటీ) మధ్య దాదాపు పది సీట్లపై, కాంగ్రెస్, సేన, ఎన్సీపీ (ఎస్పీ)ల మధ్య దాదాపు ఐదు సీట్లపై ఏకాభిప్రాయం కుదరలేదని తాను అర్థం చేసుకున్నానని, అందుకే ఎంవీఏలో సీట్ల సర్దుబాటు ఖరారు కావడంలో జాప్యం జరుగుతున్నదని ఎంవీఏ నేతలకు రాసిన లేఖలో ఆయన పేర్కొన్నారు. తాను ఏఐసీసీ మహారాష్ట్ర ఇన్‌చార్జ్ రమేశ్ చెన్నితలతో మాట్లాడానని, ఉద్ధవ్ నేతృత్వంలోని శివసేనతో చర్చలు కొలిక్కిరాకపోవడంతో పీటముడి కొనసాగుతున్నదని అన్నారు. బీజేపీ-ఆరెస్సెస్‌లను కూలదోసేందుకు సీట్ల పంపకాలపై నిర్ణయం తీసుకునేందుకు వీలైనంత త్వరగా తనను కలవాలని వీబీఏ నేత ప్రకాశ్ అంబేద్కర్ కాంగ్రెస్‌ను కోరారు. మరోవైపు ప్రకాశ్ అంబేద్కర్‌తో సంప్రదింపులు కొనసాగుతున్నాయని, ఆయన త్వరలో ఇండియా కూటమిలో చేరతారని మహారాష్ట్ర విపక్ష నాయకుడు, కాంగ్రెస్ నేత విజయ్ వడెట్టివర్ తెలిపారు. రాహుల్ గాంధీ చేపడుతున్న యాత్రలో పాల్గొనాలని ఇండియా కూటమి తరపున ప్రకాశ్ అంబేద్కర్‌ను ఆహ్వానిస్తామని చెప్పారు.

ఎన్ఆర్‌సీకి దరఖాస్తు చేయకుండా పౌరసత్వం లభిస్తే రాజీనామా

సీఎం హిమంత బిశ్వశర్మ

గువహటి: పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ) నిబంధనలను కేంద్రం నోటిఫై చేయడంతో అస్సాంలో నెలకొన్న ఆందోళనలపై ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ స్పందించారు. ఈ చట్టంతో లక్షల మంది అస్సాంలోకి ప్రవేశిస్తారనే భయాలు ప్రజల్లో నెలకొనడంపై మాట్లాడారు. అవసరమైతే తాను రాజీనామా చేయడానికైనా సిద్ధమేనని ప్రకటించారు. శివసాగర్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ "నేను అస్సాం పుత్రుడిని. నేషనల్ రిజిస్టర్ ఆఫ్ సిటిజన్స్ (ఎన్ఆర్‌సీ)కి దరఖాస్తు చేయకుండా ఒక్కరికైనా కొత్త చట్టం కింద పౌరసత్వం లభిస్తే... మొదట వ్యతిరేకించే వ్యక్తిని నేనే. ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేస్తా. ఈ చట్టాన్ని వ్యతిరేకించేవారు చెప్పే వారి మాటలు నిజమా... కాదా అనే విషయం పోర్టల్‌లో ఉన్న డేటానే చెప్పనుంది" అని పేర్కొన్నారు. అదే సమయంలో సీఏఏ కొత్త చట్టమేమీ కాదని చెప్పారు. గతంలోనే రాష్ట్రంలో అమల్లోకి వచ్చిందన్నారు. అవసరమైన వారు నిర్దేశిత పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వీధుల్లోకి రావడం వల్ల ఏ ప్రయోజనం లేదని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం సీఏఏ చట్టాన్ని అమల్లోకి తెస్తున్నట్లు ప్రకటించింది... దీంతో 16 పార్టీల కూటమైన అస్సాం యూఓఎఫ్ఏ ఆందోళనలకు పిలుపునిచ్చింది. అప్రమత్తమైన ఆ రాష్ట్ర పోలీసులు వివిధ పార్టీలకు నోటీసులు జారీ చేశారు. ఎట్టి పరిస్థితుల్లో ఆందోళనలు చేపట్టకూడదని, శాంతిభద్రతలకు సహకరించాలని కోరారు. దీనికి విరుద్ధంగా ఎవరైనా ప్రవర్తిస్తే చర్యలు చేపడతామన్నారు. సున్నితమైన ప్రదేశాల్లో భద్రతను కట్టుదిట్టం చేశారు. చెక్‌పోస్టుల వద్ద భద్రతను పెంచారు. 2019లో ఈ చట్టాన్ని ప్రకటించిన సమయంలో గువహటీ సహా పలు ప్రాంతాల్లో హింసాత్మక ఆందోళనలు చోటుచేసుకొన్నాయి. మరికొన్ని రోజుల్లో ఎన్నికల షెడ్యూల్ విడుదల కానుందన్న ప్రచారం నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం సోమవారం సీఏఏను బయటకు తీసింది. పాకిస్థాన్, బంగ్లాదేశ్, అఫ్ఘనిస్థాన్ నుంచి భారత్‌కు శరణార్థులుగా వచ్చిన ముస్లిమేతరులకు పౌరసత్వం కల్పించేలా నోటిఫికేషన్ జారీ చేసింది. దీనిప్రకారం 2014 డిసెంబరు 31కు ముందు ఈ మూడు దేశాల నుంచి వచ్చిన హిందువులు, క్రైస్తవులు, సిక్కులు, జైనులు, బౌద్ధులు, పార్సీలకు దీని కింద పౌరసత్వం ప్రసాదిస్తారు.

మరో 3 నెలలు ఆధార్ అప్‌డేట్‌కు గడువు పొడిగింపు

న్యూదిల్లీ: కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ ఆన్‌లైన్‌లో ఉచితంగా ఆధార్ వివరాలు అప్‌డేట్ చేసుకునేందుకు కల్పించిన గడువును మరోసారి పొడిగించింది. ప్రస్తుత గడువు ఈ నెల 14తో ముగియనుంది. ఈ నేపథ్యంలో ఆధార్ ఉచిత అప్‌డేట్‌కు మరో మూడు నెలలు గడువు ఇస్తున్నట్టు వెల్లడించింది. ఈ మేరకు ఉడాయ్ ఎక్స్‌లో పోస్ట్ చేసింది. దీంతో జూన్ 14 వరకు ఉచితంగా ఆధార్‌లో మార్పులు చేసుకోవచ్చు. ఇప్పటికే రెండుసార్లు గడువును పెంచిన విషయం తెలిసిందే. తొలుత 2023 మార్చి15గా ఉన్న గడువును డిసెంబరు 14 వరకు పొడిగించింది. తర్వాత 2024 మార్చి 14 వరకు అప్‌డేట్ చేసుకునేందుకు అవకాశం కల్పించింది. తాజాగా మరోసారి గడువు తేదీని పొడిగించింది. ఆధార్ అప్‌డేట్ కోసం ప్రజల నుంచి విశేష స్పందన వస్తుండటంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఉడాయ్ ఓ ప్రకటనలో పేర్కొంది. ఆధార్ తీసుకుని పదేళ్లు పూర్తయిన వారు తమ డెమోగ్రఫిక్ వివరాలు అప్‌డేట్ చేయాల్సి ఉంటుంది. ఇందుకోసం ఉడాయ్ వెబ్‌సైట్‌లోకి లాగిన్ అయి లేటెస్ట్ గుర్తింపు కార్డు, అడ్రస్ వివరాలను పొందుపర్చాల్సి ఉంటుంది. రేషన్ కార్డు, ఓటర్ ఐడీ, కిసాన్ ఫొటో పాస్‌బుక్, పాస్‌పోర్ట్ వంటివి గుర్తింపు, చిరునామా రెండింటికీ ధ్రువీకరణ పత్రాలుగా వినియోగించుకోవచ్చు. టీసీ, మార్క్‌షీట్, పాన్, డ్రైవింగ్ లైసెన్స్ వంటివి గుర్తింపు ధ్రువీకరణ పత్రంగా ఉపయోగపడతాయని తెలిపింది. విద్యుత్, నీటి, గ్యాస్, టెలిఫోన్ బిల్లులను (మూడు నెలలకు మించని) చిరునామా ధ్రువీకరణ పత్రంగా వినియోగించుకోవచ్చని ఉడాయ్ పేర్కొంది. ఉచిత సేవలు 'మై ఆధార్' పోర్టల్ ద్వారా మాత్రమే అందుబాటులో ఉంటాయని తెలిపింది. ప్రధానంగా 2010-18 వరకు ఆధార్ నమోదు చేసుకున్న కార్డుదారులు అప్‌డేట్ చేసుకోవాల్సి ఉంటుంది.

బీజేపీలో ఏఐఎస్‌ఎంకే విలీనం

శరత్‌కుమార్ కీలక నిర్ణయం

చెన్నై: లోక్‌సభ ఎన్నికల ముందు తమిళనాట కీలక రాజకీయ పరిణామం చోటుచేసుకుంది. ప్రముఖ తమిళ సినీనటుడు ఆర్.శరత్ కుమార్ తన పార్టీ ఆల్ ఇండియా సమతువ మక్కల్ కట్చి (ఏఐఎస్ఎంకే)ని బీజేపీలో విలీనం చేశారు. తన పార్టీ ఆఫీస్ బేరర్లతో పాటు బీజేపీ తమిళనాడు రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై సమక్షంలో కాషాయ పార్టీలో విలీనం చేసిన విషయాన్ని ప్రకటించారు. చెన్నైలో పార్టీ కార్యకర్తల్ని ఉద్దేశించి మాట్లాడుతూ, ఐక్యతతో పాటు ఆర్థికవృద్ధిని సాధించే దిశగా ప్రధాని మోదీ ఈ దేశాన్ని ముందుకు నడిపిస్తున్నారన్నారు. మాదకద్రవ్యాల మహమ్మారిని అంతం చేసి యువత సంక్షేమానికి భరోసాగా నిలుస్తున్నారని కొనియాడారు. 2026లో తమిళనాడులో జరిగే అసెంబ్లీ ఎన్నికల తర్వాత బీజేపీని అధికారంలోకి తీసుకొచ్చేందుకు కృషి చేయాలని పార్టీ శ్రేణులకు విజ్ఞప్తి చేశారు.

ఆయుధ దిగుమతుల్లో భారత్ నం.1

36 శాతం రష్యా నుంచే

న్యూదిల్లీ: ప్రపంచంలో పెద్ద ఎత్తున ఆయుధాలు దిగుమతి చేసుకుంటున్న దేశాల్లో భారత్ మొదటి స్థానంలోనే కొనసాగుతోంది. స్టాక్‌హోం ఇంటర్నేషనల్ పీస్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ సిప్రి విడుదల చేసిన తాజాగా నివేదిక ప్రకారం 2014 నుంచి 2018తో పోలిస్తే 2019 నుంచి 2023 మధ్య కాలంలో భారత్ 4.7 శాతం ఆయుధాలను అధికంగా దిగుమతి చేసుకుంది. కాగా భారత్‌కు అతిపెద్ద ఆయుధ సరఫరాదారుగా రష్యా మొదటి స్థానంలో కొనసాగుతోంది. భారత్ ఆయుధ దిగుమతుల్లో 36 శాతం రష్యా నుంచే వస్తున్నాయి. అయితే గతంలో భారత ఆయుధ దిగుమతుల్లో రష్యా వాటా 50 శాతం కంటే ఎక్కువగా ఉండేది. ఇప్పుడు తగ్గింది. మరోవైపు ఆయుధాలను దిగుమతి చేసుకుంటున్న దేశాల్లో భారత పొరుగుదేశం పాకిస్థాన్ ఐదో స్థానంలో ఉంది. పాక్ మొత్తం ఆయుధ దిగుమతుల్లో 82 శాతం చైనా నుంచే వస్తున్నాయి. చైనాకు పొరుగు దేశాలైన జపాన్ ఆయుధ దిగుమతులను 155 శాతం, దక్షిణ కొరియా 6.5 శాతం పెంచుకున్నాయి. కాగా చైనా ఆయుధ దిగుమతులు 44 శాతం తగ్గడం గమనార్హం. చైనా ఆయుధ దిగుమతుల్లో ఎక్కువ భాగం రష్యా నుంచే వస్తున్నాయి. 2019-23 మధ్య ఐరోపా దేశాలు దిగుమతి చేసుకున్న ఆయుధాల్లో అమెరికా వాటా 55 శాతంగా ఉంది. ఇది గతంతో పోలిస్తే 35 శాతం పెరిగింది. 2019-23లో ప్రపంచ ఆయుధ సరఫరాలో 30 శాతం పశ్చిమాసియా ప్రాంతానికే వెళ్లాయి. పశ్చిమాసియాలో ఉన్న సౌదీ అరేబియా, ఖతార్, ఈజిప్టు 2019-23లో టాప్-10 ఆయుధ దిగుమతిదారుల్లో ఉన్నాయి. సౌదీ అరేబియా ప్రపంచంలోనే రెండో అతిపెద్ద ఆయుధ దిగుమతిదారు కావడం గమనార్హం. ఈ జాబితాలో ఖతార్ మూడోస్థానంలో ఉంది. ఆయుధాలు ఎగుమతి చేస్తున్న దేశాల్లో అమెరికాదే అగ్రస్థానం. ప్రపంచం ఆయుధ ఎగుమతుల్లో అమెరికా వాటా ఏకంగా 42 శాతంగా ఉంది. చెరో 11 శాతంతో ఫ్రాన్స్, రష్యా ఆ తర్వాతి స్థానాల్లో నిలవగా... 5.8 శాతంతో చైనా నాలుగో స్థానంలో నిలిచింది.

దేశంలో మార్పునకు సమయం ఆసన్నం

ఖట్టర్ రాజీనామాపై కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్

చండీగఢ్: హరియాణా ముఖ్యమంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్ తన పదవికి రాజీనామా చేయడం రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. ఖట్టర్ రాజీనామాపై కాంగ్రెస్ పార్టీ స్పందిస్తూ మోదీ సర్కారుపై తీవ్ర విమర్శలు గుప్పించింది. ఖట్టర్ చర్యతో దేశంలో మార్పునకు సమయం ఆసన్నమైందని పేర్కొంది. "రైతులు, రెజ్లర్ల నిరసనలు, యువత నుంచి వస్తున్న తీవ్ర ఒత్తిళ్ల ఫలితమే నేడు హరియాణాలో కొనసాగుతున్న గందరగోళం. ఖట్టర్ రాజీనామా చేయడంతో దేశంలో మార్పునకు సమయం ఆసన్నమైనట్లు కనిపిస్తోంది. దేశవ్యాప్తంగా ఇవే పరిస్థితులు తలెత్తుతాయ నడంలో సందేహం లేదు" అని కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. కేంద్రంలోని బీజేపీ సర్కారు దేశ యువతకు ద్రోహం చేస్తోందని ఆరోపిస్తూ వారందరికీ న్యాయం జరిగేలా పోరాడతామని కాంగ్రెస్ పేర్కొంది.

పాక్‌తో చర్చలకు తలుపులు మూయలేదు: జైశంకర్

న్యూదిల్లీ: పాకిస్థాన్‌తో చర్చలకు భారత్ తలుపులు ఎప్పుడూ మూయ లేదని విదేశాంగశాఖ మంత్రి ఎస్.జైశంకర్ అన్నారు. ఒకవేళ ఇరు దేశాలు చర్చలు జరపాల్సి వస్తే.. ప్రధానమైన అంశం ఉగ్రవాదమని స్పష్టం చేశారు. ఇటీవల జపాన్, దక్షిణ కొరియా పర్యటన అనంతరం దిల్లీ చేరుకున్న ఆయన... ఓ జాతీయ వార్తా సంస్థ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్నారు. భారత్-పాక్ సంబంధాలు, చైనాతో సరిహద్దు వివాదం, రష్యాతో స్నేహం తదితర అంశాలపై మాట్లాడారు. "పాకిస్థాన్‌తో చర్చలకు తలుపులు మేం ఎప్పుడూ మూయలేదు. పెద్ద సంఖ్యలో ఉగ్రవాద కేంద్రాలు ఉన్న దేశంతో చర్చించాల్సి వస్తే... ముఖ్యంగా దాని గురించే మాట్లాడాలి. ఇతరత్రా సమస్యలు ఉన్నా కూడా ప్రధానంగా ఉగ్రవాదంపైనే చర్చ ఉంటుంది" అని స్పష్టం చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో పాక్ సైన్యంతో భేటీ అయ్యే పరిస్థితులు లేవని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. భారత్-చైనా సంబంధాలపై మాట్లాడుతూ, నాలుగేళ్లుగా ఇరు దేశాల మధ్య సరిహద్దు వివాదంపై చర్చలు జరుగుతున్నా ఎలాంటి ఫలితం వెలువడలేదన్నారు.

కాంగ్రెస్-ఆప్ పొత్తుతో ఫలితం సున్నా: అమిత్‌షా



న్యూదిల్లీ: దిల్లీలో కాంగ్రెస్-ఆప్ పొత్తు వల్ల బీజేపీకి జరిగే నష్టమేమీ లేదని హోంమంత్రి అమిత్‌షా వ్యాఖ్యానించారు. దిల్లీ గ్రామోదయ అభియాన్ కింద 41 గ్రామాల్లో పైప్డ్ నేచురల్ గ్యాస్ సరఫరా లైన్, 178 గ్రామాలలో అభివృద్ధి పనులను అమిత్ షా ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... గతంలో దిల్లీలో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో మొత్తం ఏడు స్థానాలను బీజేపీ గెలుచుకుందని, దిల్లీలో ఆప్, కాంగ్రెస్‌లకు లోక్‌సభ స్థానమే లేదని ఎద్దేవా చేశారు. సున్నా ప్లస్ సున్నా సున్నాగానే మిగిలిపోతుందన్నారు. 'మీరు కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకున్నా, అందులో విలీనం చేసినా ఏమీ జరగదు' అన్నారు. దిల్లీ, గుజరాత్, హర్యానాల్లో రెండు పార్టీల మధ్య పొత్తును ప్రస్తావిస్తూ షా ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ అవినీతి, కుంభకోణాలకు వ్యతిరేకంగా పోరాడి అధికారంలోకి వచ్చానన్న కేజ్రీవాల్ ఇప్పుడు ఆ పార్టీతోనే పొత్తు పెట్టుకుంటున్నారని ఆయనపై మండిపడ్డారు. కేజ్రీవాల్ వరుస స్కామ్‌లకు పాల్పడ్డారని షా ఆరోపించారు. ఎక్సైజ్ కుంభకోణంలో విద్యాశాఖ మంత్రి జైలుకు వెళ్లడం ఇదే తొలిసారి అంటూ విద్యాశాఖ మంత్రి, మాజీ ఉప ముఖ్యమంత్రి మనీష్ సిసోడియాను అరెస్టు చేసిన విషయంపై స్పందించారు. ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలన్నింటినీ అమలుచేస్తూ ప్రధాని మోదీ గత పదేళ్లలో దేశంలో కొత్త సంస్కృతికి నాంది పలికారని షా అన్నారు. మోదీ దేశంలోని 13 కోట్ల మంది తల్లులకు ఎల్పీజీ సిలెండర్లు అందించారు. కోటి మందికి పైపుల ద్వారా గ్యాస్ కనెక్షన్లు, 14 కోట్ల ఇళ్లకు కుళాయిల ద్వారా నీటి సౌకర్యం, 14 కోట్ల మందికి మరుగుదొడ్లు, మూడు కోట్లకు పైగా ఇళ్లు నిర్మించారని షా వివరించారు.

పోఖ్రాన్‌లో ఆకట్టుకున్న సైనిక విన్యాసాలు

జైపూర్: ఆయుధాల తయారీలో భారత్ స్వయం సమృద్ధి దిశగా సాగుతోంది. భారత్ దేశీయంగా అభివృద్ధి చేసిన రక్షణ పరికరాలతో రాజస్థాన్‌లోని పోఖ్రాన్ ఫైరింగ్ రేంజ్‌లో 'భారత్ శక్తి' పేరుతో సైన్యం భారీ సైనిక విన్యాసాలు నిర్వహించింది. ప్రధాని నరేంద్ర మోదీ, 30 దేశాల ప్రతినిధులు ఈ సైనిక విన్యాసాలను తిలకించారు. 50 నిమిషాల పాటు నిర్వహించిన ఈ ప్రదర్శన దేశీయ తయారీ ఆయుధాల పనితీరును మరోసారి ఘనంగా చాటింది. దేశీయ తయారీ తేజస్ యుద్ధవిమానాలు శత్రు శిబిరాలు, బంకర్లు ధ్వంసం చేసే ప్రదర్శన ఆకట్టుకుంది. గ్రాడ్ బీఎం 21 రాకెట్ లాంఛర్లు, ధనుష్ గన్ వ్యవస్థ, శారంగ్ గన్ సిస్టమ్ శత్రువులపై ఎలా విరుచుకుపడతాయనేది ప్రదర్శించారు. కె9 వజ్రా యుద్ధ ట్యాంకు శత్రు బంకర్లను తుత్తునియలు చేసిన తీరు అబ్బురపర్చింది. శత్రు సైన్యాన్ని దెబ్బతీసేందుకు డ్రోన్లను ఎలా వాడతారో సైన్యం ప్రదర్శించింది. ఉభయచర బీఎంపీ -2 వాహనాలు దుమ్మురేపుకుంటూ యుద్ధ క్షేత్రంలో ఎలా దూసుకుపోతాయో చూపించారు. మాడ్యులర్ వంతెన, పదిమీటర్ల షార్ట్ స్పాన్ వంతెనల ఎలా ఉపయోగపడతాయో ప్రదర్శించారు. అర్జున యుద్ధ ట్యాంకుల పని తీరు ఆకట్టుకుంది. వైమానిక దళానికి చెందిన తేలికపాటి యుద్ధ హెలికాప్టర్ ఎల్‌హెచ్ మార్క్-4 చేసిన ఫైరింగ్ అబ్బురపరిచింది. బ్రిడ్జి లేయింగ్ ట్యాంకులతో గగనతల లక్ష్యాలను కూల్చివేసే ప్రక్రియను ప్రదర్శించారు. వాయుసేనకు చెందిన షిక్రా మానవ రహిత విమానాన్ని దేశీయ తయారీ బీఎల్‌టీ-72 ట్యాంకులు క్షణాల్లోనే ధ్వంసం చేశాయి. శత్రువులు పంపే డ్రోన్లను అడ్డుకుని ధ్వంసం చేసే నావల్ యాంటీ డ్రోన్ సిస్టమ్ సత్తా చాటింది. డ్రోన్‌ను ధ్వంసం చేసింది. యుద్ధ క్షేత్రంలో మాటువేసిన శత్రు ట్యాంకులను ధ్వంసం చేసే ప్రక్రియను కళ్లకుగట్టారు. క్విక్ రియాక్షన్ ఫోర్స్ వెహికల్, ఇన్‌ఫాంట్రీ ప్రొటెక్టెడ్ మొబిలిటీ వెహికల్, లైట్ బులెట్ ప్రూఫ్ వాహనాల సాయంతో యుద్ధక్షేత్రంలో సైనికులు ఎలా శత్రువులతో యుద్ధం చేస్తారో సైనికులు ప్రదర్శించారు.

మతాల మధ్య చిచ్చుపెట్టే బీజేపీని వ్యతిరేకించండి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

విశాలాంధ్ర-విజయవాడ: మతాల మధ్య చిచ్చుపెట్టి... ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టడం ద్వారా రానున్న పార్లమెంటు ఎన్నికల్లో రాజకీయంగా పబ్బం గడుపుకుని మళ్లీ అధికారంలోకి వచ్చేందుకు బీజేపీ ప్రభుత్వం ఎన్నికల ముందు సీఏఏ నోటిఫికేషన్ ఇచ్చిందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ పేర్కొన్నారు. సీఏఏ అమలు కోసం కేంద్రం విడుదల చేసిన నోటిఫికేషన్‌ను వ్యతిరేకిస్తూ సీపీఐ, సీపీఎం విజయవాడ నగర సమితుల అధ్వర్యాన మంగళవారం స్థానిక లెనిన్ సెంటర్‌లో జరిగిన నిరసన కార్యక్రమంలో రామకృష్ణ మాట్లాడుతూ... వారం రోజుల్లో ఎన్నికల నోటిఫికేషన్ వస్తుందనగా... సీఏఏను అమలు చేస్తూ నోటిఫికేషన్ ఇవ్వటం దుర్మార్గం అన్నారు. మోదీ ప్రభుత్వం రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో ఓట్లు పొందటానికి మతాల మధ్య చిచ్చుపెట్టి మళ్లీ అధికారంలోకి రావటానికి ప్రయత్నిస్తోందే తప్ప ఏమాత్రం విజ్ఞత ప్రదర్శించటం లేదని, రాజ్యాంగ విలువలు పాటించటం లేదని విమర్శించారు. దేశవ్యాప్తంగా లౌకికశక్తులు, రాజకీయ పార్టీలు, కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు సీఏఏని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయని చెప్పారు. కేరళ, తమిళనాడు రాష్ట్రాలు తమ రాష్ట్రాల్లో సీఏఏ అమలు చేయబోమని ప్రకటించాయన్నారు. మైనార్టీలను లక్ష్యంగా చేసుకుని మతాల మధ్య చీలిక తీసుకు రావటం ద్వారా మెజార్టీ హిందువుల ఓట్లు పొందటం కోసం కుట్ర చేస్తున్న బీజేపీ విధానాన్ని తీవ్రంగా ఖండించారు. అధికారం కోసం దిగజారిన బీజేపీకి తాను చేసిన మంచిపనులు చెప్పుకోవటానికి ఏమీలేక వివాదాస్పద చట్టాన్ని తీసుకువచ్చి ప్రజల్ని రెచ్చగొట్టేందుకు ప్రయత్నిస్తోం దన్నారు. దేశంలో మౌలిక సమస్యలను మోదీ ప్రభుత్వం పరిష్కరించలేక పోయిందని మండిపడ్డారు. పేదరికం, అధిక ధరలు, నిరుద్యోగం, నల్లధనం, రైతుల సమస్యలను పరిష్కరించటంలో బీజేపీ విఫలమైందన్నారు. 140 కోట్ల జనాభాలో దాదాపు 18 కోట్ల మంది ముస్లింలు, అంతే స్థాయిలో క్రైస్తవులు ఉన్నారని చెప్పారు. సకల లౌకిక, ప్రజాతంత్రవాదులు ముక్తకంఠంతో దీనిని వ్యతిరేకించాలని కోరారు. ఎన్నికల బాండ్ల పథకం కింద ఇతర పార్టీల కంటే అధికంగా బీజేపీ ఖాతాలో రూ.6,560 కోట్ల రూపాయలు ఉన్నాయని తెలిపారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆ వివరాలను బయటపెట్టాలని సుప్రీం కోర్టు ధర్మాసనం ఆదేశించిందన్నారు. దురదృష్టవ శాత్తు కేసులకు భయపడి రాష్ట్రంలోని ప్రాంతీయ పార్టీలు బీజేపీకి మద్దతు ఇస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. వైసీపీ, టీడీపీ సీఏఏను వ్యతిరేకించాలని విజ్ఞప్తి చేశారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సీహెచ్ బాబూరావు మాట్లాడుతూ సీఏఏ సమస్య కేవలం ముస్లింల సమస్య మాత్రమే కాదని రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన సమస్యగా పేర్కొన్నారు. పౌరసత్వం ఇచ్చేందుకు మైనార్టీలపై వివక్ష చూపటం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం అన్నారు. గతంలో సీఏఏ బిల్లు తీసుకువచ్చినప్పుడు ప్రజలు, రాజకీయ పార్టీలు తీవ్రంగా వ్యతిరేకించటంతో వెనక్కుతగ్గిన బీజేపీ... ఎన్నికల్లో లబ్ధి కోసమే ఈ సమయంలో సీఏఏ తెరపైకి తెచ్చిందన్నారు. బీజేపీతో ప్రత్యక్షంగా జతకట్టిన టీడీపీ, జనసేన, పరోక్షంగా కలిసి ఉన్న వైసీపీలు సీఏఏ అమలుకు వ్యతిరేకమా? అనుకూలమా? స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. బీజేపీ చర్యకు ఈ పార్టీలకూ బాధ్యత ఉంటుందన్నారు. అన్నివర్గాల ప్రజలు, లౌకిక శక్తులు సీఏఏను వ్యతిరేకించాలని కోరారు. ఈ నిరసన కార్యక్రమానికి సీపీఐ విజయవాడ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు, సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు దోనేపూడి కాశీనాథ్ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జి.ఓబులేసు, ఏఐటీయూసీ రాష్ట్ర నాయకులు ఎస్.వెంకట సుబ్బయ్య, ఇన్సాఫ్ రాష్ట్ర కార్యదర్శి సయ్యద్ అఫ్సర్, సీపీఐ విజయవాడ నగర సహాయ కార్యదర్శి నక్కా వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ ఒకే వేదికపైకి మోదీ, చంద్రబాబు

17న పేటలో టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి బహిరంగసభ

సభ విజయవంతానికి 13 కమిటీల ఏర్పాటు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో ప్రధాని నరేంద్ర మోదీ పర్యటన ఖరారైంది. ఈ నెల 17న చిలకలూరిపేటలో జరిగే ఉమ్మడి బహిరంగ సభను భారీ ఎత్తున నిర్వహించేందుకు టీడీపీ, జనసేన, బీజేపీ ఏర్పాట్లు చేస్తున్నాయి. మోదీ హాజరు కానున్నారు. ఈ మేరకు టీడీపీ అధినేత చంద్రబాబుకు ప్రధాని కార్యాలయం నుంచి సమాచారం అందింది. ఈసభ ద్వారా ఆరు సంవత్సరాలుగా ఎడముఖం, పెడముఖంగా ఉంటున్న మోదీ, చంద్రబాబు తిరిగి ఒకే వేదికపైకి రానున్నారు. 2018లో విభజన అంశాల అమలులో జాప్యం, నిధుల విడుదలలో వివక్షపై బీజేపీతో విభేదించిన టీడీపీ... ఎన్డీయే నుంచి బయటకు వచ్చింది. అదే సమయంలో టీడీపీ ప్రభుత్వంలో భాగస్వామ్యపక్షంగా ఉన్న బీజేపీ కూడా మంత్రివర్గం నుంచి వైదొలగింది. 2019 ఎన్నికల్లో టీడీపీ ఒంటరిగా పోటీ చేసి ఓటమిపాలైంది. ఆ తర్వాత బీజేపీతో దూరమైనందుకు చంద్రబాబు పశ్చాత్తాపం వ్యక్తం చేశారు. ఈలోగా వైసీపీ కేంద్ర ప్రభుత్వానికి చేరువ కావడంతో చంద్రబాబు మరలా బీజేపీకి దగ్గరయ్యే అవకాశం రాలేదు. ఎన్డీయేలో భాగస్వామ్యపక్షంగా ఉన్న జనసేన అధినేత పవన్ కల్యాణ్ రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వ అవినీతి, అరాచకాలను ఢిల్లీ పెద్దలకు వివరించడం... మరోవైపు టీడీపీని తిరిగి ఎన్డీయే కూటమిలో చేర్చుకునేలా తన వంతు కృషి చేశారు. పదేళ్ల తర్వాత టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీలు ఒక్కట య్యాయి. ఈ మూడు పార్టీల మధ్య ఎన్నికల పొత్తులు, సీట్ల సర్దుబాట్లు దాదాపు కొలిక్కి వచ్చాయి. ఈ నేపథ్యంలో చిలకలూరిపేటలో భారీ బహిరంగసభ నిర్వహించాలని నిర్ణయించారు. దీనికి ప్రధాని నరేంద్ర మోదీని ఆహ్వానించగా, ఆయన పర్యటన అధికారికంగా ఖరారైంది. టీడీపీ ఎక్కువ బాధ్యత తీసుకుని పెద్దఎత్తున విజయవంతం చేసేందుకు అవసరమైన కార్యాచరణను రూపొందించింది. ఇందుకు రాష్ట్రంలో అన్ని ప్రాంతాలకు చెందిన మూడు పార్టీల ముఖ్య నేతలతో 13 కమిటీలను ఏర్పాటు చేశారు. సభ ఏర్పాట్లపై మంగళవారం టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ ఉండవల్లి నివాసంలో ప్రత్యేక సమీక్ష నిర్వహించి, సభ విజయవంతానికి చేపట్టాల్సిన చర్యలపై కమిటీ సభ్యులకు దిశానిర్దేశం చేశారు. ఎన్డీయేలో టీడీపీ చేరిన తర్వాత ఇది తొలి సభ కావున, వచ్చే వారికి ఎలాంటి అసౌకర్యం తలెత్తకుండా ఏర్పాట్లు అత్యంత పకడ్బందీగా చేపట్టాల్సి ఉంటుందన్నారు. సభకు లక్షలాది మంది తరలివస్తారని, చరిత్రలో నిలిచేలా దీనిని నిర్వహించేందుకు సమిష్టిగా కృషి చేద్దామని, కమిటీలకు ఇచ్చిన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించి సభ విజయానికి కృషి చేయాలని కోరారు. అధికారంలోకి వచ్చాక ప్రజలకు ఏం చేయబోతున్నామనేదానిపై సభా వేదిక ద్వారా పార్టీ అగ్రనేతలు ప్రజలకు వివరిస్తారని లోకేశ్ మీడియాకు వివరించారు. రాతియుగం నుంచి రాష్ట్రాన్ని స్వర్ణయుగం వైపు నడిపించేందుకే మూడు పార్టీల పొత్తు అని పేర్కొన్నారు. 2014 ఎన్నికల ఫలితాన్ని తిరగరాసేలా ఏపీలో ప్రభంజనం సృష్టించబోతున్నామని ధీమా వ్యక్తం చేశారు.

43 మందితో కాంగ్రెస్ రెండో జాబితా విడుదల

న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల రెండో జాబితాను కాంగ్రెస్ పార్టీ మంగళవారం ప్రకటించింది. ఇప్పటికే 39 మంది అభ్యర్థులతో తొలి జాబితాను ప్రకటిం చిన ఆ పార్టీ... తాజాగా నాలుగు రాష్ట్రాల్లో 43 స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేసింది. అసోం, మధ్యప్రదేశ్, రాజస్థాన్, గుజరాత్, ఉత్తరాఖండ్, దమన్‌దీవ్ పరిధిలోని పోటీ చేయబోయే అభ్యర్థుల జాబితాను పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ వెల్లడించారు. ఈ జాబితాలో ముగ్గురు మాజీ ముఖ్యమంత్రుల కుమారుల పేర్లు ఉన్నాయి. మధ్యప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి కమల్‌నాథ్ కుమారుడు నకుల్‌నాథ్ చింధ్వాడా నుంచి మరోసారి పోటీ చేయనున్నారు. అలాగే రాజస్థాన్ మాజీ సీఎం అశోక్ గెహ్లాత్ కుమారుడు వైభవ్ గెహ్లాత్ జలోర్ నుంచి, గౌరవ్ గగోయ్ అసోంలోని జోర్హాట్ నుంచి పోటీ చేయనున్నారు. గతంలో కలియాబోర్ స్థానం నుంచి ఆయన పోటీ చేశారు. 43 మందిలో జనరల్ కేటగిరీకి చెందిన వారు 10 మంది కాగా, 13 మంది ఓబీసీలు, 10 మంది ఎస్సీ, 9 మంది ఎస్టీ, ఒకరు ముస్లిం మైనారిటీకి చెందినవారని కేసీ వేణుగోపాల్ వెల్లడించారు.

మేఘాలయలో సీఏఏ ప్రభావం ఉండదు: సంగ్మా

షిల్లాంగ్: పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ) అమలు జరిగినంత మాత్రానా తమ రాష్ట్రంపై పెద్దగా ప్రభావం ఉండదని ముఖ్యమంత్రి కాన్రాడ్ సంగ్మా తెలిపారు. రాష్ట్రంలో సీఏఏకు వ్యతిరేకంగా ఆందోళనలు పెద్ద ఎత్తున జరిగాయి. చట్టం ప్రతులను నార్త్‌ఈస్ట్ స్టూడెనంట్స్ ఆర్గనైజేషన్ (ఎన్‌ఈఎస్ఓ) దగ్ధం చేసింది. ఎన్‌ఈఎస్ఓ చైర్మన్ శామ్యూల్ బి.జైర్వా నాయకత్వంలో రాజ్‌భవన్ వద్ద ఖాసీ విద్యార్థుల సంఘం (కేఎస్‌యూ) స్మారకం దగ్గర ఆందోళన జరిగింది. ఈ క్రమంలో ముఖ్యమంత్రి ఓ ప్రకటన చేశారు. 'మేఘాలయకు సంబంధించినంత వరకు సీఏఏ వల్ల పెద్దగా ప్రభావం ఉండదు. ఎందుకంటే ఆరవ షెడ్యూల్ ప్రాంతాలను సీఏఏ నుంచి మినహాయించారు.

ఏఐకేఎస్‌ది అలుపెరుగని పోరాటాల చరిత్ర

రైతుల హక్కులు, పేదలకు భూమి కోసం అగ్రభాగాన నిలిచి పోరాడింది

కిసాన్ సభ బెంగాల్ రాష్ట్ర మహాసభలో రావుల వెంకయ్య

కోల్‌కతా: అఖిలభారత కిసాన్‌సభ కర్షకులు, పేదల కోసం అలుపెరుగని పోరాటాలు చేసిందని ఏఐకేఎస్ జాతీయ అధ్యక్షుడు రావుల వెంకయ్య తెలిపారు. స్వాతంత్ర అనంతరం రైతుల హక్కుల కోసం పోరాటాల్లో కీలక పాత్ర పోషించిందని, పాలక వర్గాలకు వ్యతిరేకంగా పోరాడిందని అన్నారు. ఏఐకేఎస్ పశ్చిమ బెంగాల్ రాష్ట్ర మహాసభలు నదియా జిల్లాలోని చెక్‌డ్యాం పట్టణంలో ఈనెల 10,11 తేదీలలో జరిగాయి. 19 జిల్లాల నుంచి 250 మంది ప్రతినిధులు హాజరయ్యారు. అధ్యక్ష వర్గంగా ఆశోక్‌సేన్, రంజిత్ సర్కార్, జితేంద్రనాథ్ మండల్, జూలేమైతి, కల్హా అధికారి వ్యవహరించారు. రావుల వెంకయ్యతో పాటు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి సోహన్ బెనర్జీ ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. తొలుత కిసాన్‌సభ జెండాను రావుల వెంకయ్య ఆవిష్కరించి మహాసభలను ప్రారంభించారు. రాబోయే కాలంలో బెంగాల్‌లో బలమైన సంఘ నిర్మాణానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని రావుల వెంకయ్య పిలుపునిచ్చారు. అఖిల భారత కిసాన్ సభ స్థాపన నాటి నుంచి నేటి వరకు జరిపిన పోరాటాలు, కార్యక్రమాల గురించి సోదాహరంగా వక్తలు వివరించారు. 1936 లక్నోలో స్థాపించిన తరువాత నిజాం నవాబ్‌కు వ్యతిరేకంగా జరిపిన సాయుధ రైతాంగ పోరాటం గురించి మాట్లాడారు. ఈ పోరాటంలో 4,000 మంది అమరులయ్యారని, 10 లక్షల ఎకరాల భూమిని నిరుపేదలకు పంచిపెట్టినట్లు గుర్తుచేశారు. కేరళలోని తిరువాణ్‌కూర్ ప్రభువుకు వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో అగ్రభాగంలో నిలిచినట్లు తెలిపారు. జమ్మూకశ్మీర్‌లో రాచరికాన్ని రద్దు చేయాలని ముందుండి పోరాడినట్లు చెప్పారు. కౌలు రైతుల హక్కుల కోసం బెంగాల్‌లో జరిపిన తెబాగా ఉద్యమాన్ని గుర్తు చేశారు. స్వాతంత్ర పోరాటంలో ఏఐకేఎస్ క్రియాశీలంగా పాల్గొందన్నారు. మోదీ ప్రభుత్వం తెచ్చిన మూడు నల్ల చట్టాలను రద్దు చేయాలని 13 నెలలపాటు జరిపిన రైతాంగ ఐక్య పోరాటంలోనూ కిసాన్ సభ క్రియాశీల పాత్ర వహించిందన్నారు. మోదీ ప్రభుత్వం మెడలు వంచి వాటిని ఉపసంహరించటంతో పాటు రైతాంగానికి క్షమాపణలు చెప్పిందని గుర్తుచేశారు. ప్రతి సంవత్సరం సభ్యత్వం చేర్పించాలని ఔరంగాబాద్ మహాసభ తీర్మానించిందని, సంఘాన్ని బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరు తమ వంతు కృషి చేయాలని నాయకులు పిలుపునిచ్చారు.

దేశం కోసమే అభివృద్ధి కార్యక్రమాలు: మోదీ

అహ్మదాబాద్: దేశం కోసమే తప్ప రానున్న ఎన్నికల్ని దృష్టిలో ఉంచుకొని తమ ప్రభుత్వం అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడం లేదని ప్రధాని నరేంద్ర మోదీ తెలిపారు. గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో దేశవ్యాప్తంగా రూ. 85 వేల కోట్ల విలువైన రైల్వే ప్రాజెక్టులకు మంగళవారం మోదీ వర్చువల్‌గా శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. ' నా జీవితాన్ని రైలు పట్టాలపైనే ప్రారంభించా. గతంలో మన రైల్వేల పరిస్థితి ఎంతో అధ్వాన్నంగా ఉండేది. అందుకే ఆ కష్టాల గురించి నాకు బాగా తెలుసు. గత తరాలు అనుభవించిన బాధలను భవిష్యత్తు తరాలకు ఇవ్వకుండా ఉండడమే మోదీ గ్యారెంటీ' అని ఆయన అన్నారు. పదేళ్లుగా రైల్వేల అభివృద్ధికి బీజేపీ ప్రభుత్వం ఎంతో కృషి చేసిందన్నారు. గతంతో పోలిస్తే ఆరింతల అధిక మొత్తాన్ని ఖర్చు పెట్టినట్లు తెలిపారు. కేవలం రెండు నెలల్లోనే రూ. 11 లక్షల కోట్ల విలువైన ప్రాజెక్టులకు ప్రారంభోత్సవాలు/శంకుస్థాపనలు చేశామని మోదీ పేర్కొన్నారు. ప్రత్యేక రైల్వే బడ్జెట్‌ను నిలిపివేసి కేంద్ర బడ్జెట్‌లో చేర్చామని.. దీన్ని వల్ల ప్రభుత్వ నిధులు రైల్వేల అభివృద్ధికి వినియోగించేలా తోడ్పడుతుందని అన్నారు. అయోధ్య కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన 350 ఆస్తా రైళ్ల ద్వారా ఇప్పటివరకు 4.5లక్షల మందికి శ్రీరాముడి దర్శనం కల్పించామని అన్నారు. భారత్‌ను యువకుల దేశంగా అభివర్ణించిన ప్రధాని- అత్యంత ఎక్కువ యువశక్తి భారత్‌లో ఉందని చెప్పారు. తాము వేసే పునాదులు యువత దివ్యమైన భవిష్యత్‌కు గ్యారంటీ అని ఉద్ఘాటించారు. తమ పది సంవత్సరాల పని కేవలం ట్రైలర్ మాత్రమేనని చెప్పిన మోదీ- మరింత ముందుకు వెళ్లాల్సి ఉందన్నారు.

51కి చేరిన వందేభారత్‌లు : ఈ కార్యక్రమంలో మొత్తం 10 వందేభారత్ రైళ్లను వర్చువల్‌గా ప్రారంభించారు. సికింద్రాబాద్-విశాఖ, కలబురగి-బెంగళూరుతో పాటు లక్నో-డెహ్రాడూన్, పాట్నా-లక్నో, న్యూ జల్పాయ్‌గురి-పాట్నా, పూరి-విశాఖపట్నం, రాంచీ-వారణాసి, ఖజురహో-ఢిల్లీ, అహ్మదాబాద్-ముంబయి, మైసూరు-చెన్నై మార్గాల్లో మొత్తం 10 రైళ్లను ప్రధాని మంగళవారం ప్రారంభించారు.

మతం ఆధారంగా పౌరసత్వమా?

- కేంద్రం చర్య రాజ్యాంగ విరుద్ధం : ఎన్నికల్లో లబ్ధి కోసమే కేంద్రం మత రాజకీయం
- సీఏఏ అమలుపై విపక్షాల మండిపాటు

న్యూఢిల్లీ: పౌరసత్వ (సవరణ) చట్టం (సీఏఏ) అమలు విషయంలో కేంద్రంలోని మోదీ సర్కారుపై విపక్ష నేతలు నిప్పులు చెరిగారు. లోక్‌సభ ఎన్నికలకు ముందు కేంద్ర ప్రభుత్వం సీఏఏ నోటిఫికేషన్ జారీ చేయడంపై విపక్షాలు భగ్గుమన్నాయి. సీఏఏ అమలును సవాల్ చేస్తూ సుప్రీంకోర్టును ఆశ్రయించాలని విపక్షాలు యోచిస్తున్నాయి. ఎన్నికలకు ముందు సీఏఏ నోటిఫికేషన్ జారీపై కాంగ్రెస్, టీఎంసీ, శివసేన (యూబీటీ), ఎస్పీ సహా విపక్ష పార్టీలు మండిపడు తున్నాయి. కేంద్రం చర్య రాజ్యాంగ విరుద్ధమని పేర్కొన్న కాంగ్రెస్ ఎంపీ శశి థరూర్ రానున్న లోక్‌సభ ఎన్నికల్లో విపక్ష ఇండియా కూటమి అధికారంలోకి వస్తే సీఏఏను రద్దు చేస్తామని ప్రకటించారు. సీఏఏ చట్టంలో లోటుపాట్లను ప్రస్తావించిన శశి థరూర్ సీఏఏ నైతికంగా, రాజ్యాంగపరంగా సరైంది కాదని స్పష్టం చేశారు. విభజన ప్రాతిపదికపై ఓ దేశం మతమే తమ దేశ ప్రాతిపదిక అని చెబుతుండగా, మహాత్మ గాంధీ, నెహ్రూ, మౌలానా అజాద్, డాక్టర్ అంబేద్కర్ మన జాతీయతకు మతం ప్రాతిపదిక కాదని చెప్పారని గుర్తు చేశారు. స్వాతంత్ర్యం కోసం తమ పోరాటం అందరి కోసమని, మనం తయారుచేసుకున్న రాజ్యాంగం, దేశం ప్రతి ఒక్కరి కోసమని శశి థరూర్ పేర్కొన్నారు. లోక్‌సభ ఎన్నికలకు ముందు కేంద్ర ప్రభుత్వం సీఏఏ నోటిఫికేషన్ జారీ చేయడంపై శివసేన (యూబీటీ) ప్రతినిధి ఆనంద్ దూబే విస్మయం వ్యక్తం చేశారు. పదేళ్ల కిందట ప్రవేశపెట్టిన సీఏఏను ఎన్నికల షెడ్యూల్ విడుదలకు నాలుగు రోజుల ముందు అమలు చేసేందుకు పూనుకోవడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. ఎన్నికల కోసమే ఇదంతా చేస్తున్నారని బీజేపీని ఉద్దేశించి దూబే విమర్శలు గుప్పించారు. ఎన్నికల వాతావరణాన్ని ప్రభావితం చేసేందుకు సీఏఏ అమలు ద్వారా దేశంలో అరాచక పరిస్థితులు నెలకొనేలా బీజేపీ వ్యవహరిస్తోందని దుయ్యబట్టారు.

ఇది బీజేపీ లూడో గేమ్: మమత

బెంగాల్‌లోని హబ్రాలో జరిగిన అడ్మినిస్ట్రేటివ్ సమావేశంలో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి మమతా బెనర్జీ మాట్లాడుతూ... పౌరసత్వ హక్కులను హరించేందుకు బీజేపీ కుట్ర పన్నుతోందన్నారు. సీఏఏ చట్టబద్ధతపై తనకు అనుమానం ఉందని, దీనిపై ఎలాంటి స్పష్టత లేదని... ఇది ప్రజల్ని తప్పుదోవ పట్టించే ప్రచారమని వ్యాఖ్యానించారు. నోటిఫై చేసిన నిబంధనలలో స్పష్టత లేదని, వాటికి చట్టపరమైన చెల్లుబాటు ఉందా అనే సందేహం ఉందని అన్నారు. చట్టం ప్రకారం పౌరసత్వం కోసం దరఖాస్తు చేసుకునే ముందు ప్రజలు అన్ని విధాలుగా ఆలోచించాలని కోరారు.

పొత్తు సరే... సయోధ్య ఎలా?

- బీజేపీ, జనసేనకు కేటాయించే స్థానాలపై టీడీపీ నేతల అంతర్మథనం
- ఏ సీటు ఏ పార్టీకి కేటాయిస్తారోనని టెన్షన్
- విబేధాలు వీడి కలిసి పనిచేయాలి: చంద్రబాబు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: వైసీపీ ప్రభు త్వాన్ని గద్దె దించడమే లక్ష్యంగా తెలుగుదేశం పార్టీ జనసేన, బీజేపీలతో ఎన్నికల పొత్తు కుదుర్చుకుంది. పొత్తులో భాగంగా జనసేన, బీజేపీ పార్టీలకు 8 ఎంపీ సీట్లు, 31 అసెంబ్లీ స్థానాలను టీడీపీ కేటాయించింది. బీజేపీ అరకు, విజయనగరం, అనకాపల్లి, రాజమహేంద్రవరం, నరసాపురం, తిరుపతి పార్లమెంటు నియోజకవర్గాల నుంచి పోటీ చేయాలని నిర్ణయించింది. కాకినాడ, మచిలీపట్నం నియోజకవర్గాల నుంచి జనసేన అభ్యర్థులు పోటీ చేయనున్నారు. ఈ మేరకు మూడు పార్టీల మధ్య ఒప్పందం కుదిరింది. ఇక రెండు పార్టీలకు కలిపి కేటాయించిన 31 అసెంబ్లీ స్థానాల్లో 21 నియోజకవర్గాల నుంచి జనసేన, 10 నియోజకవర్గాల నుంచి బీజేపీ అభ్యర్థులు పోటీ చేయనున్నారు. జనసేన పార్టీ తనకు కేటాయించిన 21 స్థానాల్లో ఇప్పటికే 6 నియోజకవర్గాలకు అభ్యర్థులను ప్రకటించింది. ఆయా నియోజకవర్గాల అభ్యర్థిత్వాలను ఆశిస్తున్న టీడీపీ నేతలకు ఆపార్టీ అధినేత చంద్రబాబు ఇప్పటికే సర్ది చెప్పారు. ఇంకా రెండు పార్టీలకు కలిపి కేటాయించే 25 స్థానాలపై రేపో, మాపో స్పష్టత రానుంది. తెలుగుదేశం పార్టీ ఇప్పటివరకు 94 అసెంబ్లీ నియోజకవర్గాలకు అభ్యర్థులను ప్రకటించింది. మరో 50 స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేయాల్సి ఉంది. ఈ నేపథ్యంలో ఇంకా మూడు పార్టీలకు కలిపి మొత్తం ఖరారు కావల్సిన అసెంబ్లీ నియోజకవర్గాలు 75 ఉన్నాయి. ఈ స్థానాల్లో ఏ పార్టీకి ఏది కేటాయిస్తారో అర్థంగాక ముఖ్యంగా టీడీపీ నేతల్లో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. ఇప్పటికే బీజేపీ కేటాయించిన 6 పార్లమెంటు నియోజకవర్గాల్లో టీడీపీ నేతలు ఓటర్లకు ఎలా సర్దిచెప్పాలి, రాష్ట్రానికి గత పదేళ్లుగా తీవ్ర అన్యాయం చేసిన బీజేపీకి ఓటు వేయమని ఎలా అడగాలి ? క్షేత్రస్థాయిలో మూడు పార్టీలకు చెందిన కార్యకర్తల మధ్య సయోధ్య ఎలా చేయాలనే దానిపై అంతర్మథనం చెందుతున్నారు. అమరావతి రాజధానికి శంకుస్థాపన చేసిన ప్రధాని మోదీ, ఆ తర్వాత దాని గురించి పట్టించుకోలేదు. వైసీపీ ప్రభుత్వం దాని విధ్వంసానికి అన్నిరకాల ప్రయత్నాలు చేసినా వాటిని కనీసం వారించే సాహసం కూడా చేయలేదు. రాజధాని నిర్మాణం కోసం భూములు ఉచితంగా ఇచ్చిన రైతులపై వేల సంఖ్యలో అక్రమ కేసులు బనాయించి, వారిని అన్ని విధాలా వైసీపీ ప్రభుత్వం వేధించింది. దానిపై ప్రధాని కనీసం నోరు కూడా మెదపలేదు. నాలుగేళ్ళుగా అమరావతి రైతులు ఉద్యమాన్ని కొనసాగిస్తున్నారు. అలాగే విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కార్మికులు రెండేళ్లుగా పోరాడుతున్నారు. వీటిపై మోదీ స్పందన శూన్యం. ఇక విభజన అంశాలు పదేళ్ళు పూర్తి కావస్తున్నా ఇప్పటివరకు ఏ ఒక్కటీ పూర్తిస్థాయిలో అమలుకు నోచుకోలేదు. ఏపీకి ఇంత అన్యాయం చేసిన బీజేపీని రేపట్నుంచి ఎలా సమర్థించాలని టీడీపీ శ్రేణులు ప్రశ్నిస్తున్నాయి. రాష్ట్రంలో ఒక్క వార్డు మెంబరు కూడా ఒంటరిగా గెలవలేని, ఒక్క శాతం ఓటింగ్ కూడా లేని బీజేపీకి 6 ఎంపీ, 10 అసెంబ్లీ స్థానాలు కేటాయించడాన్ని తెలుగు తమ్ముళ్లు జీర్ణించుకోలేక పోతున్నారు. బీజేపీకి కేటాయించిన ఎంపీ స్థానాల కంటే వారికి కేటాయించబోయే ఎమ్మెల్యే స్థానాలపై వారిలో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. గత ఐదు సంవత్సరాలుగా ప్రజా సమస్యలపై నిత్యం పోరాడుతూ, మరోప్రక్క వైసీపీ ప్రభుత్వం బనాయించిన అనేక అక్రమ కేసుల్లో ఇరుక్కుని కొందరు టీడీపీ నేతలు ఆర్థికంగా చితికిపోయారు. ఇటువంటి వారు మరింత మానసిక వేదనకు గురవుతున్నారు. పార్టీ అధినేత నిర్ణయానుసారం తాము సీటు త్యాగం చేసినా, దిగువస్థాయిలో పార్టీ శ్రేణులకు ఎలా నచ్చజెప్పాలో అర్థంకావడం లేదని కొందరు నేతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నేతలతో చంద్రబాబు టెలికాన్ఫరెన్స్

అమరావతి: రాష్ట్ర పునర్ నిర్మాణం కోసమే మూడు పార్టీల పొత్తు అని తెలుగుదేశం అధినేత చంద్రబాబు స్పష్టం చేశారు. వైకాపా విధ్వంస పాలన నుంచి రాష్ట్రాన్ని కాపాడుకోవటం కోసం మళ్లీ మూడు పార్టీలు చేతులు కలిపాయన్నారు. ఈ పొత్తు జగన్‌ను ఓడించడం కోసమే కాదు.. రాష్ట్రాన్ని గెలిపించడం కోసమని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా తెలుగుదేశం బూత్ స్థాయి కార్యకర్తలు, నాయకులతో చంద్రబాబు టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. కింది స్థాయిలో నేతలు, కార్యకర్తలు కలిసి ముందుకెళ్లాలని సూచించారు. విభేదాలను పక్కన పెట్టి, సీటు ఎవరికిచ్చినా గెలుపే ఒక్కటే లక్ష్యంగా పనిచేయాలని కోరారు. ఈ ఎన్నికల్లో ప్రతి ఓటు.. ప్రతి సీటు ముఖ్యమేనన్నారు. టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి 160కి పైగా సీట్లు సాధించాలని, అందుకోసం పార్టీ శ్రేణులు సర్వశక్తులూ ఒడ్డాలని పిలుపునిచ్చారు. వాడవాడలా మూడు జెండాలు కలిసి సాగాలని కోరారు. అలాగే పార్టీ నేతలు, అభ్యర్థులు ప్రతి అంశాన్ని ఎన్నికల కమిషన్ దృష్టికి తేవాలని సూచించారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలైన తరువాత వైసీపీ ఆగడాలు, తప్పుడు విధానాలు అవలంబిస్తున్న అధికారుల ఆటలు సాగవని చంద్రబాబు హెచ్చరించారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2024-26, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.